మాటల్
గత వారం రోజుల్లో బెస్ట్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 204 పేజీలు: 8+4 వెల: 8.00


మరో రెండు వారాల్లో జిన్‌పింగ్ అమెరికా పర్యటన 5లో

అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఇ-బోర్డింగ్ పాస్

# 10 వేల పోస్టులకు గ్రీన్ సిగ్నల్

## నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు

### గ్రూప్-1లో 149, గ్రూప్-2లో 673 ఉద్యోగుల భర్తీ

### డిఎస్సీ ద్వారా 2991 ఉపాధ్యాయ నియామకాలు

### సెప్టెంబరు, అక్టోబరులో నోటిఫికేషన్లు: జాబ్ కేలండర్ విడుదల

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 10,060 పోస్టుల వివరాలతోకూడిన జాబ్ కేలెండర్ 2026ను విడుదల చేసింది. నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ నోటిఫికేషన్లు రానున్నాయి. గ్రూప్1లో 149 పోస్టులు, గ్రూప్2లో 673 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. అలాగే పోలీసు, ఫైర్, జైళ్లు, అటవీ, పశు సంవర్ధకశాఖ, ఎక్సైజ్, ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. డిఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో చూడాలని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆర్థికశాఖ అధికారులు జీవో విడుదల చేశారు. శాసనసభలో ప్రకటించినట్లుగానే జాబ్ క్యాలెండర్2026 విడుదలకు అనువుగా ఆర్థికశాఖ 10,060 పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. విద్య, వైద్యం, శాంతి భద్రతల విభాగాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చింది. జాబ్ క్యాలెండర్ 2026 విడుదలకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ జీవో నంబర్ 81 జారీ చేశారు. ఎపిపిఎస్సి, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, డిఎస్సీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. నాలుగు దశల్లో ఈ నియామకాలు జరగనున్నాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మొదటి దశలో ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,523 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు. మిగిలిన మూడు దశల నోటిఫికేషన్ల కోసం ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో దశ నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 విడుదలకానుంది. ఈదశలో మొత్తం 3,231 పోస్టులకు నోటిఫికేషన్లు రానున్నాయి. ఇందులో 149 గ్రూప్1 పోస్టులు ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లు 11, డిఎస్పీ సివిల్ 36, పంచాయతీ రాజ్ డిడిఒలు 35 పోస్టులతో పాటు మున్సిపల్ కమిషనర్, కమర్షియల్ >>2



శనివారం విజయవాడలో వెలిగొండ ప్రాజెక్టునిర్వాసితులకు చెక్కును అందజేసిన సిఎం చంద్రబాబు

# వారంలో వెలిగొండ సాకారం

### 31న ప్రాజెక్టు మొదటిదశ ప్రారంభించి నీరు విడుదల చేస్తా: సిఎం చంద్రబాబు

### నిర్వాసితులకు 3వ విడతలో రూ. 250 కోట్లు చెల్లింపు

**విజయవాడ.ఆగస్టు 22:, ప్రభాతవార్తప్రతినిధి:** మూడు దశాబ్దాల వెలిగొండ కల సాకారమయ్యిందని సిఎం చంద్రబాబు అన్నారు.ఈ వెలగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేసానని,తానే ప్రారంభిస్తున్నానని సిఎం స్పష్టం చేసారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 యేళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశను ప్రారంభించి నీళ్లు విడుదలచేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శనివారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సిఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సిఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా >>2



శనివారం గుంటూరులో నిరసన చేస్తున్న వైద్యులు

## జూడాల సమ్మె ఉధృతం

### గుంటూరులో కొనసాగిన నిరసనలు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 22, ప్రభాత వార్త:** జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 13వ రోజుకు, మూడో దశ ఆందోళన ఆరో రోజుకు చేరుకుంది. గుంటూరు వైద్య కళాశాలకు చెందిన రెసిడెంట్ వైద్యులు, ఇంటర్న్‌లుగుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని సూపరింటెండెంట్ >>2

# టైమ్, డేట్ ఫిక్స్‌చెేయ్.. వస్తా

### డిఎస్సీపై జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరిన మంత్రి లోకేష్

### కార్యకర్తల సంక్షేమానికి రూ. 160 కోట్లు ఖర్చు చేసామన్న మంత్రి

**విజయనగరం, ఆగస్టు 22 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తను గుర్తించి సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదేనని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. కార్యకర్తలు తనను వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదని, కష్టపడే కార్యకర్తలను తానే వెతుక్కుంటూ వస్తానని స్పష్టం చేశారు. విజయనగరం నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేష్ కార్యకర్తల >>2



శనివారం విజయనగరంలో కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్

## విశాఖ వేదికగా బ్రిక్స్ కొత్త క్రీడా బంధం ఆవిష్కరిద్దాం 2లో

### బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్వర్క్ ఏర్పాటుకు పిలుపు

బ్రిక్స్ దేశాల యువజన, క్రీడల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమంలో సిఎం చంద్రబాబు







శనివారం విశాఖలో బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశంలో సిఎం చంద్రబాబు

## విశాఖ వేదికగా బ్రిక్స్ కొత్త
# క్రీడా బంధం ఆవిష్కరిద్దాం

**విశాఖపట్నం, ఆగస్టు 22 ప్రభాతవార్త:** భాష, సంస్కృతి, భౌగోళికంగా విభిన్నమైన బ్రిక్స్ దేశాలను క్రీడలు, యువత ఒక్కటిగా కలుపుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశాలకు విశాఖ వేదిక కావడం గర్వకారణమని సిఎం వ్యాఖ్యానించారు. క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని. అవి సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానానికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు విశాఖ కేంద్రంగా 'బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్రిక్స్ యువజన, క్రీడామంత్రుల సమావేశాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం, అధికారిక విందు కార్యక్రమంలో సిఎం చంద్రబాబు మాట్లాడారు. విశాఖపట్నంనగరానికి సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుందని.. భారత తూర్పు తీరానికి ఈ నగరం ఆభరణమని సిఎం అభివర్ణించారు. ఉద్యోగాలు, ప్రతిభకు సంబంధించి వరుసగా రెండో యేడాది విశాఖ దేశంలోనే నంబర్‌వన్ సిటీ ఆన్ ద రైజ్‌గా గుర్తింపు పొందిందని, మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లోనూ విశాఖకు స్థానం దక్కిందని తెలిపారు. వ్యూహాత్మక మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీఇన్నోవేషన్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. సుదీర్ఘ తీరప్రాంతం, నైపుణ్యం కలిగిన యువత, ఆతిథ్యంఇచ్చే ప్రజలతో విశాఖ నూతన భారతదేశ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలున్నాయని పేర్కొన్నారు. క్రీడలతో ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక ప్రగతిసాంకేతికత ఆధారిత జీవన విధానంలో యువతలో ఒత్తిడి పెరుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఒత్తిడిని అధిగమించి మానసిక దృఢత్వాన్ని పెంచుకోవడానికి క్రీడలు, యోగా, ధ్యానం దోహదపడతాయని చెప్పారు. ఆరోగ్యవంతమైన పౌరులతో ఆరోగ్యకరమైన సమాజం, ఓ బలమైన ఉత్పాదకశక్తి కలిగిన దేశం నిర్మితం అవుతుందన్నారు. క్రీడల ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, ట్రైనర్లు, ఫిజియోథెరపిస్టులు, ఈవెంట్ మేనేజర్లు, పారిశ్రామికవేత్తలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. అపెక్స్ 2036 ద్వారా గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వ్యవస్థను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిభను గుర్తించి శాస్త్రీయ శిక్షణ ద్వారా 2036 ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ క్రీడా పోటీలకు సిద్ధం చేస్తామని అన్నారు. 28 జిల్లాల్లో 56 రెసిడెన్షియల్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి అకాడెమీలు, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ లతో వాటిని అనుసంధానిస్తామన్నారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ.. నెల్లూరులో క్రీడా తయారీ హబ్‌అమరావతి స్పోర్ట్స్ సిటీని కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సిఎం వివరించారు. నెల్లూరులో క్రీడా ఉపకరణాల తయారీ, అపారెల్ టెక్నాలజీ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. విశాఖను అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎపిలో శిక్షణ, ఆవిష్కరణ, తయారీ అనే విధానంలో ఓ సమగ్ర ఎకో సిస్టమ్‌ను రూపొందిస్తామన్నారు. బ్రిక్స్ దేశాల్లో ఉన్న ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని కలసి నేర్చుకోడానికి సహకరించడానికి దీర్ఘ కాలిక భాగస్వామ్యాలకు ఏపీ సిద్ధంగా ఉందని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, విశ్వవిద్యాలయాలు, స్పోర్ట్స్ నిపుణులు, స్టార్టప్‌లు, పారిశ్రామిక వేత్తలను అనుసంధానించాలని అన్నారు. క్రీడా ఉపకరణాల తయారీ, హై పెర్ ఫార్మెన్స్ ట్రైనింగ్, వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో భాగస్వామ్యాలకు ముందుకు రావాలని బ్రిక్స్ దేశాలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయటమే లక్ష్యంగా బ్రిక్స్ సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రి మన్సుక్ మాండవియా, సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, రాంప్రసాద్ రెడ్డి గాలా డిన్నర్ లో భాగస్వామ్యమయ్యారు.

# 10 వేల పోస్టులకు గ్రీన్ సిగ్నల్

>> టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఇందులో ఉన్నాయి. ఇక ఇదే దశలో పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో భారీగా కొలువులు భర్తీ చేయనున్నారు. 542 సివిల్ కానిస్టేబుల్స్, 205 ఏఆర్ కానిస్టేబుల్స్, 182 సివిల్ ఎస్సై, 116 ఏఆర్ ఎస్సై పోస్టులు నోటిఫై కానున్నాయి. ఫైర్ మెన్, జైలు వార్డర్ పోస్టులు, 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఈ ఫేజ్ లోనే భర్తీ కానున్నాయి.
మూడో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశలో మొత్తం 2,311 పోస్టులను భర్తీ చేస్తారు. ప్రధానంగా గ్రూప్2 అభ్యర్థులకు ఇది కీలకమైన దశ. 673 గ్రూప్2 పోస్టుల్లో రెండు వందలు డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీవో, 40 జిఎస్టీ ఆఫీసర్ (ఎసిటిఒ) పోస్టులు ఉన్నాయి. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు 25, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల్లో ఎఇఇ పోస్టుల భర్తీ కూడా ఇదే దశలో ఉండబోతోంది. ఇరిగేషన్‌లో 224, పంచాయతీరాజ్‌లో 173, రోడ్లుభవనాల శాఖలో 79 ఎఇఇ పోస్టులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఏకంగా 629 ఎఇఇ పోస్టుల భర్తీకి అక్టోబర్ 15న ప్రకటన వెలువడనుంది. నాలుగో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశ పూర్తిగా ఉపాధ్యాయ కొలువులకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా డిఎస్సీ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ తదితర ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను జిల్లాల వారీగా డిఎస్సీలు త్వరలోనే ప్రకటించనున్నాయి. ప్రెసిడెన్షియల్ ఆర్డర్2025, రిజర్వేషన్లు, రోస్టర్ విధానాలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఈ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖలన్నీ రిక్రూటింగ్ ఏజెన్సీలకు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లను పంపాలని జీవోలో పేర్కొంది. ప్రణాళికాబద్ధంగా నోటిఫికేషన్ల తేదీలను ముందుగానే ప్రకటించడంతో సన్నద్ధతకు అభ్యర్థులకు సమయం ఉంది.
ఎపిపిఎస్సి, డిఎస్సీ వంటి ఏజెన్సీలు ఈ ప్రభుత్వ కొలువుల కోసం నియామక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఈ పరీక్షలన్నింటిని ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా కంప్యూటర్ ఆధారితంగానే నిర్వహించాలన్నది ప్రభుత్వ యోచన. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎటువంటి వివక్ష లేకుండా ఈ ఎంపిక ప్రక్రియలో సమాన అవకాశాలు ఇవ్వాలన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి వివరాలు సంబందిత వెబ్‌సైట్‌లో చూడాలని ప్రభుత్వం తెలిపింది.

# జూడాల సమ్మె ఉద్ధృతం

>> కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు. ఉదయం స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల రిజిస్ట్రార్ సంఘం, వైద్య పరిశోధన మరియు పరిశ్రమల సంఘం ప్రతినిధులు నిరసన ప్రదేశాన్ని సందర్శించి రెసిడెంట్ వైద్యులు, ఇంటర్న్‌లకు సంఘీభావం తెలిపారు. అలాగే ప్రజలు, ఆందోళనలో పాల్గొంటున్న వారితో 'ఈ సమ్మె గురించి ఒక్క మాటలో ఏమి చెప్పాలనుకుంటున్నారు?' వంటి ప్రశ్నల ద్వారా పరస్పర చర్చలు నిర్వహించారు. సమ్మెపై ప్రజల అవగాహన, స్పందనను తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల సంఘం ప్రతినిధులు కూడా నిరసన ప్రదేశాన్ని సందర్శించి జూనియర్ వైద్యుల న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. అనంతరం జూనియర్ వైద్యులు నినాదాలు చేస్తూ, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఐక్యంగా, శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలు జరిపి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని వారు కోరారు.

## 1,800 కి.మీ. ఎల్పీజీ పైప్‌లైన్లకు
# పిఎన్‌జిఆర్‌బి అనుమతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** దేశ ఇంధన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఎల్పీజీ సరఫరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు సుమారు 1,800 కిలోమీటర్ల ఎల్పీజీ పైప్‌లైన్‌ల అభివృద్ధికి పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.7,000 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో ఈ పైప్‌లైన్లను నిర్మించనున్నారు. దేశ ఎల్పీజీ రవాణా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, దీర్ఘకాలిక ఇంధన భద్రతను పెంచడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యాలు. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సముద్రతీర ప్రాంతాల్లో దిగుమతుల ద్వారా సమకూర్చుకుంటోంది. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎల్పీజీని రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్లు అంతర్గత మార్కెట్లకు ఎల్పీజీని మరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా తరలించేందుకు దోహదపడతాయి. మూడు కీలక పైప్‌లైన్లు పిఎన్‌జిఆర్‌బి అనుమతించిన ప్రాజెక్టుల్లో తెలంగాణలోని చెర్లపల్లి–మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మధ్య 556 కి.మీ. పైప్‌లైన్, ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ–ఉత్తరాఖండ్‌లోని సితార్గంజ్ మధ్య 611 కి.మీ. పైప్‌లైన్, మహారాష్ట్రలోని శిక్రాపూర్‌నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్బళ్లి వరకు 633కి.మీ. పైప్‌లైన్ ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను గెయిల్ అభివృద్ధి చేయనుంది. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత దేశంలో పిఎన్‌జిఆర్‌బి అనుమతించిన కామన్ క్యారియర్ ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న సుమారు 7,700 కి.మీ. నుంచి 9,500 కి.మీ.కు విస్తరించనుంది.



శనివారం కొచ్చి విమానాశ్రయంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# కేరళం చేరుకున్న పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న కుడి భుజానికి తదుపరి చికిత్స నిమిత్తం కేరళం రాష్ట్రానికి చేరుకున్నారు. కొచ్చి విమానాశ్రయంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కల్యాణ్ అక్కడి నుంచి నేరుగా చికిత్స అందించనున్న ఆయుర్వేద వైద్యశాలకు కోసం త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు. అక్కడి సమీపంలోని ఓ ఆయుర్వేద వైద్యశాలలో ప్రత్యేక థెరపీ ద్వారా ఆయన చికిత్స చేయించుకోనున్నారు. పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు చికిత్స తీసుకుంటునే ఇక్కడి పరిపాలనా వ్యవహారాలు పర్యవేక్షిస్తారు.

## విజయవాడ సహా 4 నగరాలు
# 59 పట్టణాల అభివృద్ధి

### రూ. 5,490 కోట్ల అంచనాతో ఫండ్‌కోసం కేంద్రానికి ప్రతిపాదన

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పట్టణాలు, నగరాల అభివృద్ధికి ప్రభుత్వం కీలక ప్రణాళికను రూపొందించింది. ఇందుకోసం అవసరమైన నిధుల కేటాయింపు కోసం కేంద్రానికి ప్రతిపాదనలను పంపించింది. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో మంచినీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.600 కోట్లు, మంచి నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది. దీంతో రాజధాని ప్రాంతంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరం రూపు రేఖలు మారతాయి. గుంటూరు పరిస్దితి కుడా అంతే, నెల్లూరు, రాజమహేంద్రవరం అభివృద్ధి చెందనున్నాయి.

# టైమ్, డేట్ ఫిక్స్‌చెయ్.. వస్తా

>> సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువనేత లోకేష్ పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజలతో మమేకం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డిఎస్సీ, ఎపిపిఎస్‌సి మధ్య తేడాకూడా తెలియని స్థితిలో జగన్ ఉన్నాడు. డిఎస్సీ నియామకాల విషయంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. డిఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ కోర్టుకు వెళ్లి పిటిషన్లు వేశారు. కోర్టు కూడా ఎక్కడా కూటమి ప్రభుత్వాన్ని తప్పుబట్టలేదు. పారదర్శకంగా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు, ఒక్క డిఎస్సీ విడుదల చేయలేదు, వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ అంటే ఏంటో కూడా జగన్‌కు అర్థం కాలేదు. అసెంబ్లీలో గొడ్డలి పార్టీ చేసే ప్రతి దుష్ప్రచారానికి సమాధానం చెప్పాను. డిఎస్సీపై చర్చిద్దామని జగన్‌కు ఛాలెంజ్ చేశాను. అయినా జగన్ రాలేదు. ఈరోజు కూడా ఐదోసారి ఛాలెంజ్ చేస్తున్నా. టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్. డిఎస్సీపై చర్చకు రా..! తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు. బయటి రా..! ఐదేళ్లు వేచి చూసి కష్టపడి టెట్, డిఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను జగన్ అవమానిస్తున్నారు. జగన్ చెప్పిన అబద్ధాలను కార్యకర్తలు తిప్పికొట్టాలి" అని లోకేష్ పిలుపునిచ్చారు.

**ప్రజలతో మమేకమే కార్యకర్తల ప్రధాన బాధ్యత:**
"2019లో మంగళగిరిలో ఓటమిని సవాల్‌గాతీసుకుని ప్రజల్లో నిరంతరం ఉన్నాను. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం వల్ల నాకు, మంగళగిరి ప్రజలకు మధ్య బలమైన అనుబంధం ఏర్పడింది. 2024లో మంగళగిరి ప్రజలు నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం మాత్రమే కాకుండా, ప్రతి కార్యకర్త ప్రజలతో వ్యక్తిగతంగా మమేకం కావాలి. అప్పుడే పార్టీకి, ప్రజలకు మధ్య బలమైన అనుబంధం ఏర్పడుతుంది. సమస్యలపై పోరాడండి. పరిష్కారం అయ్యే వరకు వదలకండి. ప్రజలకు, మనకు మధ్య ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేయండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి :**
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పూర్తి చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి. పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు కూటమి ప్రభుత్వం ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. కూటమి పార్టీల మధ్య చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ సమన్వయంతో ముందుకు సాగాలి. కూటమి ఐక్యతను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ చేస్తున్న ప్రలోభాలకు ఎవ్వరూ లొంగవద్దు. రాబోయే ఎన్నికల్లో గత విజయాల కంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి" అని కోరారు.

**ప్రజా శ్రేయస్సే అదితి గజపతి రాజు నిరంతర ఆలోచన :**
విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. అసెంబ్లీలో అదితి ప్రతిరోజూ మూడు సార్లు నా వద్దకు వచ్చి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి గురించే చెప్తుంటుంది. నాకు ఇదిచేయండని స్వార్థప్రయోజనాల కోసం ఎప్పుడూ ఎవర్నీఅడగలేదు. జిఎంఆర్– మాన్సాస్ ఎడ్యూసిటీ నిర్మాణానికి ఎదురైన అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజె క్టును పూర్తి చేయడానికి ఆమె పట్టుదలతో పనిచేస్తున్నారు. మన పిల్లలకు ఏవియేషన్ విద్యను అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంతో ఎడ్యూసిటీకి 150ఎకరాలభూమిని ఉచితంగా గజపతిరాజు కుటుంబం ఇవ్వడం గర్వకారణం" అని అన్నారు.

**అశోక్ గజపతి రాజు సేవలు స్ఫూర్తిదాయకం:**
పార్టీ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఆయన నానో కారులో తిరిగినా రాజసం మాత్రం రోల్స్ రాయిస్ లాగా ఉంటుంది. అశోక్ గజపతి రాజుని చాలా ఇబ్బందులు పెట్టారు. అర్ధరాత్రి అరెస్ట్ చేయాలని చూశారు. సింహాచలం ట్రస్ట్ నుండి తీసేయాలని చూశారు. రాముడి శిరస్సును తొలగించినప్పుడు చంద్రబాబు, అశోక్ గజపతి రాజు వస్తుంటే లారీ అడ్డంపెట్టి అడ్డుకోవాలని చూశారు. బాబుపైన, అశోక్ గజపతి రాజుపైన అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెడితే మన నాయకులకు అంత బలం. నాపైనే 24 కేసులు పెట్టారు. మర్డర్ కేసు మాత్రమే నాపై పెట్టలేదు. అది కూడా పెట్టివుంటే నాలో మరింత కసి పెరిగేది.. గొడ్డలి పార్టీకి 11 కూడా వచ్చేవి కాదు" అని పేర్కొన్నారు.

# వారంలో వెలిగొండ సాకారం

>> ల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 యేళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సిఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ యేడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగాగోదావరి కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రతవస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను" అని ముఖ్యమంత్రి అన్నారు.

**పునరావాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తి..**
గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సిఎం ప్రకాశం జిల్లాకు వచ్చినప్పుడు పరిహారం అడుగుతామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు. తమకు పరిహారం పూర్తిగా అందించిందని.. కాలనీల్లో వసతుల కల్పన బాగుందని నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలవటం సంతృప్తిగా ఉందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈసమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

23-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ఏకాదశి తె.4.18
న.మూల సా.5.43
వ1. మ.3.55–సా.5.43
వ2. తె.3.24–ఉ.6.11
దు. సా.4.42–5.32
రాహు సా.4.30–సా.6.00
శుభ ఉ.8.00–ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** నూతన కార్యక్రమాలను అనుకున్న విధంగా ప్రారంభించగలుగుతారు. వివాహాది శుభ కార్యాలు ఫలిస్తాయి.

**వృషభం :** వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా నూతనమైన ప్రణాళికలను అమలు పరచగలుగుతారు. సాంకేతిక విద్యావకాశాలు.

**మిథునం:** ఉపయుక్తమైన ప్రయాణాలు, చర్చలు ఫలవంతంగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త. సోదరుల కలయిక.

**కర్కాటకం:** వివాహాది శుభకార్యాలు ప్రయత్నం మీద సానుకూల పడతాయి. ఉపయుక్తమైన ప్రయాణాలు. వస్తువు కొనుగోలు.

**సింహం:** ప్రజా సంబంధాలను విస్తృత పరచుకోవడానికి గాను చేసే ప్రయత్నాలు, ప్రకటనలు లాభిస్తాయి. ప్రముఖుల కలయిక.

**కన్య :** సకాలంలో సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకొని లాభపడతారు. చర్చలు ఫలవంతంగా సాగుతాయి. శుభవార్తలు.

**తుల :** మీ కృషికి తగిన ఫలితాలన్ని అందుకోగలుగుతారు. కొత్త ఋణం తీసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**వృశ్చికం :** ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

**ధనుస్సు :** ఒక మంచి పనికి గాను విరాళాలను సేకరిస్తారు. సంప్రదింపులు జరిపేటప్పుడు మెళకువలు పాటించండి.

**మకరం :** సంస్థను విస్తరింప చేయడానికి గాను మీరు చేసే యత్నాలు కలిసి వస్తాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు.

**కుంభం :** అనేకాంశాలు అనుకూలంగానే ఉన్నాయి. బహుమతులను ఇవ్వడం లేక బహుమతులను అందుకోవడం జరుగుతుంది.

**మీనం :** ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. కార్యాలయంలో ఉన్నతాధికారులతో జాగ్రత్తలు అవసరం. వాహన యోగం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యువత రాజకీయాల్లోకి రావాలి

### క్రీడల్లో మహిళలకు మరిన్ని అవకాశాలకే 'షీప్లే' విధానం
### ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతున్నాం
### భీమిలిలో ఆధునీకరించిన ఉన్నత పాఠశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్, విద్యార్థులతో ముఖాముఖి

**విశాఖపట్నం: ఆగస్టు 22 ప్రభాతవార్త:** విశాఖ జిల్లా మధురవాడలోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను 'ప్రాజెక్ట్ చంద్రా'లో భాగంగా దివీస్ ల్యాబ్స్ సహకారంతో ఆధునీకరించిన అనంతరం రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆధునీకరించిన తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులను మంత్రి లోకేష్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మంత్రి లోకేష్ సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధారణ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భిన్నంగా ఈసారి మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సరదాగా, స్ఫూర్తిదాయకంగా సమాధానాలు ఇచ్చారు.

**విద్యార్థి ప్రశ్న:** ఇంతకుముందు మీరు చూసిన చంద్రంపాలెం పాఠశాలకు, ఇప్పుడు చూస్తున్న పాఠశాలకు ఉన్న తేడా ఏంటి?

**సమాధానం:** చంద్రంపాలెం పాఠశాలకు నేను గతంలో రెండుసార్లు వచ్చినప్పుడూ రెండుసార్లు వర్షం పడింది. గతంలో పాఠశాల పరిసరాలు బురదమయంగా ఉండేవి. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల ఇదే విధంగా అభివృద్ధి చెందాలన్నదే మా లక్ష్యం" అని అన్నారు.

**ప్రశ్న:** మీకు ఇష్టమైన ఆట ఏంటి? ఇప్పటికీ ఆడుతున్నారా?

**సమాధానం:** ప్రతి భారతీయుడిలాగే నాకు క్రికెట్ అంటే ఇష్టం. ప్రతి ఆదివారం నా కుమారుడు దేవాన్ష్‌తో కనీసం రెండు గంటలైనా క్రికెట్ ఆడతాను. అంతకుమించి ముఖ్యమంత్రి నాకు అవకాశం ఇవ్వడం లేదు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

**ప్రశ్న:** క్రీడల్లో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి కదా?

**సమాధానం:** ఇది వాస్తవమే. క్రీడల్లో మహిళలు రావడానికి అనేక అడ్డంకులు వస్తున్నాయి. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడం, పాఠశాలల్లో సరైన క్రీడా వసతులు లేకపోవడం, ఇలా ఏదైనా కావొచ్చు. మహిళలు క్రీడా రంగంలో అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. అందుకే మహిళలను క్రీడల్లో మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'షీ ప్లే' విధానాన్ని తీసుకొస్తున్నాం. చంద్రంపాలెం పాఠశాలలోనే ఇద్దరు విద్యార్థినులు బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. ఇలానే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థినులు క్రీడా రంగంలోకి రావాలి" అని ఆకాంక్షించారు.

**ప్రశ్న:** రాజకీయాల్లోకి రాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారు?

**సమాధానం:** "2005లో చంద్రబాబు ఓడిపోయిన సమయంలో ఆయనతో కలిసి ఓ వివాహ కార్యక్రమానికి నేను వెళ్లాను. అక్కడ సుమారు 5 వేల మంది చంద్రబాబు రాగానే గౌరవంగా లేచి నిలబడటం చూశాను. ఒక వ్యక్తికి ప్రజలు ఇచ్చే గౌరవాన్ని అక్కడ ప్రత్యక్షంగా చూశాను. రాజకీయాల్లోకి రావాలని అప్పుడే నిర్ణయించుకున్నాను" అని తెలిపారు.

**సమాధానం:** అది సీక్రెట్ అని సరదాగా సమాధానమిచ్చిన మంత్రి. 'పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య సమయంలో ఏర్పడే స్నేహాలను జీవితంలో ఎప్పటికీ మర్చిపోకూడదు. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులతోనే మన భావాలను ఎక్కువగా పంచుకుంటాం. జీవితంలో ఏ స్థాయికి వెళ్లినా మంచి స్నేహితులను మర్చిపోవద్దు. తల్లి, తండ్రి, గురువు తర్వాత స్నేహమే ముఖ్యం" అని అన్నారు.

విద్యార్థులను సరదాగా ప్రశ్నలు అడిగిన మంత్రి లోకేష్.. డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సైంటిస్ట్, టీచర్, బిజినెస్‌మెన్ వంటి వృత్తుల్లోకి వెళ్లాలని ఎంతమంది కోరుకుంటున్నారో అడిగారు. అనంతరం రాజకీయాల్లోకి రావాలని ఎంతమంది కోరుకుంటున్నారని ప్రశ్నించారు. సమాజంలో తాము కోరుకునే మార్పు తీసుకురావాలంటే విద్యావంతులు, ఆలోచించే యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.



# మా కుటుంబంతో సాన్నిహిత్యం విడదీయరానిది

## సోదరభావంతో శ్రీధర్ వర్మను ఆదరించాం

### తిరుమలలో నందమూరి రామకృష్ణ భావోద్వేగం

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** నందమూరి కుటంబంతో తిరుమల రామచంద్రరాజు కుటుంబానికి సాన్నిహిత్యం ఉందని, రక్తసంబంధంతో పుట్టక పోయినా తామంతా ఒకే కుటుంబమని నందమూరి రామకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు. అనురాగం, ఆప్యాయత తన తండ్రి దివంగత ఎన్టీఆర్ నుండి ఇప్పటి శ్రీధర్‌వర్మ వరకు ఆ కుటుంబంతో సోదరభావంతో మెలగుతున్నామని తెలిపారు. శనివారం మా కుటుంబంలో ఒకడైన శ్రీధర్‌వర్మ ఎస్వీబిసి ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీ ఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఉదయం ఆలయంలోపలకు చేరుకుని విఐపి బ్రేక్ దర్శనంలో శ్రీధర్‌వర్మతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామ చంద్రరాజుతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని తలచుకుని నం దమూరి రామకృష్ణ మనసులోని భావోద్వేగాన్ని వెలిబుచ్చారు. తిరుమల రామచంద్రరాజు కుటుంబంతో తమకున్న దశాబ్దాల నాటి అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. తాము జీవితాంతం తమ తండ్రి ఎన్టీఆర్ చూపిన బాటలోనే నడుస్తామని రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం నందమూరి కుటుంబ సభ్యులు శ్రీధర్‌వర్మను ఆత్మీయంగా అభినందించారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు మంత్రి లోకేష్ అభినందనలు

**విజయవాడ, ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన విజయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం, చినమ ల్లుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొలూరి రాజేష్‌కి హృదయ పూర్వక అభినందనలను ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా తెలిపారు. ఏఐసహాయంతో నీలివి లక్ష్యాలను సాధించడంతో పాటు, వాట్సాప్ ఆటోమేషన్ ద్వారా శిక్షణనిచ్చి వేలాది విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలలో సీట్లు సాధించేలా ప్రణాళిక బద్ధంగా పనిచేసిన మాస్టారు పాఠ్య పుస్తక రచయితగా విద్యా ప్రయాణంలో భాగమయ్యారు. ప్రభుత్వ పాఠశాల లోనే చదువుకుని, టీచరై జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం రాజేష్ అంకిత భావానికి నిదర్శనం. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా గాంధారికి చెం దిన ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని, అండమాన్ నికోబార్ దీవుల నుంచి జెల్లి ప్రకాష్ రావుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



# ఎఇఇ నియామక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నేడినుండి 27వ తేదీ వరకు జరగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) నియామక పరీక్ష లకు సకల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పరీక్షలు పటిష్టంగా నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతిలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, కంప్యూటర్ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను సిఎండి పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఎఇఇనియామక పరీక్షలను పారదర్శకంగా, సమర్థవం తంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలి పారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో 34 పరీక్షా కేంద్రాల్లో ఎఇఇ నియామక పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, 36,670 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఐదు విద్యుత్ సంస్థల్లో మొత్తం కలిపి 629 ఎఇఇ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో మొత్తం 94 పరీక్షా కేంద్రాల్లో సుమారు 1.05 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్/హెచ్ఆర్ డి సిహెచ్ రామచంద్ర రావు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖరరావు, తిరుపతిటౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి. గంగాధర్ రెడ్డి, చదలవాడఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ రాయుడు, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాదముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంపై జగన్ అసత్యాలు

## సిట్ నివేదిక, హైకోర్టు తీర్పును మాజీ సిఎం వక్రీకరించారు: ప్రభుత్వ వివరణ

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు తప్పుపట్టలేదన్న జగన్ వ్యాఖ్యలపైనా ఏపీ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రూప్1పరీక్షలపై సిట్ నివేదిక, హైకోర్టు తీర్పుపై అసత్యాలను జగన్ చెబుతు న్నారంటూ ఏపీ ప్రభుత్వం సమగ్ర సమాచార పత్రాన్ని విడుదల చేసింది. మాన్యువల్ మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరిగిందన్న జగన్ వాదనను ప్రభుత్వం ఖండించింది. మూల్యాంకనం ప్రారంభమైన 17 రోజుల తర్వాతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని సిట్ నివేదికలో పేర్కొందని తెలిపింది.మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు ఫోన్లు ఉపయోగించిన ఆధారాలు సీసీటీవీ ఫుటేజీలో లభించా యని వెల్లడించింది. డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు తప్పుపట్టలేదన్న జగన్ వ్యాఖ్యలపైనా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రూప్1 మాన్యువల్ మూ ల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరిగిందన్న జగన్ వాదనను ప్రభు త్వం ఖండించింది. మూల్యాంకనం ప్రారంభమైన 17 రోజుల తర్వాతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని సిట్ నివేదికలో పేర్కొందని తెలిపింది. మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు ఫోన్లు ఉపయోగించిన ఆధారాలు సీసీటీవీ ఫుటేజీలో లభించాయని వెల్ల డించింది. ఈ అంశాలను జగన్ కావాలనే ప్రస్తావించలేదని విమర్శించింది. 2021అక్టోబర్ 1నజస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డిజిటల్ మూల్యాం కనాన్ని రద్దుచేసి, మూడు నెలల్లో మాన్యువల్ మూల్యాంకనం నిర్వహిం చాలని ఏపీపీఎస్సీని ఆదేశించారని తెలిపింది.అర్హత సాధించిన వారిని ఇంట ర్వ్యూలకు పిలిచి ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కోర్టు సూచిం చిందని పేర్కొంది.భవిష్యత్తులో అన్ని అనుమతులు, చట్టబద్ధమైన విధానా లతో డిజిటల్ మూల్యాంకనం నిర్వహించుకోవచ్చన్న కోర్టు అభిప్రాయాన్ని మాత్రమే జగన్ ప్రస్తుత కేసుకు వర్తింపజేస్తూ వక్రీకరించారని వివరించింది.

# నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

## 31న సిఎం చంద్రబాబుచే వెలిగొండ ప్రారంభోత్సవం: మంత్రి నిమ్మల

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించ నున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్ 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింపజేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సం బంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడి యాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభిం చబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్య మంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. నిర్వాసితులకు ప్రతీ పైసా చెల్లించేలా నేను బాధ్యత తీసుకుంటాను.



శనివారం మీడియాతో మాట్లాడుతున్న జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ టన్నెళ్ల నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేస్తారని చెప్పారు. వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో భాగంగా 2,027 కుటుంబాలకు రూ. 250 కోట్ల పరిహారాన్ని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అం దజేశారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. వెలి గొండ అన్ని పనులు పూర్తి చేసి, నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టును ప్రారం భిస్తామని స్పష్టంచేశారు. పూర్తికాని వెలిగొండను పూర్తయినట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అని విమర్శిం చారు. వెలిగొండ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో పాటు దీనికోసం భూములిచ్చిన, ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం చెయ్య డానికి సమ ప్రాధాన్యం ఇచ్చాం. ఈ మేరకు సీఎం చంద్రబాబు సంకల్పించారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వా సితులకు 3వేల కోట్లు పరిహారం అందజేశామ న్నారు. వెలిగొండ ప్రాజెక్టులో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామా నాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూ పుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు. ఈ కార్యక్ర మంలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజె క్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

# కేన్సర్ రోగుల కోసం బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్

## కీలక కార్యాచరణకు ఎపి ప్రభుత్వం నిర్ణయం

### బయాప్సీ నమూనాలను భద్రపరిచేందుకు రాష్ట్ర స్థాయిలో బయోబ్యాంక్ ఏర్పాటు



**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో క్యాన్సర్ వ్యాధి భయం కరంగా ప్రబలు తుంది. ఈ క్రమంలో క్యాన్సర్‌ను కట్టడి చేయడానికి ప్రభుత్వం కచ్చితమైన వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. వ్యాధి సోకిన తర్వాత నయం చేయడం కంటే ముందే దాన్ని అంచనా వేయడంపై దృష్టి పెట్టింది. క్యాన్సరు రోగులకు కచ్చితమైన వైద్యం అందించేలా బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్ ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. డిజిటల్ హిస్టో పాథాలజీ, ఎలక్ట్రానిక్ రికార్డులను అనుసంధానం చేయనుంది. బయాప్సీ నమూనాలను దీర్ఘకాలం పాటు సురక్షితంగా భద్రపరిచేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక బయోబ్యాంక్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. పరిశోధనల కోసం సీఎస్ఐఆర్ ఐజీఐబీ, సీసీఎంబీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నైపుణ్యాన్ని వినియోగించుకోనుంది. వాస్తవానికి జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో క్యాన్సర్ వృద్ధి రేటు మూడింతలు ఎక్కువగా ఉండటం ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తున్న పరిస్థితి. 2020-2025 మధ్య దేశవ్యాప్తంగా క్యాన్సర్ కొత్త కేసుల్లో జాతీయ సగటు పెరుగుదల 12.8 శాతంగా ఉంది. కానీ మన రాష్ట్రంలో ఇది ఏకంగా 39.5 శాతంగా నమోదు కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో 4.73 లక్షల మంది క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందు తున్నారు. ప్రతి ఏడాదీ 76 వేలకు పైగా కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ మహమ్మారి కాటుకు ఏటా 40వేల మందికి పైగా బలవుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యం గా క్యాన్సర్ బాధితుల్లో 70శాతం మంది 40 నుంచి 69 ఏళ్ల మధ్య వయసున్న వారే కావడం భయాందోళనకు గురిచేస్తుంది. రాష్ట్రంలో గుర్తిం చిన మొత్తం క్యాన్సర్ కేసుల్లో 59 నుంచి 61 శాతం వరకు మహిళలే ఉన్నారు. వీరు ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఇక పురుషుల విషయానికి వస్తే వారు ఎక్కువగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. పురుషుల్లో ఈ రకమైన క్యాన్సర్ల పెరుగుదల 1.7 రెట్లుగా ఉన్నట్లు రిపోర్టులు చెబుతున్నాయి. కేన్సర్‌ను అరికట్టేందుకు తొలి దశలో భాగంగా నాలుగు నగరాల్లో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను (సీసీసీ) నెలకొల్పింది. గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, కడప జిల్లాల్లో ఇవి అందుబాటులోకి వచ్చాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 17ఆంకాలజీ యూనిట్లను ప్రారంభిం చింది. 23 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ డేకేర్ కీమోథెరపీ కేంద్రాలను (డీసీసీసీ) ఏర్పాటు చేసి రోగులకు భరోసా కల్పిస్తోంది. క్యాన్సర్ వైద్యం అత్యంత ఖరీదైనది. సామాన్యులపై ఈ ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోంది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ఆంకాలజీ విభాగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఏటా రూ.746 కోట్లను క్యాన్సర్ చికిత్సల కోసమే వెచ్చిస్తోంది. మరోవైపు నివారణ చర్యల్లో భాగంగా బాలికలకు ప్రాధాన్యం ఇస్తోంది. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3.45 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలను పంపిణీ చేసి, క్యాన్సర్ కట్టడికి చర్యలు చేపట్టింది.

# భవిష్యత్‌లో పరిశ్రమలకు కేరాఫ్ అనకాపల్లి

## వచ్చేనెల మెదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీరు

### 29కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు: కోడూరు సభలో సి.ఎం చంద్రబాబు భరోసా

**అనకాపల్లి,ఆగస్టు22: ప్రభాత వార్త:** భవిష్యత్తులో పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దుతామని, అన్ని కంపెనీ లకు కేం ద్రంగా నాలెడ్జి ఎకానమీగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రకటించారు. మాడుగుల అసెంబ్లీ పరిధిలోని అలమండ కోడూరుగ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్రస్వచ్ఛాం ధ్ర కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు. అనకాపల్లి జిల్లా ఎన్డీఏకి కంచుకోటగా అబివర్ణించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒకటే కాదు, ఆర్సెలార్ మిట్టల్, డేటా సెంటర్లు, పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్, భవిష్యత్ లో అనకాపల్లి నెంబర్1 జిల్లాగా తీర్చి దిద్దుతామన్నారు. వచ్చే నెల మొ దటివారంలో అనకాపల్లి గోదావరి నీళ్లు తీసుకువస్తున్నామన్నారు. పోల వరంనుంచి వచ్చే నీళ్లు అనకాపల్లిలోని ప్రతి చెరువును నింపుతామన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు. స్వచ్ఛమైన ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కూడా అన్నారు. ప్రతి నెలా 3వ శని వారం స్వచ్ఛత గురించి, సమాజ హితం కోసం పని చేయాలని పిలుపు నిచ్చారు. ఏపీలో 2047 నాటికి తలసరి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రేండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామన్నారు. సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి. అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి ఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తదితరులు ప్రసంగించారు. మంత్రులు కొల్లి రవీంద్ర, కె.నారాయణ, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్. స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్ చైర్మన్ పట్టాబి తదితరులు పాల్గొన్నారు.



# యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి పార్థసారథి

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి స్పష్టం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ యువతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిపాలనలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికయ్యే అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఆయన వివరించారు. శనివారం రాజధాని అమరావతిలో మంత్రి పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. గొడ్డలి పోటుకి, గుండె పోటుకి ఎంత తేడా ఉందో.. గత వైసీపీ ఏపీపీఎస్సీకి, నేటి కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీకి అంత తేడా ఉందంటూ ఆ పార్టీ నేతలకు చురకలంటించారు. గొడ్డలి పార్టీ తలకిందులుగా తపస్సు చేసినా మెగా డీఎస్సీలో ఒక్క అక్రమాన్ని కూడా రుజువు చేయలేదని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలను హైకోర్టు ఎత్తి చూపినా.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దున్నపోతు మీద వాన పడిన చందంగా మాట్లాడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. మెగా డీఎస్సీపై వందల కొద్దీ కేసులు వేసిన గొడ్డలి పార్టీ.. కోర్టుకు ఒక్క ఆధారాన్ని కూడా సమర్పించలేక పోయిందని అన్నారు. గొడ్డలి పార్టీ వేస్తున్న కేసుల వెనుక కుట్ర కోణం దాగుందని సాక్షాత్తూ హైకోర్టే మొట్టికాయలు వేసిందని చెప్పారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ సంస్థలంటే యువతకు గొప్ప విశ్వాసం. దేశ, రాష్ట్ర విధానాలను అమలు చేసే అత్యున్నత ఉద్యోగులను ఎంపిక చేస్తారు. విశ్వసనీయత దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా ఊరుకునేది లేదు. ఏపీపీ ఎస్సీలో జరిగిన పరీక్ష విధానం, మూల్యాంకనంపై యువత ఆలోచించాలి. పారదర్శక విధానాలు రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. గొడ్డలి పార్టీ వ్యవహరించిన తీరు వ్యవస్థలపై విశ్వాసం కోల్పోయే పరిస్థితిని తీసుకొ చ్చారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టకుండా రిసార్ట్స్‌లో పెడ తారా?. రిసార్ట్స్‌కు తీసుకెళ్లి వారికి ఇష్టమొచ్చిన వారితో మూల్యాంకనం చేయిస్తారా?" అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.

# గృహ హింస, వరకట్న వేధింపుల కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబానికి ఊరట

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** గృహ హింస, వరకట్న వేధింపుల కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబానికి భారీ ఊరట లభించింది. జోగి రమేశ్, ఆయన కుమారుడు జోగి రాజీవ్ సహా వారి కుటుంబసభ్యులకు విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో బాధితురాలైన (మేఘన) లేదా సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించడం, ప్రభావితం చేయడం లేదా ప్రలోభపెట్టడం చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. విచారణాధికారి సూచించిన తేదీలు, సమయాల్లో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

# జగన్నాథపురంలో మరో భారీ డేటా సెంటర్

## రూ.58,743 కోట్ల పెట్టుబడి, 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు

## 486 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు..

### ఆనందపురం ప్రాంత అభివృద్ధికి ఊతం

**విశాఖపట్నం,(ఆనందపురం,)ఆగస్టు 22, ప్రభాత వార్త:** విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మరో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 486 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హోల్డింగ్స్ ఇండియా ఎల్ఎల్‌పీ సంస్థకు 200 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.58,743 కోట్ల పెట్టుబడి రానుండగా, దాదాపు 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతండేటా సెంటర్ ఏర్పాటు వల్ల జగన్నాథపురం, చందకతో పాటు ఆనం దపురం మండలంలోని పరిసర గ్రామాల ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. భారీ పెట్టుబడితో కూడిన ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. నిర్మాణ కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, భద్రతా సిబ్బంది, రవాణా, క్యాటరింగ్, నిర్వహణ తదితర సేవలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టు కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత డేటా సెంటర్ నిర్వహణ, విద్యుత్, నెట్‌వర్కింగ్, సర్వర్లు, భద్రత, సాంకేతిక సేవలు వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మౌలిక వసతులకు మరింత ప్రాధాన్యంభారీ డేటా సెంటర్‌కు నిరంతర విద్యుత్ సరఫరా, అధునాతన రహదారులు, బలమైన టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అవసరం. దీంతో ఈ ప్రాంతంలో రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. విశాఖపట్నం నగరానికి సమీపంలో ఉండటం, జాతీయ రహదారి-16తో పాటు ఇతర ప్రధాన రహదారులకు అనుసంధానం ఉండటం కూడా ఈ ప్రాంతానికి అనుకూలంగా మార నుంది. డేటా సెంటర్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు, ఐటీ సేవా సంస్థలు, లాజిస్టిక్స్, వాణిజ్య సంస్థలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాలకు ప్రయోజనంభారీ ప్రాజెక్టు ఏర్పాటుతో ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు, సేవా రంగ సిబ్బంది రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో పరిసర ప్రాం తాల్లో ఇళ్ల అద్దెలు, వాణిజ్య స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్ దుకాణాలు, రవాణా సేవలకు డిమాండ్ పెరగవచ్చు. స్థానిక వ్యాపారులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. యువతకు కొత్త అవకాశాలుడేటా సెంటర్ వంటి ఆధునిక మౌలిక వసతుల ప్రాజెక్టు రావడంతో స్థానిక యువతకు ఐటీ, నెట్‌వర్కింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి పెరగనుంది. పరిశ్రమ అవసరాలకు అను గుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తే స్థానిక యువతకు ప్రాజెక్టులోనే ఉద్యోగాలు పొందే అవకాశం మరింత పెరుగుతుంది.

# నా కుటుంబీకులను దూషించినందుకే జెసి ఇంటికి వెళ్లా..

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శ



**అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో:** నా కుటుంబీకులను దూషించించి నందుకే నాడు జెసి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లాల్సి వచ్చిందని, చీము నెత్తురు ఉన్న ఎవరైనా కుటుంబీకులను విమర్శిస్తే ఓర్చుకోలేరని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రిలో దొరికిన గోవా మద్యం అక్రమ సరఫరాపై వైసిపి నేతలతో ఒక కమిటీ వేయాలని జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతున్నారని, వైసిపి నేతలు ఎందుకు మంత్రులు పయ్యావుల కేశవ్, టిజి.భరత్, సీనియర్ నేత కాలవ శ్రీనివాసులతో ఒక కమిటీ వేయాలని, విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రి నియోజకవర్గంలో జరుగుతున్న అరాచ కాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌లు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. గోవా లిక్కర్ అక్రమ సరఫరాతోపాటు, తాడిపత్రిలో విచ్చల విడిగా జరుగుతున్న అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి అమ్మకాలు, పేకాట నిర్వహణ ఎవరి హయాంలో ఎక్కువ జరిగాయో టిడిపి కమిటీతోనే విచారణ జరిపించాలని ఆయన సూచించారు. తాడిపత్రి పోలీస్‌స్టేషన్ వద్దే అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయని, అయినా పోలీసులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రతిరోజు పోలీసు స్టేషన్ వద్దే గంజాయి సేవించి పోలీసులపైనే దాడులు చేస్తున్నారన్నారు. అసెంబ్లీ రౌడీ సినిమా తరహాలో పోలీస్‌స్టేషన్‌కు జెసి స్టేషన్ అని పేరు పెడితే సరిపోతుందని ఆయన విమర్శించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, తన తండ్రి జెసి ప్రభాకర్‌రెడ్డిని గ్యాంగ్ స్టర్‌లా తయారు చేస్తున్నారని విమర్శించారు. వైసిపిలో 24 మంది నేతలను టార్గెట్ చేశానని, జెసి ప్రభాకర్‌రెడ్డి పదేపదే చెబుతున్నారని, వీరిలో ముగ్గురిపై దాడి చేశారన్నారు. పోలీసులు 24 మంది నేతలకు రక్షణ అయినా కల్పించాలి, లేదంటే జెసి వ్యాఖ్యలపై కేసు నమోదు అయినా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీల్లో మచ్చా దత్త రెడ్డి అర్ధ సెంచరీ



**అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో:** విజ యనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అర్ధ సెంచరీ పూర్తి చేశారు ఆంధ్ర రంజీ జట్టును ఎంపిక చేయటానికి జరుగుతున్న పోటీలలో శనివారం ఆంధ్ర డి జట్టుతోవిజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ ప్రాబ్లమ్స్ పోటీలలో మచ్చ దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 70 పరుగులు సాధించారు. మూడు సిక్సర్లు ఎనిమిది ఫోర్లు గ్రౌండ్ నలుమూలల కొట్టారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో ఆగస్టు 31 వరకు పోటీలు జరుగుతాయి. విజయనగరంలోని నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ నందు జరుగుతున్నసీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబ్లమ్స్ క్రికెట్ పోటీలలో ఆంధ్ర ఏ జట్టుకు ఆంధ్ర డీ జట్లకు జట్ల మధ్య పోటీ ప్రారంభమైంది ఆంధ్ర బి జట్టు ఆంధ్ర సి జట్ట మధ్య మ్యాచులు ప్రారంభమయ్యాయిప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. మొత్తం ఈ పోటీలు ఆగస్టు 31 వరకు నిర్వహిస్తారు.

# బ్రహ్మం చౌదరిని పరామర్శించిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎమ్.ఎస్.రాజు

## ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బ్రహ్మంచౌదరి

**అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుం టున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే లు బ్రహ్మం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని, మళ్లీ మీ సేవలు ప్రారంభించాల న్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురి కావడం బాధాకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ వలన ఆయన త్వరగా కోలుకున్నారని, మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు.

మన దేశంతో పాటు, తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకుఎల్‌నినో పరిస్థితులు కొత్త కాదు. 2015లో ఎల్‌నినో ఎఫెక్ట్ వచ్చినప్పుడు జూన్‌లో తీవ్ర ప్రభావం చూపించింది. మొదట్లో కాస్తవర్షాలు కురిసినా రానురాను వాతావరణం పొడిగా మారింది. ఈ ఏడాది కూడా ఆలస్యంగా జులైలో మొదలైన వానలు మునుపటిలాగే కాస్త మురిపించి మళ్లీ ముఖం చాటేశాయి. అందుకే ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగక పోగా,మరింతగా అడుగంటుతున్నాయి. అంత కాదు గతానికి భిన్నంగా వర్షాకాలంలోవేసవిని మించి విద్యుత్ వినియోగం నమోదవుతోంది. అలాగే దేశంలో 1997లోనూ శక్తిమంతమైన ఎల్‌నినో ఏర్పడింది. ఆ సమయంలో పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు మించాయి. అప్పుడే భారత్‌లోనిఉత్తరాది, మధ్య రాష్ట్రాలపై ప్రభావం గట్టిగా పడింది. అయితే ఈసారి అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండడం వల్ల పలు రాష్ట్రాల్లో కరవు ఛాయలు నెలకొన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగావర్షపాతం సమానంగా ఉండదు. కొన్నిప్రాంతాల్లో సాధారణ లేదా అధిక వర్షాలు పడినా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కొరత ఇప్పటికే ప్రారంభమైంది. వర్షపాతం తగ్గితే వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల నీటి సరఫరా,స్థానికఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ పంటలపై ప్రభావం అధికంగా చూపిస్తోంది. తక్కువ వర్షాలు కేవలం వ్యవసాయానికే కాదు, పర్యావరణానికి కూడా ముప్పు అందని నిపుణులు అంటున్నారు.ఇప్పటివరకు ఎల్‌నినో పరిస్థితులు, పడిన వర్షాలను విశ్లేషిస్తే కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే కంటితుడుపు వర్షం పడింది. ఎలాగూ సాగు నీటి పైఆశలు వదులుకోవాలని ముందే రైతుల్ని అప్రమత్తంచేసిన ప్రభుత్వాలు,వచ్చేనైరుతి వరకు తాగునీటికి కటకట లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవడంలో నిమగ్నమయ్యాయి. జాగ్రత్తగా వాడుకోవాలనుకుంటున్నారు.

# ఎల్‌నినోకు దీటుగా ప్రణాళికలు

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ప్రశాంత మహాసముద్రంలో వేగంగా రూపుదిద్దుకుంటున్న ఎల్‌నినో ప్రభావం రాబోయే నవంబర్, డిసెంబర్ నాటికి పరాకాష్టకు చేరుకోనుందని వాతావరణ శాస్త్రవేత్తలు అత్యంత హెచ్చరికలతో కూడిన నివేదికను విడుదల చేశారు. మును పెన్నడూ చూడని విధంగా ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భూమిపైనే అత్యంత వేడి దేశంగా భారత్ రికార్డులకెక్కింది. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల జాబితాలో ఉన్న 100నగరాలు భారత్‌కు చెందినవే. ఎల్‌నినో పరిస్థితులు అంతకంతకూ పెరుగుతుండటంతోకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తెలంగాణలో ఖరీఫ్ ప్రారంభమైన జూన్ 1 నుండి ఈ నెల 21వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 505.2 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 432.6 మిల్లీమీటర్లు నమోదైంది. ఇక రాష్ట్రంలోని 17 జిల్లాలు లోటు వర్షపాతంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇందులో 14 జిల్లాలు 25 నుండి 47 శాతం లోటును ఎదుర్కొంటున్నాయి. మరోపక్క గత ఏడాది కంటే దాదాపు 2 లక్షల ఎకరాల విస్తీర్ణం తక్కువగా ప్రస్తుత ఖరీఫ్ సీజనులో అన్ని పంటలూ కలిపి 1.17 కోట్ల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1 నుండి ఈ నెల 21 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 373.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 52.76 శాతం లోటుతో 176.59 మిల్లీమీటర్లు రికార్డయింది. దీంతో రాష్టం మొత్తం మీద 25 జిల్లాల్లో 35.45 శాతంనుండి 76.02 శాతం వరకూ లోటువర్షపాతం చోటు చేసుకుంది. అలాగే ఈ ఖరీఫ్ సీజనులో ఈ నెల 21 నాటికి రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 5శాతం తగ్గి 46.70లక్షల ఎకరాలకు చేరుకుంది. ఈ సీజనుకు సాధారణంగా ఉండాల్సిన 76.11 లక్షల ఎకరాల్లో ఇప్పటి వరకూ 61 శాతం మేర మాత్రమే సాగు పూర్తయింది. దీంతో వర్షాభావ పరిస్థితులు, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్రంతో పాటు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు, నీటి సంరక్షణ చర్యలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకునష్టం జరగకుండా మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ అమలు చేస్తోంది. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే భారీ స్థాయిలో నిల్వలుసిద్ధం చేసి రైతులకు అందుబాటులో అందిస్తోంది.



జిల్లాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుండగా, మరికొన్ని జిల్లాల్లో లోటు కనిపిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి వెంటనే చర్యలు చేపట్టేలా జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు ఖచ్చితమైన సమాచారం అందించేందుకు ప్రతివారం మండలాల వారీగా వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేస్తున్నారు. ఇందులో వర్షపాతం,ఉష్ణోగ్రతలు, నేలతేమ, భూగర్భ జలాల స్థితి, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితి,రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు వంటి అంశాలు పొందుపరుస్తున్నారు. వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేయడం, నేల తేమను కాపాడే పద్ధతులు పాటించడం,సరైన సమయంలో ఎరువులు వినియోగించడం, తక్కువ నీటితో సాగు చేసే విధానాలను అమలు చేయడం వంటి శాస్త్రీయ సూచనలను ప్రతి రైతుకు చేరవేసేలా వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా వరి సాగు చేస్తున్న రైతులు నారు నిర్వహణ, నాటే దూరం, ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులపై శాస్త్రవేత్తలు సూచించిన మార్గదర్శకాలను గత కొన్ని రోజులుగా అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో పాటు, ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల వైపు దృష్టిసారించారు. ఇందులో భాగంగా నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు,రాగులు,కందులు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసందలు, కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తద్వారా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగాపంటల ఎంపిక రైతులకు మేలు చేస్తుందని అధికారులు సూచించారు. ఇక ఇప్పటికే మొలక దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలకు వచ్చే రెండువారాలు కీలకమని నిపుణులు చెబుతున్నారు. వర్షాభావం కొనసాగితే నేల తేమను కాపాడేందుకుకలుపు నియంత్రణ, తేమ సంరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. మూడు దశల కార్యాచరణకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులపై ముందుగానే అంచనాలు పూర్తి చేసి నిల్వలు సిద్ధం చేసిన ప్రభుత్వం వాటిని రైతు వేదికల ద్వారా విక్రయాలు సైతం జరిపింది. మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లాయంత్రాంగం సమన్వయంతో రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు కొనసాగుతున్నాయి. అంతేకాకుండా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఎల్‌నినో ప్రభావాలు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, ప్రత్యామ్నాయ సాగు, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో ఆ దిశగా పలు జిల్లాల్లో రైతులు అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రతి రైతుపరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ శాఖ మార్గనిర్దేశం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటుందని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే సమయంలో నీటి సంరక్షణ పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టి వర్షపు నీటిని సంరక్షించే చర్యలుచేపట్టారు. అలాగేమిషన్ భగీరథ సమర్థ వంతంగా వినియోగం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను అరికడుతూ, వృథాను నివారించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరోపక్క పశువుల సంరక్షణ విషయంలో కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పశువుల కోసం నీటి తొట్లు పునరుద్ధరణ, నిర్మాణం చేపడుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఐదు సూత్రాల వ్యూహం అమలు చేస్తోంది. నీటి క్రమశిక్షణ,పంట మార్పిడిపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించింది. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచించింది. అలాగే కృష్ణా జలాలను నియంత్రిస్తూ సమర్థవంతంగా, పొదుపుగా వాడనుంది. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గుతున్నందున, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ లభ్యతను బట్టి కృష్ణా జలాలను విచక్షణతో వినియోగించుకోవాలని నిర్ణయించింది. పోలవరం సహా 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను డిసెంబర్ 2028 నాటికి పూర్తిచేయడానికి, తాగుసాగునీటి ఎద్దడిని నివారించడానికి రోడ్‌మ్యాప్ సిద్ధంచేశారు.అంతేకాకుండా పాడి పరిశ్రమను, పశువులను కాపాడేందుకు అవసరమైన మేత నిల్వలతో పాటు 20,000గోకుల షెడ్లఏర్పాటుకు చర్యలుచేపట్టారు. రైతు భరోసా కమిటీల సేవలనువిస్తృతంగా రైతులకు అందించేలా ఏర్పాట్లు చేసింది. ఇందుకుగాను గ్రామస్థాయిలో రైతన్న మీ కోసం పేరుతో యాక్షన్ కమిటీలను బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో రైతులకు తగు మార్గదర్శకాలు అందజేస్తున్నారు. ●

# ఆశయం మంచిదే..

రాజస్థాన్

ఆశయం మంచిదైనా, ఆచరణ కూడా మంచిదవ్వాలంటారు. మంచిదంటే అర్థం వ్యూహాత్మకంగా ఉండాలని. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాగిస్తున్న 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమం తీరుచూస్తుంటే సరైనవ్యూహం అనుసరిస్తున్నారా? అనే సందేహంకలుగుతుంది. జులై నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు వారాలు పైగా భారీ ఆందోళనలు జరిపి ' సక్సెస్' అయిన సిజెపి ఆ ఉత్సాహంతో దేశ వ్యాప్తంగా మరికొన్ని ఆందోళనలకు ఉపక్రమించింది. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేసి పంతం నెగ్గించుకొన్న సిజెపి తదుపరి చర్యగా 'స్కూళ్లు బాగు చేద్దాం' కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టింది. అయితే అది అంత తేలిగ్గా పరిష్కారమయ్యేది కాదని గత రెండు మూడు రోజులుగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలను బట్టి అనుకోవలసి వస్తుంది. శుక్రవారం సిజెపి ప్రతినిధి బృందం జైపూర్‌లో ఓ సర్కారీ బడిని తనిఖీ చేయడానికి వెళ్లగా అక్కడ వారికి ఓ చేదు అనుభవం ఎదురైంది.సిజెపి కో కన్వీనర్ అశుతోష్ రంకా నాయకత్వంలోని ప్రతినిధి బృందం రాంపురా కన్వర్ పురా గ్రామంలో ఓ బడి పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లింది. వారు గ్రామానికి చేరుకోగానేస్థానికులు చుట్టుముట్టి రాళ్లు, కర్రలతో దాడి జరిపారని అశుతోష్ ఆరోపిస్తున్నారు. పాఠశాలభవనం ప్రమాదకరంగా ఉన్నదని తెలియడంతో అక్కడకు వెళ్లామనీ,పశువుల కొట్టంలో పాఠశాల నిర్వహించడం చూసి అవాక్కయ్యామనీ ఆయన అంటున్నారు. స్థానికులు జరిపినదాడిలో తమబృందం సభ్యుని చేయి విరిగిందని ఆయన ఆరోపిస్తున్నారు. కానీ తాము దాడి జరపలేదనీ, వారిని ఎందుకు వస్తున్నారని ప్రశ్నించామనీ, ఆ మాత్రానికే వారు తమపై దౌర్జన్యం జరిపారని గ్రామస్థులు అంటున్నారు. పరస్పర ఆరోపణలుసాగుతుండగా రాజకీయ నాయకులు రంగప్రవేశం చేయడంతో వాతావరణం వేడెక్కింది. చివరికి సిజెపి బృందం వెనక్కి వెళ్లిపోయింది కానీ లేకుంటే మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి ఉండేవి. ఇటువంటి అనూహ్య ఘటనలే మరికొన్ని రాష్ట్రాల్లో కూడా జరగడం గమనించవ లసిన అంశం. సిజెపి చీఫ్

**ఎ.వి.వి ప్రసాద్**

అయిన అభిజిత్ దీప్కే నాయకత్వంలో మరో బృందం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో ఓపాఠశాల పరిస్థితి పరి శీలించడానికి వెళ్లగా అక్కడ వారికి కూడా అదే విధమైన చేదు అనుభవమే ఎదురైంది. ఓ జిల్లా పరిషత్ స్కూలును తాము సందర్శించామనీ, తాము వస్తున్నామని తెలియగానే ఇతర పాఠశాలలనుంచి తెచ్చిన విద్యా ర్థులను అక్కడ కూర్చో బెట్టారనీ దీప్కే ఆరోపించారు. ఆయన చేసిన ఆరోపణ స్థానిక నేతల్లో తీవ్ర ఆగ్రహం కలిగించింది. తాము ఆపాఠశాలను ఎంతో ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నామని అంటూదీప్కే ఆరోపణలను గట్టిగా ఖండించారు. ఇలా ఆరోపణలు, ప్రత్యారోపణలతో 'స్కూల్ ఠీక్ కరో' పక్కదారి పట్టినట్లుగా



అభిజిత్ దీప్కే

కనిపిస్తోంది. అసలు స్కూళ్లను తనిఖీ చేసే అధికారం సిజెపికి ఎవరిచ్చారంటూ స్థానిక నేతలు ప్రశ్నిస్తుంటే, 'మీకు అధునాతన వసతులతో కార్యాలయాలు కావాలా? చదువుకునే పిల్లలకు కనీస వసతులైనా వద్దా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. దీప్కే ప్రశ్నలకు రాజకీయ నాయకులు జవాబు ఇవ్వాల్సిందే. దేశంలోని 65 శాతం ప్రభుత్వ బడులకు కనీసవసతులైనా లేవని సర్వేలు చెబుతున్న మాట వాస్తవమే. పిల్లలు కూర్చొనేందుకు బల్లలుండవు, స్వచ్ఛమైన తాగునీరు ఉండదు, టాయ్‌లెట్లు, బ్లాక్ బోర్డులు కూడా ఉండవు.శిక్షణ పొందిన టీచర్లూ ఉండరు.ఇవన్నీ కొన్ని దశాబ్దాలుగా వింటున్నవే. లక్షలకోట్లరూపాయలు ఇప్పటిదాకా ఖర్చు చేశారన్నదీ వాస్తవమే. కానీ కనిపిస్తున్న దృశ్యం వేరు. నిరుపయోగంగా ఉన్న 'పిఎం కేర్స్' నిధులను స్కూళ్ల బాగు చేయడానికి వాడవచ్చు కదా! అని దీప్కే చేసిన సూచన ఆలోచించవలసిందే. 2025 మార్చి నాటికి పిఎం కేర్స్ ఫండ్ మొత్తం నిల్వ 8,452 కోట్లు ఉన్నదనీ, ఆ సొమ్ముతో వెయ్యిపైగాస్కూళ్లను ఆధునీకరించవచ్చునీ ఆయన అంటున్నారు. అదీ నిజమే. అలాంటి నిరుపయో గంగా ఉన్న నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఇంకా భారీగానే ఉన్నాయి. వాటిలో కొంతశాతం వెచ్చించినా దేశంలోని స్కూళ్లన్నిటిని బాగుచేయవచ్చు. ఇందుకు దృఢమైన రాజకీయ సంకల్పం కావాలి. అధికారంలో ఉన్న నేతల్లో ఆ సంకల్పం కలగాలంటే సిజెపి వంటి యువశక్తి ముందుకు రావడం అవసరమే. అయితే వారు మరింత పకడ్బందీగా వ్యూహాలు రూపొందించుకోవలసిఉంటుంది. ప్రపంచం వైజ్ఞానికంగా ఎంతో ముందుకు వెళుతుండగా అందుకు ప్రాథమికంగా కారణమైన బడులు దీనావస్థలో ఉండడం ఎంతైనా విచారకరం. ఏదో ఓగ్రామంలో ఓ స్కూలు కాదు..దాదాపు అన్నిస్కూళ్లు అదే దుస్థితిలో ఉన్నాయి.దేశంలో 14.66లక్షల ప్రభుత్వ బడులుండగావాటిలో లక్షపైగా స్కూళ్లలో సింగిల్ టీచర్ మాత్రమే ఉన్నారు.చాలా స్కూళ్లు నిజంగా పశువుల కొట్టాల్లానే కనిపిస్తాయి.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పిస్తే ఈపరిస్థితిలో వెంటనే మార్పు తేవచ్చు. ఒకటి రెండు స్కూళ్లు సందర్శించి వివాదాస్పదం కావడం గాక వ్యవస్థలోమార్పు తేవడానికి సిజెపి వంటి యువ సంస్థలు నిర్మాణాత్మక కృషి చేస్తే బాగుంటుంది. స్కూళ్లను తనిఖీ చేసే బాధ్యత సంబంధిత విద్యాశాఖాధికారులది గనుక ఆ అధికారులు, ప్రజాప్రతినిధులు ఏంచేస్తున్నారని నిలదీయవచ్చు. ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. అలాగేదానికి జవాబివ్వాల్సిన బాధ్యత అధికారులకు, నేతలకూ ఉంది. అది సక్రమంగా సాగుతున్నదా, లేదా అనేఅంశంపై సిజెపి వంటిసంస్థలు నిఘా పెట్టాలి.ఏదిచేసి నా హింసకు తావు లేని విధంగా ఉండాలి.అప్పుడే ఆశించిన ఫలితం కనిపిస్తుంది.అభిజిత్ దీప్కే మరో కేజ్రివాల్ కాకూడదనే అనుకొందాం.'స్కూల్ ఠీక్ కరో' మంచి ఆశయమే. దాని సాధనకు మరింత వ్యూహాత్మకమైన మార్గాన్ని అనుసరిస్తే బాగుంటుంది. ●

# ఐరాస రేసులో కరోలిన్

గయానా

ప్రపంచ దేశాలకు మార్గదర్శకత్వం పర్యవేక్షణ సంస్థగా పరిగణిస్తున్న ఐక్యరాజ్యసమితి సర్వోన్నత పదవికి ఎంపిక అనివార్యం అయింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ పదవీకాలం ఈ ఏడాదితో ముగుస్తుండటంతో ఇక రేసులోకి పలువురు రాజకీయ దురంధరులు వచ్చేసారు. ఈసారి ఐక్యరాజ్యసమితికి మహిళ నాయకత్వం వహించే అవకాశాలు ఎక్కువేనని అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి పాశ్చాత్య దేశాలన్నీకూడా ముందునుంచే సంకేతాలిస్తూ వస్తున్నాయి. అందరూ ఊహించినట్లుగానే తొలి రెండు దశల ఓటింగ్ లోనూ కూడా మహిళా నాయకురాలే రేసులోకి వచ్చింది. తదుపరి సెక్రటరీ జనరల్ ఎంపికకు సంబంధించి శుక్రవారం భద్రతా మండలి నిర్వహించిన అనధికారిక స్ట్రా పోల్‌లో గయానా మాజీ విదేశాంగ మంత్రి కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్ అగ్రస్థానంలో నిలిచారు. ఎనిమిది మంది అభ్యర్థులకు మండలిలో ఎంతమేర మద్దతు ఉందో అంచనా వేసేందుకు ఈపోలింగ్ నిర్వహించారు. మొత్తం 15మంది సభ్యులున్న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఆమెకు ఎనిమిది మంది మద్దతు పలికారు. అనధికారికంగా వెలువడిన లెక్కల ప్రకారం ఆమెకు అత్యధిక మద్దతు లభించింది. గతనెలలో జరిగిన తొలి అనధికారిక పోలింగ్లో రెండోస్థానంలో నిలిచిన రోడ్రిగ్స్ బిర్కెట్, ఈసారి తొలి స్థానంలో నిలిచిన యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ అధిపతి రెబెక్కా గ్రిన్‌స్పాన్‌ను అధిగమించారు. అయితే 15 మంది సభ్యులున్న భద్రతా మండలిలో ఏ అభ్యర్థికీ ఎన్నికకు అవసరమైన తొమ్మిది ఓట్లు రాలేదు. అనధికారిక లెక్కల ప్రకారం రోడ్రిగ్స్ బిర్కెట్‌కు 8 అనుకూల ఓట్లు,3వ్యతిరేక ఓట్లు, 4 తటస్థఓట్లు వచ్చాయి. నిజాయితీ, పారదర్శకమైన ఎన్నిక కోసం ప్రచారం చేస్తున్న 1 ఫర్ 8 బిలియన్ అంటే వన్‌ఎఫ్8బి సంస్థ, యూఎన్ వ్యవహారాలను కవర్ చేసే మీడియా సంస్థ పాస్‌బ్లూ ఈ లెక్కలను వెల్లడించాయి. రేసులో పోటీ అభ్యర్థులను అధిగమించినా రోడ్రిగ్స్ బిర్కెట్‌కుముందున్న మార్గం అంత సులభం కాదు. ఆమెకు కనీసం 9 ఓట్లు రావడంతో పాటు, వ్యతిరేక ఓట్లలో వీటో అధికారం కలిగిన ఐదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటి కూడా ఉండకూడదు. గత

**గన్ని మోహన్**

నెలతో పోలిస్తే రోడ్రిగ్స్ బిర్కెట్ అనుకూల ఓట్లు ఒకటి తగ్గాయి. అదే సమయంలో వ్యతిరేకఓట్లు ఒకటి పెరిగాయి. మరోవైపు గ్రిన్స్‌పాన్ మద్దతు గణనీయంగా తగ్గింది. జూలైలో జరిగినపోలింగ్లో ఆమెకు 10 ఎంకరేజ్ ఓట్లు రాగా, ఈసారి అవి 7కు పడిపోయాయి. వ్యతిరేక ఓట్లుమాత్రంఒకటి నుంచి నాలుగుకు పెరిగాయి. ప్రారంభ దశలో జరిగే ఈ స్ట్రా పోల్‌లో శాశ్వత సభ్య దేశాలు ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాయో తెలుసుకోవడం సాధ్యం కాదు. అధికారికంగా స్ట్రా పోల్స్ గోప్యమైనవి. ఈ నెల భద్రతా మండలి అధ్యక్షురాలిగా ఉన్న డెన్మార్క్ శాశ్వత ప్రతినిధి క్రిస్టినా లాసెన్ ఫలితాలను వెల్లడించేందుకు నిరాకరించినప్పటికీ ఫలితాలు అనధికారికంగా



కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్

బయటకు వచ్చాయి. భద్రతా మండలి ఎంపిక చేసే అభ్యర్థిని సెక్రటరీ జనరల్ పదవికి జనరల్ అసెంబ్లీ సిఫారసు చేస్తుంది. కోస్టారికా మాజీ ఉపాధ్యక్షురాలు అయిన గ్రిన్‌స్పాన్ మద్దతు ఒక్కసారిగా తగ్గడం ద్వారా ఈ పోటీ ఇంకా అనిశ్చితంగానే ఉందని స్పష్టమవుతోంది. వీటో అధికారం కలిగిన రష్యాశాశ్వత ప్రతినిధి వాసిలీనెబెంజియా కూడా ఈ అవకాశాన్ని కొట్టిపారేయలేదు. గత నెల పోలింగ్ తర్వాత పోటీలోకి వచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌కు మాజీ ఈక్వెడార్ రాయబారి ఇవోన్ ఎ. బాకీకి ఒక్క అనుకూల ఓటు కూడా రాలేదు. ఆమెకు 8 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. అర్జెంటీనాకు చెందిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫేల్ గ్రోస్సీకి 7 అను కూల, 6 వ్యతిరేక ఓట్లు లభించాయి. దీంతో ఆయన మూడో స్థానంలోనే కొనసాగారు. ఇతర అభ్యర్థుల్లో చిలీ మాజీ అధ్యక్షురాలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మాజీ హైకమిషనర్ మిచెల్ బాచెలెట్, జనరల్ అసెంబ్లీ మాజీ అధ్యక్షురాలు, ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి మరియా ఫెర్నాండా ఎస్పినోసా, యూఎన్‌మాజీ అండర్ సెక్రటరీ జనరల్, ఉగాండా మాజీ విదేశాంగ మంత్రి ఒలారా ఒటున్ను, సెనెగల్ మాజీ అధ్యక్షుడు మాకీ సాల్ ఉన్నారు. ఈఎన్నికపైనా అగ్రరాజ్యం అగ్గిరాజేస్తోందనే చెప్పాలి. స్ట్రాపోల్, తదుపరి సెక్రటరీజనరల్ ఎంపికతీరుపైనా అమెరికా తన నిరసన వ్యక్తంచేసింది. భద్రతా మండలిలో సభ్యదేశం కావడం, అత్యధికంగా నిధులు అందచేసే దేశం కావడంతో సహజంగానేఅమెరికా పెత్తనంచేసేందుకే మొగ్గుచూపిస్తుంది. అమెరికా కనుసన్నల్లోనే ఈ ఎంపిక జరగాలన్న లక్ష్యంతో అగ్రరాజ్యం ఉంది. ప్రస్తుత సర్వప్రతినిధులసభ అధ్యక్షురాలు అన్నాలీనా బేర్‌బాక్‌పై ట్రంప్ ప్రభుత్వం తీవ్రస్థాయిలోనే అభ్యంతరాలు లేవనెత్తింది. శాశ్వత సభ్యదేశాల మధ్య రహస్య చర్చలకు బదులుపార దర్శకమైన ప్రక్రియ ఉండాలని సర్వప్రతినిధుల సభ అధ్యక్షురాలు పేర్కొంటుండటమే అమెరికా ఆగ్రహానికి కారణమైంది. అమె ఐక్యరాజ్యసమితి విధివిధానాలకు వ్యతిరేకంగా ఉన్నారంటూమండి పడింది. ఈఅంశంలో శత్రుదేశమైన రష్యా కూడా అమెరికాకు వంతపాడటం చూస్తుంటే సమితి సెక్రటరీ జనరల్ ఎంపిక మా కనుసన్నల్లోనే జరగాలన్న డిమాండ్‌కనిపిస్తోంది. ఎన్నిక ప్రక్రియ భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలమధ్య రహస్య చర్చలకు మాత్రమే ప్రాధాన్యం ఉండాలన్న డిమాండ్ రష్యా, అమెరికాలు తెరపైకి తీసుకురావడమే బేర్‌బాక్‌పై నిరసన పెరగడానికి కారణం అని తెలుస్తోంది. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ ఈ ఐదుదేశాల్లో ఏ ఒక్క దేశం అయినా తమ వీటో అధికారంతో ఎన్నికను అడ్డుకోవచ్చు. రహస్యంగానే ఎంపిక ఉండాలన్న మెజార్టీ దేశాల డిమాండ్‌ను అధిగమించి బేర్‌బాక్ తన పరిధిని అతిక్రమించారంటూ అమెరికా వాదన తెరపైకి తెచ్చింది. రెండో దఫా జరిగిన స్ట్రాపోల్‌లో శాశ్వత సభ్యదేశాల్లో రోడ్రిగ్స్‌కు ఏదేశాలు వ్యతిరేక ఓటు వేసాయన్నదే ఇప్పుడు అంతుబట్టకుండా ఉంది. ●

# అంతరించే దిశగా వలస పులస చేప

**రుద్రరాజు శ్రీనివాసరాజు**

'పుస్తెలు అమ్ముకునైనా పులస తినాలి' అనే సామెత ఒకప్పుడు గోదావరి ప్రాంత ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించింది. కానీ నేడు అదే పులస అంతరించే జీవజాతుల జాబితాలో చేరే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఒకప్పుడు గోదావరిలో వందల సంఖ్యలో లభించిన ఈ అరుదైన వలస చేప, ఇప్పుడు అరుదుగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక చేప అంతరించే ప్రమాదం మాత్రమే కాదు, గోదావరి జీవవైవిధ్యం, వేలాది మత్స్యకార కుటుంబాల జీవనాధారం, తెలుగు ప్రజల ఆహార వారసత్వం క్రమంగా కనుమరుగయ్యే సంకేతం. దేశంలోనే అత్యంత జీవవైవిధ్యం కలిగిన నదులలో గోదావరి ఒకటి. వివిధ అధ్యయనాల ప్రకారం ఈ గోదావరి పరివాహక ప్రాంతంలో 100కుపైగా స్వదేశీ చేపల జాతులు నమోదయ్యాయి. వాటిలో పులస, జాతికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గోదావరి వరదలు,పులస చేపలు, తెలుగు ప్రజల ఆహార సంస్కృతి ఈ మూడింటికీ విడదీయరాని అనుబంధం ఉంది. ప్రతి ఏడాది జులై,ఆగస్టు నెలల్లో గోదావరి ఉప్పొంగుతుంటే, పులస చేపల కోసం ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తారు. గత పదేళ్లుగా వాటి లభ్యత క్రమంగా తగ్గిపోగా, ఈ ఏడాది పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. పులస అనేది సాధారణ నదీ చేపకాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా హిల్సాగా ప్రసిద్ధి చెందిన వలస చేప. బంగ్లాదేశ్‌లో దీనిని 'ఇలిష్', పశ్చిమ బెంగాల్‌లో 'ఇలిష్', ఒడిశాలో 'ఇలిశీ', మన ప్రాంతంలో సముద్రంలో ఉన్నప్పుడు 'విలస', గోదావరిలోకి ప్రవేశించిన తర్వాత 'పులస'గా పిలుస్తారు. ప్రపంచంలో అత్యధికంగా హిల్సా చేపలు బంగ్లాదేశ్‌లో లభిస్తాయి. ప్రపంచ హిల్సా ఉత్పత్తిలో దాదాపు 80-86 శాతం వాటా ఆ దేశానిదే. భారతదేశంలో పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు ఈ చేపకు ప్రధాన నివాస ప్రాంతాలుగా ఉన్నాయి. పులస జీవిత చక్రం అత్యంత విశిష్టమైనది. సముద్ర జలాల్లో పెరిగిన విలస చేపలు సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లుఈదుకుంటూ బంగాళాఖాతం నుంచి గోదావరి ముఖద్వారం వరకు చేరుకుంటాయి. వరద ప్రవాహాన్ని ఎదురీదుతూ నదిలోకి ప్రవేశించి గుడ్లు పెడతాయి. ఈ ప్రయాణంలో వాటి శరీరంలో జీవరసాయన మార్పులు చోటుచేసుకుంటాయి. సముద్రంలోని తెల్లటి వెండివర్ణం క్రమంగా గోధుమ, ఎరుపు రంగుల్లోకి మారుతుంది. ఈమార్పు వల్లే విలస పులసగారూపాంతరం చెందుతుంది. సంతానోత్పత్తి పూర్తయిన తర్వాత పిల్లలతో తిరిగి సముద్రంలోకి వెళ్తుంది. ఈ వలస ప్రయాణమే పులస ప్రత్యేకతకు, దాని రుచికి కారణమని మత్స్య శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, యానాం, నరసాపురం, అంతర్వేది ప్రాంతాల్లో పెద్దఎత్తున లభించిన పులసలు నేడు అరుదుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో పులస పేరుతో విక్రయిస్తున్న చేపల్లో చాలావరకు ఒడిశా ప్రాంతంలో పట్టిన విలస చేపలే ఉంటున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో నిజమైన గోదావరి పులస చేప చాలా అరుదుగా దొరకడంతో ధరలుఅమాంతం పెరిగాయి.ఒక కేజీ బరువు ఉన్న పులస ధర రూ.10 వేల నుంచి రూ.25వేల వరకు పలికిన సందర్భాలున్నాయి. కొన్ని సార్లు వేలం పాటల్లో అంతకంటే ఎక్కువ ధర కూడా నమోదైంది. ఈకారణంగా ఒకప్పుడు సాధారణ ప్రజలు కూడా కొనుగోలు చేసిన పులస, నేడు కేవలం ధనికుల ఆహారంగా మారిపోవడం విచారకరం. గోదావరి నదిలో పులసల సంఖ్యతగ్గిపోవడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో మొదటిది సముద్ర ముఖద్వారం వద్ద ఇసుక మేటలు పేరుకుపోవడం. దీనివల్ల గోదావరిలోకి చేపల ప్రవేశానికి సహజ మార్గం సంకుచితమవుతోంది. రెండోది సముద్రంలో చమురు,సహజవాయువు అన్వేషణలు.సముద్ర అడుగుభాగంలో జరుగుతున్న శబ్దకాలుష్యం, తవ్వకాలు, యంత్రాల కంపనలు చేపల సహజ వలస మార్గాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మూడవది గోదావరి కాలుష్యం. రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిసరాల్లోని పరిశ్రమల నుంచి



విడుదలవుతున్న శుద్ధిచేయని వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. దీంతో నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి అనేక జలచరాల మనుగడకు ప్రమాదం ఏర్పడుతోంది.ఇప్పటికే కొన్ని స్వదేశీ చేపల జాతులు గణనీయంగా తగ్గిపోయాయి.పులస కూడా ఈ కాలుష్యాన్ని తట్టుకోలేకపోతోంది. ఇక గోదావరి పాయల్లో విచ్చలవిడిగా విస్తరిస్తున్న రొయ్యల సాగు కూడా మరో ప్రధాన కారణం. పర్యావరణ అనుమతులులేకుండానే అనేక ప్రాంతాల్లో రొయ్యల చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో వినియోగించే యాంటీబయాటిక్స్, రసాయనాలు తిరిగి గోదావరిలోకి చేరి నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఈకాలుష్యం పులస గోదావరిలోకి ప్రవేశించేందుకు ప్రతికూల పరిస్థితులను సృష్టిస్తోంది. వాతావరణ మార్పులు కూడా పులసపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గోదావరి వరదల సమయం, దాని తీవ్రతలో హెచ్చుమార్పులు వస్తున్నాయి. కొన్నిసంవత్సరాల్లో వరదలు ఆలస్యంగా రావడం, మరికొన్ని సందర్భాల్లో అతివృష్టి కారణంగా అసాధారణ ప్రవాహాలు ఏర్పడడం వంటి కారణాలు చేత చేపల వలస చక్రం దెబ్బతింటోంది. మత్స్య నిపుణుల అభిప్రాయం ప్రకారం సాధారణ వరద ప్రవాహంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఎదురీదగల పులస, అత్యంత ఉధృతమైన ప్రవాహాన్ని అధిగమించలేక వెనుదిరిగే అవకాశమూ ఉంటుంది. అలాగే సంతానోత్పత్తి కాలంలోనే విచక్షణారహితంగా చేపల వేట సాగుతోంది. గుడ్లు పెట్టడానికి నదిలోకి ప్రవేశించే చేపలను పెద్దఎత్తున పట్టడం వల్ల తదుపరి తరాల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ప్రపంచంలోని అనేకదేశాల్లో ఇలాంటి వలస చేపల వేటపై సంతానోత్పత్తి కాలంలోపూర్తి స్థాయి నిషేధం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రపంచంలో అత్యధిక హిల్సా చేపలు లభించే బంగ్లాదేశ్‌లో ఈ చేప అంతరించి పోకుండా ఉండటానికి పటిష్ట చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితం అవుతున్న పోలవరం ప్రాజెక్ట్‌వలన కూడా అత్యంత అరుదైన పులసల వలసకు ప్రధాన ఆటంకంగా మారుతుందని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ గుర్తించింది. ఈ సమస్య పరిష్కారానికై ఏర్పాటు చేయబడ్డ సెంట్రల్ ఇన్ల్యాండ్ ఫిషరీష్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ విలువైన సూచనలు చేసింది.ఈ సంస్థ చేసిన సూచనలు మేరకు ప్రాజెక్ట్‌వద్ద గోదావరి నదిలోవరద ప్రవాహం ఏ స్థాయిలో ఉన్నా పులసలు స్వేచ్ఛగా తిరిగేలా మూడు చోట్ల ఫిష్ ల్యాడర్ గేట్లను అమర్చడం జరిగింది.ఈ గేట్ల వలన నదిలో నీటిమట్టం గరిష్టంగా ఉన్నా, సాధారణంగా ఉన్నా, కనిష్టంగా ఉన్నా ఈ చేప ఎగువకు, దిగువకు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటాయి.డ్యామ్ అడ్డుగా ఉన్నప్పటికీ పులసలు ఎగువ ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్లి సంతానోత్పత్తి జరుపుకోవడానికి ఈ వ్యవస్థ సహకరిస్తుంది. మొత్తం మీద ప్రపంచంలోనే "ఒక చేప జాతి సహజ వలస ప్రవర్తనను అధ్యయనం చేసి దాని స్వేచ్ఛకు విఘాతం కల్పించకుండా నిర్మిస్తున్న ఏకైక ప్రాజెక్టు పోలవరమేనని పర్యావరణ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. చేపల సహజ సంచారాన్ని దృష్టిలో ఉంచుకొని ఫిష్ ల్యాడర్ల నిర్మాణం చేపట్టడం ఎంతైనా అభినందనీయమే. అయితే ఫిష్ ల్యాడర్ ఒక్కటి మాత్రమే దీనికి పరిష్కారం కాదు. నదికి జీవం ఇచ్చేది స్వచ్ఛమైన ప్రవాహమే. 'దాని కోసం ముందుగా సముద్రం నుంచి గోదావరిలోనికి చేపలు సురక్షితంగా చేరుకునే పరిస్థితులను కూడా ప్రభుత్వం కల్పించాలి. దానికి అత్యవసరంగా సముద్ర ముఖద్వారంలో ఉండే ఇసుక మేటలను శాస్త్రీయంగా తొలగించాలి. పరిశ్రమల వ్యర్థాలను పూర్తిగా శుద్ధిచేసిన తర్వాతే నదిలోకి విడుదల చేసేలా కఠినపర్యవేక్షణ ఉండాలి. అక్రమ రొయ్యల సాగును నియంత్రించాలి. సంతానోత్పత్తి కాలంలో పులస వేటపై తాత్కాలిక నిషేధం విధించి మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి.పులస సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చి స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేయాలి. గోదావరిలో పులస జనాభాపై ప్రతి ఏడాది శాస్త్రీయ సర్వే నిర్వహించి ప్రజలకు నివేదికలు విడుదలచేయడం వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఒకసారి అంతరించిపోయిన జీవజాతిని జీవవైవిధ్యాన్ని తిరిగి తీసుకురావడం దాదాపు అసాధ్యం. అందువలన పులసను కాపాడుకోవడం అంటే కేవలం ఒక చేప జాతిని రక్షించడం మాత్రమే కాదు, గోదావరి నదీ సంస్కృతిని, జీవవైవిధ్యాన్ని, ప్రకృతి సమతుల్యతను, భావితరాల హక్కును కాపాడుకోవడమే అవుతుంది. ●

# చెక్కుల మోసాలకు ఇక చెక్



## సైబర్ నేరాలు అరికట్టేందుకు కొత్త భద్రతా ఫీచర్లు

## ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌తో కొత్త చెక్‌బుక్‌లు రెడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** చెక్కులరూపంలో మోసాలను అరికట్టి, లావాదేవీల భద్రతను పెంచే లక్ష్యంతో బ్యాంకులు సరికొత్త చెక్ బుక్‌లను జారీ చేస్తున్నాయి. వీటిలో ఆల్ఫాన్యూమరిక్ కోడ్ అనే ప్రత్యేకమైన భద్రతా ఫీచర్‌ను జోడిస్తున్నాయి. ఇటీవల బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి పలు బ్యాంకులు తమ చెక్కులపై ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ప్రవేశపెట్టాయి. పాత చెక్ బుక్‌ల స్థానంలో ఈ కొత్త సిరీస్ చెక్ బుక్‌లను తీసుకోవాలని తమ ఖాతాదారులకు సూచిస్తున్నాయి. అక్షరాలు, అంకెల కలయికతో ఉండే ఈ కోడ్, చెక్కులను క్లియరింగ్ సమయంలో సులభంగా గుర్తించి, ధ్రువీకరించడానికి సహాయపడుతుంది. తద్వారా నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన చెక్కుల ద్వారా జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా చెక్ ట్రంకేషన్ సిస్టమ్ ద్వారా చెక్ క్లియరింగ్ వ్యవస్థను వేగవంతం, పటిష్ఠం చేస్తోంది. ఈ విధానంలో చెక్ భౌతికంగా కాకుండా, దాని ఎలక్ట్రానిక్ ఇమేజ్ ద్వారా క్లియరింగ్ జరుగుతుంది. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు భద్రత కూడా పెరుగుతుంది. కొన్ని రకాల పాత చెక్కులకు, ముఖ్యంగా రూ. 50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన వాటికి 2026 డిసెంబర్ 31 చివరి గడువు అంటూ కొన్ని నివేదికలు వస్తున్నాయి. ఇది అన్ని బ్యాంకులకు వర్తించే ఆర్‌బీఐ అధికారిక గడువు కాదని ఆర్బీఐ చెపుతోంది. ప్రతి బ్యాంకుకు దాని సొంత నిబంధనలు ఉండవచ్చు. కాబట్టి, మీ పాత చెక్ బుక్ చెల్లుబాటు అవుతుందో లేదో తెలుసుకోవడానికి, మీ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌ను చూడటం లేదా నేరుగా బ్రాంచ్‌ను సంప్రదించడం ఉత్తమమైన మార్గం.
ముఖ్యంగా వ్యాపారం, ఆస్తుల కొనుగోలు, రుణాలు వంటి అధిక విలువ కలిగిన చెల్లింపులు చేసేవారు తమ బ్యాంకు సూచనలను తప్పక పాటించాలి. మీ పాత చెక్ బుక్‌ను మార్చుకోవాలని బ్యాంకు సూచిస్తే, తదుపరి లావాదేవీకి ముందే ఆ పని పూర్తి చేయడం మంచిది. కొత్త చెక్ బుక్ ఖరీదు బ్యాంకును, ఖాతా రకాన్ని బట్టి మారుతుంది. ఉదాహరణకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవింగ్స్ ఖాతాదారులకు ఒక ఆర్థిక సంవత్సరంలో 25 చెక్ లీఫ్‌లను ఉచితంగా అందిస్తుంది. అదనపు చెక్కులకు సేవా ఛార్జీలు వర్తిస్తాయి. డిజిటల్ చెల్లింపులు పెరిగినప్పటికీ, లావాదేవీలకు పక్కా రికార్డు ఉండటం కోసం చాలామంది ఇప్పటికీ చెక్కులనే వినియోగిస్తున్నారు. చెక్కుపై రాసిన తేదీ నుంచి మూడు నెలల వరకు మాత్రమే అది చెల్లుబాటులో ఉంటుంది. ఒకవేళ చెక్ బౌన్స్ అయితే, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్1881 లోని సెక్షన్ 138 ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చెక్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిది.



## మరో రెండు వారాల్లో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

### స్వయంగా వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 22:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మరో రెండు వారాల్లో అమెరికా పర్యటనకు రానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. పర్యటన తేదీ, సమావేశ వేదిక, చర్చల అజెండాపై ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ ప్రచార సభలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ప్రతిపాదిత బాల్‌రూమ్ నిర్మాణం గురించి మాట్లాడుతున్న సమయంలో షీ పర్యటన ప్రస్తావన తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న ఈస్ట్‌రూమ్‌లో కేవలం 88 మందికే చోటుందని ట్రంప్ చెప్పారు. ఎక్కువ మంది విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. షీ పర్యటన సమయానికే కొత్త బాల్‌రూమ్ అందుబాటులో ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్ ప్రాజెక్టుకు అమెరికా సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. కొత్త సముదాయంలో డ్రోన్లు, క్షిపణుల నుంచి రక్షణ కల్పించే సైనిక సదుపాయాలు ఉంటాయని చెప్పారు. బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, చైనా సహా పలు దేశాలపై టారిఫ్‌ల విధానాన్ని ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికాలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా విదేశీ కంపెనీలపై ఒత్తిడి పెరిగిందని చెప్పారు. అమెరికాలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయని, కర్మాగారాల నిర్మాణం వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. చైనా అమెరికా మధ్య వాణిజ్య, సాంకేతిక రంగాల్లో తీవ్ర విభేదాలు కొనసాగుతున్న వేళ షీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

## ఈ మందులు 4 యేళ్లలోపు పిల్లలకు వాడొద్దు

### కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** నాలుగేళ్లలోపు పిల్లలకు క్లోరిఫెనిరమైన్ మలేట్, క్లోరిఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డిసి) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డిటిఎబి) చేసిన సిఫార్సులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డిసి మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

## మేం చైనీయులం కాదు.. భారతీయులం

### దేశంలో వైరల్ అయిన చిన్నారి విడియో..



**ఇటానగర్, ఆగస్టు 22:** ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ పూర్తిగా భారత్ భూభాగంలోనేఉంది. కానీ చైనా మాత్రం ఈ ప్రాంతం తమదే అంటూ యేళ్లుగా వ్యాఖ్యలు చేస్తూ వస్తోంది. చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ వస్తోంది. చైనా ఈ ప్రాంతాన్ని జాంగ్ వాన్ అని పిలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా స్వయంగా కొత్త పేర్లు పెడుతూ వివాదాలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ చిన్నారికి సంబంధించిన ఎమోషనల్ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓ వ్యక్తి తనను చైనీస్ అని పిలవడంపై చిన్నారి అసంతృప్తి చెందింది. మేం చైనీయులం కాదు భారతీయులం అంటూ వీడియో పోస్టు చేసింది. ఈ నాలుగేళ్ల చిన్నారి వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఈ నాలుగేళ్ల చిన్నారి ఎమోషనల్ వీడియో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజలు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న జాతి వివక్షపై మరోసారి చర్చకు తెరలేపింది. ఈ వైరల్ వీడియో ఓ వ్యక్తి ఆ చిన్నారిని నువ్వు చైనీస్‌వా అని ప్రశ్నిస్తాడు. అందుకు ఆ చిన్నారి ఏమాత్రం తడబడకుండా మేం ఇండియన్స్ చైనీస్ అని పిలిస్తే చాలా కోపం వస్తుంది బాధగా ఉంటుంది. మమ్మల్ని ఇండియన్స్ అని పిలవండి. మేం ఇటానగర్‌లో ఉంటాం అంటూ ఎమోషనల్ అయింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. చిన్నారి మాటలను పలువురు ప్రశంసిస్తున్నారు. చిన్ని యువరాణి నువ్వు ఎప్పటికీ భారతీయురాలివే. అందుకోసం నువ్వు ఎవరికి ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు అంటూ పలువురు ఆమెను ప్రశంసిస్తున్నారు. లవ్ యూ రా చిట్టితల్లి నీ దేశభక్తి సూపర్ అంటూ మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ వీడియోను బెంగాల్ టిఎంసి ఎంపీ మహువా మొయిత్రా ట్యాగ్ చేశారు. చిన్నారిపై ప్రశంసలు కురిపించారు. మై డాన్సింగ్ లిటిల్ గర్ల్ యూ ఆర్ ఇండియా నువ్ ప్యూర్ సౌల్ జై హింద్ జై మణిపూర్ అని కామెంట్ పెట్టారు. ఇక ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారిని చైనీస్, నేపాలీ లేదా ఇతర దేశాలకు చెందినవారిగా పోల్చడం ఇప్పటికీ కనిపిస్తోందని మరికొందరు నెటిజన్లు పేర్కొన్నారు.

## 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు

## ట్రంప్‌కు కోర్టు షాక్


**వాషింగ్టన్, ఆగస్టు 22:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ యేడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది.
10ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సుల్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.
'75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం.
కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారి మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంత వరకూ ఈ నిలిపివేత అమలులో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## కర్ణాటకలో అనలాగ్ పనీర్‌పై యేడాది నిషేధం



**బెంగళూరు, ఆగస్టు 22:** కర్ణాటకలో పనీర్ పేరుతో విక్రయిస్తున్న అనలాగ్ లేదా నాన్‌డెయిరీ పనీర్ తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, హోల్‌సేల్, రిటైల్ విక్రయాలతో పాటు అమ్మకానికి ప్రదర్శించడం, సరఫరా చేయడంపై రాష్ట్ర ఆహార భద్రత, ఔషధ పరిపాలనా శాఖ నిషేధం విధించింది. ఈ ఉత్తర్వులు ఒక యేడాది పాటు అమల్లో ఉంటాయి. పాల కొవ్వు లేదా పాల ఘనపదార్థాలను పూర్తిగా లేదా పాక్షికంగా వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్ డెయిరీ పదార్థాలతో భర్తీ చేసి పనీర్ రూపంలో తయారు చేసిన ఉత్పత్తిని అనలాగ్/నాన్‌డెయిరీ పనీర్‌గా పరిగణిస్తామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను పనీర్ పేరుతో లేబుల్ చేయడం, మార్కెట్ చేయడం, విక్రయించడం లేదా వినియోగదారులకు పనీర్‌గా చూపించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కర్ణాటకలో అధికారులు పలు పనీర్ నమూనాలను పరీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులను తప్పుదారి పట్టించకుండా, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ నిషేధం విధించినట్లు ఆహార భద్రతా శాఖ తెలిపింది.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్‌ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్‌అడిటివ్స్) రెగ్యులేషన్స్, 2011 ప్రకారం పనీర్‌అనేది పాలతో తయారు చేసే ప్రమాణీకరించిన ఆహార ఉత్పత్తి అని అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల కొవ్వు కీలకమైన పదార్థమని, దాని స్థానంలో వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్‌డెయిరీ పదార్థాలను ఉపయోగించడం అనుమతించబడదని తెలిపారు.

## అర్హులైన ఉద్యోగుల పిఎఫ్‌కోసం ఇపిఎఫ్ఓ మరోఛాన్స్



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) పరిధిలోకి ఇప్పటివరకు రాని అర్హులైన ఉద్యోగులను చేర్పించేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తున్నట్టు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందుకోసం ఉద్యోగుల నమోదు క్యాంపెయిన్ 2026ను ప్రారంభించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను పిఎఫ్ పథకంలో చేర్పించలేకపోయిన సంస్థలు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇపిఎఫ్ఒ కోరింది. స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమ తప్పులను సరిదిద్దుకునేందుకు యాజమాన్యాలకు ఇది ఒక ప్రత్యేకమైన వన్‌టైమ్ అవకాశమని స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక నమోదు క్యాంపెయిన్ ఈ యేడాది అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని కార్మిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసి, పిఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులను ఈ పథకం కింద నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రచారం కింద నమోదు చేసే ఉద్యోగులు, డిక్లరేషన్ సమర్పించే నాటికి అదే సంస్థలో ఇంకా పనిచేస్తూ ఉండటం తప్పనిసరి. ఈ ప్రచారం ద్వారా లక్షలాది మంది కార్మికులకు భవిష్య నిధి, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రచారంలో భాగంగా యాజమాన్యాలకు కొన్ని కీలకమైన సడలింపులను కూడా ఇపిఎఫ్ఒ ప్రకటించింది. గతంలో ఉద్యోగి జీతం నుంచి పిఎఫ్ వాటాను మినహాయించని పక్షంలో, ఇప్పుడు ఆ వాటాను చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. కేవలం యాజమాన్యం తన వాటాను, ఇతర చార్జీలను చెల్లిస్తే సరిపోతుంది. ఇది సంస్థలపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ వెసులుబాటుతో పాత బకాయిల సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. యాజమాన్యాలు తాము నమోదు చేయదలిచిన ప్రతి ఉద్యోగికి ఉమాంగ్ యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఆధారిత యూఏఎన్ నంబర్‌ను జనరేట్ చేయాలి. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ చలాన్‌కమ్‌రిటర్న్ (ఇసిఆర్) ద్వారా వారి చందాలను జమ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తవుతుంది. ఈ ప్రచారం ద్వారా సంస్థలు, కార్మికులు ఇద్దరూ ప్రయోజనం పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. చట్టబద్ధమైన సామాజిక భద్రతను కార్మికులకు అందించేందుకు ఇది ఒక నిర్మాణాత్మకమైన మార్గమని పేర్కొంది. సంస్థలన్నీ తమ పాత ఉపాధి, వేతన రికార్డు లను సమీక్షించుకుని, అర్హులైన ఉద్యోగులను గుర్తించి, గడువు తేదీ 2026 అక్టోబర్ 31లోపు వారిని తప్పనిసరిగా పీఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని కార్మిక మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది.

## 15 అడుగుల కొండచిలువకు కేన్సర్

### మనుషులకు చేసే చికిత్సతో నయం చేసిన బ్రిటన్ వైద్యులు

**లండన్, ఆగస్టు 22:** బ్రిటన్ వైద్యులు అరుదైన వైద్యంతో ఓ కొండచిలువకు ప్రాణంపోశారు. కేన్సర్‌తో పోరాడుతున్న 15 అడుగుల కొండచిలువకు మనుషులకు ఉపయోగించే అధునాతనచికిత్స అందించి నయం చేశారు. దవడలోని ప్రాణాంతక కణితిని తొలగించడంతోపాటు ఎలక్ట్రో కెమోథెరపీ నిర్వహించడంతో కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం మళ్లీ చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని చెస్టర్ జూ వెల్లడించింది. ఇంగ్లాండ్‌లోని చెస్టర్ జూలో ఉన్న 23 యేళ్ల రెటిక్యులేటెడ్ పైథాన్ 'జోడీ ఫోస్టర్' ఇటీవల అనారోగ్యానికి గురైంది. సుమారు 50కిలోల బరువున్న ఈ కొండచిలువ కొంతకాలంగా ఆహారం తీసుకోవడం తగ్గించింది. చురుకుదనం కూడా తగ్గింది. దీంతో జూ సిబ్బంది వైద్యపరీక్షలు చేయగా.. దాని దవడలో ఫైబ్రోసార్కోమా అనే ప్రాణాంతక కేన్సర్ కణితి ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి కేన్సర్ కణితిని తొలగించారు. అయితే కొంతకాలానికి కేన్సర్ మళ్లీ తిరగబడింది. ఈసారి దవడతోపాటు ఎముకలోకి కూడా కేన్సర్ కణితి వ్యాపించడాన్ని వైద్యులు గుర్తించారు. దీంతో మరోసారి శస్త్రచికిత్స చేయడం మాత్రమే సరిపోదని వైద్యులు భావించారు. దానికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై చెస్టర్ జూ వెటర్నరీ బృందం.. యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ కేన్సర్ నిపుణులను సంప్రదించింది. అందరూ కలిసి ఎలక్ట్రోకెమోథెరపీ అనే అధునాతన వైద్య చికిత్సను కొండచిలువకు అనుగుణంగా మార్చడం ద్వారా కేన్సర్ నయం చేయవచ్చని ఒక అంచనాకు వచ్చారు. ఈ మేరకు మనుషుల్లో కేన్సర్ చికిత్సకు ఉపయోగించే ఎలక్ట్రోకెమోథరపీ విధానాన్ని తొలిసారిగా ఓ పాముపై ప్రయోగించారు.

## అమెరికా కెనడాలమధ్య ట్రేడ్ వార్ ఉధృతం

### 2వేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై యుఎస్ టారిఫ్

**టొరంటో,ఆగస్టు 22:** అమెరికాకెనడా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అమెరికాతో వాణిజ్య చర్చలను కెనడా ప్రధాని మార్క్ కార్నీ నిలిపివేశారు. చివరి దశ చర్చల్లో అమెరికా ప్రతిపాదించిన కొత్త షరతులు అన్యాయంగా, ఆర్థికంగా నష్టదాయకంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు కెనడా నుంచి వచ్చే సుమారు రెండువేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించేందుకు అమెరికా సిద్ధమైంది. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కెనడాకు ఇతర ప్రధాన ఎగుమతి దేశాల కంటే మెరుగైన వాణిజ్య సదుపాయాలు కల్పించేందుకు అమెరికా ముందుకొచ్చిందన్నారు. అయితే కెనడా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన కొన్ని హామీల నుంచి వెనక్కి తగ్గిందని ఆరోపించారు. కెనడా ప్రధాని కార్నీ మాత్రం అమెరికా చివరి నిమిషంలో మార్చిన నిబంధనలు న్యాయబద్ధంగా లేవనిఅన్నారు. వాటితో ఆర్థికంగా నష్టమేనని పేర్కొన్నారు. కెనడా కార్మికులు, వ్యాపారాలకు అదనపు మద్దతు ప్రకటించనున్నట్లు తెలిపారు.
అమెరికా విధించనున్న 50శాతం టారిఫ్‌లు కెనడా నుంచి అమెరికాకు యేటా వెళ్లే మొత్తం ఎగుమతుల్లో దాదాపు 5 శాతాన్ని ప్రభావితం చేయనున్నాయి. హాకీ స్టిక్స్ నుంచి వైద్య పరికరాల వరకు పలుఉత్పత్తులపై ఈ ప్రభావం పడనుంది. చర్చలు కొనసాగేందుకు ట్రంప్ టారిఫ్ గడువును మూడు రోజులు పొడిగించినా ఒప్పందం కుదరలేదు. గత ఏడాది అమెరికాకెనడా మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 880 బిలియన్ డాలర్లకు చేరింది. కెనడా ఎగుమతుల్లో దాదాపు 72శాతం అమెరికాకే వెళ్తున్నాయి. దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలు ఉన్నప్పటికీ సన్నిహిత మిత్రదేశాలుగా కొనసాగాయి. అయితే కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు, తాజాగా టారిఫ్‌ల పెంపు రెండు దేశాల సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీశాయి.

## ఇక అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఇ-బోర్డింగ్ పాస్

### ప్రయాణీకులకు ఇమ్మిగ్రేషన్ కౌంటర్లవద్ద మరింత సౌలభ్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** విదేశాలకు ప్రయాణించే భారతీయులకు కేంద్రం గుడ్‌న్యూస్ అందించింది. విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సెప్టెంబర్ 1 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద భౌతిక బోర్డింగ్ పాసులను సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. నూతన నిబంధనల ప్రకారం, ప్రయాణికులు తమ డిజిటల్ లేదా ఈబోర్డింగ్ పాస్‌లను చూపించి ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న బోర్డింగ్ పాస్‌లపై ముద్రలు (స్టాంపింగ్) వేసే పద్ధతికి స్వస్తి పలకనున్నట్లు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ప్రకటించింది. ఒకవేళ ప్రయాణికుల వద్ద భౌతిక బోర్డింగ్ పాస్‌లు ఉన్నప్పటికీ వాటిని అనుమతిస్తారు, కానీ వాటిపై ఎలాంటి స్టాంపులు వేయరు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఈ మార్పు అమల్లోకి రానుందని ఢిల్లీలోని ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఒకఅంతర్గత నోట్‌లో ధృవీకరించింది. ప్రస్తుత స్టాంపింగ్ విధానంవల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురికావడంతోపాటు, అప్పుడప్పుడు ముద్రలు వేయడంలో పొరపాట్లు జరుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ గుర్తించింది. ఈ ఇబ్బందులను అధిగమించి, ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈకొత్త నిబంధనపై విమానాశ్రయ యాజమాన్యాలు, సిఐఎస్ఎఫ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అన్నిభాగస్వామ్య పక్షాలను ఆదేశించింది.

## సంక్షిప్త వార్తలు

### ఫ్రాన్స్‌లో తొలి బిఎపిఎస్ హిందూ ఆలయం



**పారిస్, ఆగస్టు 22:** ఫ్రాన్స్‌లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ మొట్టమొదటి భారీ హిందూ దేవాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పారిస్‌లోని బుస్సీ సెయింట్‌జార్జెస్ ప్రాంతంలో బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ బిఎపిఎస్ సంస్థ నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజుల పాటు ఫెస్టివల్ ఆఫ్ కల్చర్ పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు.


### రూ.2395 కోట్లతో మరో బ్రిడ్జికి బిఎంసి గ్రీన్‌సిగ్నల్

**ముంబయి, ఆగస్టు 22:** మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసే మరో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) శ్రీకారం చుట్టింది. నగరంలోని వెర్సోవా, మధ్ ఐలాండ్ ప్రాంతాలను కలుపుతూ మలాడ్ క్రీక్‌పై రూ. 2,395 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక కేబుల్ ఆధారిత వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే, ప్రస్తుతం 60 నుంచి 90 నిమిషాలు పట్టే ప్రయాణం కేవలం 10 నిమిషాలకు తగ్గిపోనుంది.

### అజ్ఞాతంలో మసూద్ అజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** ఆపరేషన్ సిందూర్ తర్వాత జైషే మహ్మద్ అధినేత మసూద్ అజార్ పేరుతో సాగుతున్న ప్రచారంపై భారత నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అజార్ ఆరోగ్యం క్షీణించిందన్న ప్రచారం నేపథ్యంలో అతడు బహిరంగంగా కనిపించడం లేదు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అతడిని అజ్ఞాతంలో ఉంచినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. అజార్ బయటకు రాకపోయినా అతడి ప్రసంగాలు, తీవ్రవాద భావజాలాన్ని మాత్రం జైషే మహ్మద్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. యువతను ఆకర్షించేందుకు వాటినే ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### పిఒకెలో సంక్షోభంపై ఐరాస జోక్యం చేసుకోవాలి



**లండన్, ఆగస్టు 22:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో నెలకొన్న తీవ్రమైన సంక్షోభంపై 70 మందికి పైగా బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులపై తక్షణమే దృష్టి సారించి, అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌కు వారు ఒక లేఖ రాశారు. కశ్మీర్‌పై ఏర్పాటైన ఆల్‌పార్టీ పార్లమెంటరీ గ్రూప్ చైర్మన్, లేబర్ పార్టీ ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ నేతృత్వంలో నిన్న ఈ లేఖను పంపించారు. పిఒకెలో హింసాత్మక ఘటనలు, మరణాలు, గాయాల గురించి తమకు నివేదికలు అందుతున్నాయని ఎంపీలు తమ లేఖలో పేర్కొన్నారు.

### కర్ణాటక ఐఎఎస్ అధికారి అదృశ్యం



**బెంగళూరు, ఆగస్టు 22:** నగరంలోని కెంపెగౌడ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి విమానంలో బయల్దేరిన కర్ణాటక ఐఎఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యం అయ్యారు. ఈ నెల 20న అదృశ్యం అయినట్లుగా మంత్రి ప్రియాంక్ ఖర్గే శనివారం తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వంగానీ కుటుంబ సభ్యులుగానీ ఎక్కడా కూడా అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఐఎఎస్ అధికారి ఫోన్ స్విచ్చాఫ్ వస్తోంది. ఇక ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

# తిరుమల సమాచారం



## నేటి నుంచి భగవంతుడి పవిత్రోత్సవాలు

## శాస్త్రోక్తంగా అంకురార్పణ

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలో ఏడాది పొడ వునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవమూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీవారి సర్వసేనాని విశ్వక్సేనులవారిని ఆలయం నుండి ఊరేగింపుగా నైరుతిమూల ఉన్న వసంతోత్సవమండపానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేపుచేశారు. అక్కడ వేదోక్తంగా పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి పుట్టమన్ను సేకరించారు. దీంతో బీజావాహనం చేస్తారు. పవిత్రోత్సవాలు మూడురోజులు జరగనున్నాయి. ఏటా మూడు రోజుల పాటు ఆలయంలోపల కల్యాణోత్సవమండపంలో (సంపంగిప్రాకారం) జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకారోజు టిక్కెట్లు పొందిన గృహస్థ భక్తులను ఈ సేవకు అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి అధికారులు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను ఐదువేల రూపాయలకు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ టిక్కెట్ పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని ఏడుకొండల స్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో నేటి నుండి ఆయా రోజుల్లో ఉదయం 7 గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయంలోపలకు అనుమతిస్తారు.



## తిరుమల భక్తజనసంద్రం

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం ఉదయానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్రనుండి తరలిరావడంతో ఉదయానికి తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలుసమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఎనిమిది గంటలు సమయం కేటాయిస్తున్నారు. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రంవరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. శుక్రవారం రాత్రి వరకు 78,057మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



## వకుళమాతకు ఏకవీరఫౌండేషన్ సారె

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణ మాసంలో శనివారం రోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తల్లి వకుళమాతకి తిరుపతి నగర సంకీర్తన మండలి సభ్యులు సారే సమర్పించారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర,పండ్లుతో అమ్మవారికి సారే తీసుకెళ్ళారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అమ్మవారికి పట్టు వస్త్రాలుతో సారే సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగర సంకీర్తన మండలి సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ మాట్లాడుతూ సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి తల్లి వకుళ మాతకు ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా శ్రావణమాసం చివరి శనివారం సారెను సమర్పించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాకారులు పలు రకాల వేషధారణతో వేసి అమ్మవారిని మొక్కుకున్నారు దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

## శ్రీవారి సేవలో మాజీమంత్రి అనిల్



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారిని శనివారం ఉద యం మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న కొండ

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15నుండి జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఇప్పటికే తిరుమల ఆలయం పరిసరాలు గ్యాలరీలు నిర్మాణం, తాగునీటికొళాయిలు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. తొమ్మిదిరోజులు జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో



నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ఆలయం శుద్ధి చేయడం(కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం జరగనుంది. ఆ తరువాత వారంరోజులకు 14వతేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. మరుసటిరోజు సెప్టెంబర్ 15వతేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి.

# శ్రీవారి ఖ్యాతి ఇనుమడించేలా నాణ్యమైన ప్రసారాలు

## ఎస్వీబిసి పురోభివృద్ధికి పూర్తిస్థాయి కృషి: నూతన ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రసారాలు మరింత నాణ్యతతో ఉండేలా చూస్తానని ఆ ఛానెల్ నూతన ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ తెలిపారు.. తన ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించేలా ఛానెల్‌లో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు ఉండేలా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే ఎస్వీబిసి ప్రజాధరణ పొందిందని, మరింతగా ఇనుమడింపజేసేలా పనితీరు సాగిస్తానని అన్నారు. టిటిడి ఎస్వీబిసి ఛైర్మన్‌గా నియమితులైన ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆనవాయితీగా ఆలయంలోపల రంగనాయకుల మండపంలో బాధ్యతలు చేపట్టారు. ఉదయం కుటుంబంతో కలిసి స్వామివారిని దర్శించుకున్న తరువాత శ్రీవారి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రమాణస్వీకారం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న శ్రీధర్ వర్మకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి పట్టువస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి సేవలో ఎస్వీబిసిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి



చేస్తానని అన్నారు. శ్రీధర్ వర్మ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నందమూరి కుటుంబ సభ్యులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయం వెలుపల టిటిడి అధికారులు, ఎస్వీబిసి సిబ్బంది, పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతిలోని ఎస్వీబిసి కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ,రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కూటమి నేతలు వర్మని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు రుచికరమైన ఆహారపదార్థాలు

## గరుడసేవ రోజు 15 రకాలు తయారీకి ప్రణాళికలు

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** 'నభూ తో నభవిష్యతి"అనే చందంగా కలియుగవైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజుల పాటు వేంకటేశ్వర స్వామికి జరిపించే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఆకలి అనేది తెలియకుండా మాఢవీధుల్లోని గ్యాలరీల్లో రుచికరంగా ఆహారపదార్థాలు అందించేలా టిటిడి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉదయం,రాత్రి వేళల్లో తొమ్మిది రోజులు రోజుకు రెండు వాహనసేవలు జరుగుతాయి. వాహనసేవల్లో పాల్గొని ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు భారీగా భక్తులు దేశం నలుమూలల నుండి తరలిరావడం పరిపాటి. వచ్చిన ప్రతి భక్తునికి సంతోషకరంగా వాహనసేవల వీక్షణతోబాటు అన్నప్రసాదాలు అందించడం కూడా టిటిడి అంతేప్రాధాన్యతనిస్తుంది. మరీ ముఖ్యంగా ఐదవరోజు జరిగే గరుడసేవకు ఆ రోజు ఉదయం నుండే భక్తులు లక్షలాదిమంది గ్యాలరీల్లోనే గంటల తరబడి కూర్చుని నిరీక్షిస్తుంటారు. అర్ధరాత్రి దాటేవరకు భక్తులు ఎండైనా,వానైనా చలించకుండా గరుడునిపై వేంచేసే మలయప్పస్వామి దర్శనానికి భక్తితో ఆసక్తిచూపుతుంటారు. ఇలా ఉంటున్న లక్షలాదిమంది



భక్తులకు ఆరోజు నిరంతరాయంగా ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల అన్నప్ర సాదాలు, ప్రత్యేక ప్రసాదాలు తయారుచేసి అందించడం జరుగుతుంది.
సాధారణరోజుల్లో వాహనసేవల ఆరంభానికి ముందు గంటరెండుగంటలు గ్యాలరీల్లో ఉంటారు. గరుడసేవకు మాత్రం ఏకంగా 12నుండి 14గంటలపైగా నిరీక్షించడం జరుగుతుంది. ఇలా భక్తులను దృష్టిలో ఉంచుకుని టిటిడి అధికారులు కూడా చక్కటి ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది.ఈ ఏడాది అధిక మాసం రావడంతో తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.సెప్టెంబర్ 15వ తేదీన సాలకట్ల బ్రహ్మోత్సాలు ఆరంభమోతాయి. అక్టోబర్ 12న నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా నాణ్యతలో రాజీ పడకుండా రుచికరమైన అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు చక్కటి ప్లానింగ్‌తో ఉన్నారు. తొలి బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 19న శనివారం రోజు జరగనున్న గరుడ వాహనం రోజున అధిక మంది భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లుతో బాటు 15 రకాల మెనూలను భక్తులకు తయారుచేసి అందించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరిన్ని వంటశాలల ఏర్పాటు చేయడానికి కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమా మిళ్ళ వెంకయ్యచౌదరి, ఇతర అధికారులు ఈ విషయాలపై తలమునకల య్యారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా పెట్టుకోవాలని అధికారులు నిర్ణయించారు.

# 'సర్'లో ఈ నాలుగైదు రోజులే కీలకం

## ఓటర్ల జాబితా సవరణలపై అప్రమత్తంగా ఉండాలి

### అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూసుకోవాలి: సజ్జల

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ సమన్వయకర్తలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర స్థాయి సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న నేతలు, అసెంబ్లీ పరిశీలకులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్ దాఖలు చేసేందుకు నెలాఖరు వరకు చాలా తక్కువ సమ యం మాత్రమే ఉన్నందున పార్టీ యంత్రాంగం వేగంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గత నాలుగైదు నెలలుగా బూత్



స్థాయిలో బీఎల్‌ఏలు చురుకుగా పనిచేయడం వల్ల అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవడంలో మంచి పురోగతి సాధించామని చెప్పారు. ఓటర్ల సంఖ్య 4.16కోట్ల నుంచి 3.71 కోట్లకు తగ్గిన నేపథ్యంలో తొలగింపులకు సంబంధించిన వివరాలను పార్టీ శ్రేణులు నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే వచ్చిన 44 లక్షల నోటీసుల్లో అనుమానాస్పద అంశాలను గుర్తించి, ప్రతి ఓటు స్థాయిలో పరిశీలన జరపడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ స్థాయిలో ప్రత్యేకంగా గుర్తించిన సుమారు 17.29 లక్షల అనుమానాస్పద డూప్లికేట్ ఓట్లను బూత్ స్థాయిలో పరిశీలించాలని సజ్జల తెలిపారు. ఒకే పేరుకు లేదా ఇతర వివరాలకు దగ్గరగా ఉన్న ఓటర్లు వాస్తవంగా ఒకరేనా, వేర్వేరు వ్యక్తులా అనే అంశాన్ని బీఎల్‌ఏలు స్థానికంగా నిర్ధారించాలని సూచించారు. ఆగస్టు 27, 28 తేదీల నాటికి ప్రధాన ప్రక్రియను పూర్తి చేసి, నెలాఖరు చివరి రెండు రోజుల్లో తుది పరిశీలనకు అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఆగస్టు 30 తర్వాత అవకాశాలు పరిమితమవుతాయని, అందువల్ల ప్రస్తుతం ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. కాగా పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆగస్టు 25న కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.
ఈ సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. రాబోయే కొద్దిరోజులు పార్టీకి చెందిన సిబ్బంది, సహాయకులు, నియోజకవర్గ స్థాయి బాధ్యతలు నిర్వహి స్తున్న వారికి స్పష్టమైన టార్గెట్లు కేటాయించి పూర్తి స్థాయిలో ఈ కార్యక్ర మంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడగా, అనంతరం శ్రీ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# చిరంజీవికి సిఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు శుభాకాంక్షలు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ కేంద్రమంత్రి, ప్రముఖ నటుడు, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. చిరంజీవి సినీ రంగంలో సాధించిన విజయాలను, ఆయన సామాజిక సేవను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు."ప్రముఖ చలనచిత్ర నటుడు, కేంద్ర మాజీ మంత్రి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్‌గా నిలిచారు" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అంతేకాకుండా, చిరంజీవి సామాజిక స్పృహను కూడా చంద్రబాబు ప్రశంసించారు. "రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని సమాజం పట్ల తన బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు చిరంజీవికి సోషల్



మీడియా ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## డి.సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

మాజీ కేంద్రమంత్రి,మెగా స్టార్ చిరంజీవికి ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన "ఎక్స్"లో భావోద్వేగ పోస్టు పెట్టారు.అందరికీ చిరంజీవ మెగాస్టార్ అయితే తనకు మాత్రం ఏకైక హీరో అని పవన్ తన పోస్టులో కొనియాడారు. ప్రస్తుతం ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాలేజీ చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు. వేసవి సెలవులకు ఆయన ఇంటికి రావడం మాకు ఒక పండగలా ఉండేది. తిరిగి కాలేజీకి వెళ్లేటప్పుడు ఎంతో బాధపడే వాళ్లం. ఆయన మళ్లీ సెలవులకు వచ్చే వరకు ఇంట్లో ఆ సందడి ఉండేది కాదు. నేను స్కూల్లో చదివే రోజుల్లో అన్నయ్య పక్కన నడవడం కూడా నాకు గర్వంగా ఉండేది. ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి పక్కన నడుస్తున్నానని భావించే వాడిని. ఆయన హీరో కాకముందే నాకు హీరో. నేను ఆయనకు అభిమానిని. షూటింగ్‌ల కోసం ఇతర దేశాలు వెళ్లినప్పుడు ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. ఎప్పుడూ మా సంతోషాన్నే కోరుకుంటాడు అని పవన్ పేర్కొన్నారు.అన్నయ్యకు పెళ్లి అయినప్పుడు ఎక్కడ మాకు దూరమవుతారేమోనని భయపడి ఒక గదిలో నిశ్శబ్దంగా ఏడ్చాను. అప్పుడు ఆయన వదినను నా దగ్గరకు తీసుకువచ్చి,"ఇలా రా ఈరోజు నీకు ఒక పెద్ద మనిషిని పరిచయం చేస్తాను" అన్నారు. నేను ఎందుకు ఏడుస్తున్నానో చూసి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. అప్పటి నుంచి వాళ్లిద్దరూ నాపై చూపిస్తున్న ప్రేమను చెప్పడానికి నాకు పదాలు సరిపోవు. అన్నయ్య ఎన్నోసార్లు షూటింగ్‌లలో గాయపడ్డాడు. చెన్నై వేడి, ఉక్కపోతలో 18 గంటల కష్టపడి పనిచేసి అర్ధరాత్రి నిలబడటానికి కూడా ఓపిక లేని స్థితిలో ఇంటికి వచ్చేవాడు. ఆయన కష్టంపై ఆధారపడి బతుకుతున్నందుకు అప్పుడు చాలా బాధపడేవాడిని. ఎప్పుడూ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. నాకు ఆయన మాత్రమే హీరో అంటూ చిరంజీవికి విషెస్ చెప్పారు.

# గుడివాడలో నాలుగేళ్ల దామిని అదృశ్యం

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా గుడివాడలో నాలుగేళ్ల పాప దామిని అదృశ్యం అయ్యింది. పాప అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటన పట్టణంలో సంచలనంగా మారింది. దామిని తల్లిదండ్రులు వలస కార్మికులు.వారు కూలి పనులు చేసుకుంటారు.వారు పనికి వెళ్ళిన సమయంలో పాప అదృశ్యమైనట్లు సమాచారం.అయితే పెద్దకాలువ సెంటర్‌లో పనికి వెళ్లిన తల్లి వద్దకు పాప ఒంటరిగా వెళ్లినట్లు గుర్తించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలురూపాయలు విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన బండి సత్యనారాయణ శనివారం వేంకటేశ్వర అన్న ప్రసాదంట్రస్టుకు 10లక్షలు విరాళం చెక్కును దాత టిటిడి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడుకు అందజేశారు.

## బైక్‌ను ఢీకొన్న ఐచర్: ఇద్దరు యువకులు మృతి

**తుగ్గలి,ఆగస్టు 22,ప్రభాతవార్త:** తుగ్గలి మండలం జొన్నగిరి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. జొన్నగిరి సమీపంలోని ఎర్రమన్ను



గుట్ట మలుపు వద్ద ప్రధాన రహదారిపై రాత్రి బైకును ఐచర్ వాహనం ఢీ కొట్టడంతో మదనంతపురం గ్రామానికి చెందిన యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుగ్గలి వైపు నుంచి ఏపి39యుజె 9771నంబరు గల ఐచర్ వాహనం జొన్నగిరి వైపు బైక్‌పై వెళ్తున్న యువకులను వేగంగా ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు రోడ్డుపై బలంగా పడడంతో తల తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. ప్రమాదాన్ని స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందన్నారు. గిరిగెట్ల మహేంద్ర (22) చికిత్స పొందుతు మృతి చెందగా హనుమరాజు బాలరాజు(20) పరిస్థితి కూడా విషమంగా ఉండడం వలన మెరుగైన చికిత్స నిమిత్త ం అనంతపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరుయువకులు మృతి చెందడంతో మదనాంతపురం గ్రామంలో విషాచాయలు అలుముకున్నాయి. మృతునితమ్ముడు గిరిగెట్ల మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. ద్విచక్ర వాహనాదారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించి వేగాన్ని నియంత్రిస్తూ వాహనాలు నడపాలని ఎస్సై సూచించారు.

## తుంగభద్ర నదిలో తల్లి, కుమార్తె గల్లంతు



**కౌతాళం, ఆగస్టు 22, ప్రభాత వార్త:** హంపి సమీపంలోని తుంగభద్ర నదిలో ప్రమా దవశాత్తు కాలుజారి పడి కౌతాళం మండలం సులేకేరి గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె గల్లంతయ్యారు. గ్రామానికి చెం దిన షాహీన్ (38), ఆమె కుమార్తె యాస్మీన్ (13) బంధువులతో కలిసి హంపి పర్యటనకు వెళ్లారు. పర్యటనలో భాగంగా తుంగభద్ర నది ఒడ్డున వంట చేసుకుని భోజనం చేసిన అనంతరం తల్లి, కుమార్తె స్నానానికి నదిలోకి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి ఇద్దరూ నీటిలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విష యం తెలుసుకున్న బంధువులు, స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేప ట్టారు. సమాచారం అందుకున్న అధికారులు కూడా గల్లంతైన తల్లి మృతి దేహం లభ్యం కాగా, కుమార్తె కోసం గాలింపు చర్యలు కొన సాగిస్తున్నట్లు సమాచారం. తల్లి, కుమార్తె గల్లంతైన విషయం తెలియడంతో సులేకేరి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధు వులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

## వివాహ బంధం వెలకట్టలేనిది:సిఎం చంద్రబాబు

### ఎమ్మెల్యే కోళ్ల కుమార్తెను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

**విజయనగరం(శృంగవరపుకోట), ఆగస్టు 22, ప్రభాతవార్త:** వివాహ బంధం వెలకట్టలేనిదని నూతన జీవితాన్ని ప్రశాంతంగా సాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. శనివారం ఎస్.కోట నియోజకవర్గం లకవరపుకోటలోని ఎమ్మెల్యే కోళ్ల నివాసంలో కోళ్ల లలితకుమారి, కోళ్ల అప్పల రాంప్రసాద్ దంపతుల కుమార్తె వివాహ వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.ఈ



సందర్భంగా ఆమెను చంద్రబాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అయితే కోళ్ల కుమార్తెకుఈనెల 27వ తేదీన వివాహం జరగనున్న నేపథ్యంలో సీఎంకు అదే తేదీన పలు ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందున శనివారం అనకాపల్లి,విశాఖ జిల్లాల్లో జరిగిన పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లకవరపుకోట మండలం పిల్లాగ్రహారంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగి భారీ కాన్వాయ్ ద్వారా సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే కోళ్ల నివాసానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి,ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.హెలీప్యాడ్ నుంచి ఎమ్మెల్యే కోళ్ల నివాసం వరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు వస్తున్నారని తెలియడంతో హెలీప్యాడ్ నుంచి ఎమ్మెల్యే కోళ్ల నివాసం వరకు ఒకపక్క వర్షం పడుతున్నప్పటికీ దారి పొడుగునా రోడ్డుకిరువైపులా ప్రజలు,టీడీపీ శ్రేణులు నిలుచుని ఘనంగా స్వాగతం పలికారు. మొత్తం మీద ఎమ్మెల్యే కోళ్ల కుమార్తె వివాహ వేడుకలకు సీఎం రాకతో కోళ్ల నివాసం వద్ద పెద్ద ఎత్తున పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లా స్థాయి అధికారులు,టీడీపీ నాయకులు, పిఏసీఎస్ ఛైర్మన్‌లు, వివిధ దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్‌లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ శ్వేతా ఘోష్ మృతి

**రేణిగుంట/తిరుపతిక్రైమ్,ఆగస్టు 22ప్రభాతవార్త:** తమిళనాడు చెన్నైలోని అమీంజికరైలో ఈ నెల 13న నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్వేతా ఘోష్ (35) చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర గాయాలతో చెన్నైలోని ఎంజీఎం ప్రైవేట్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమెను మెరుగైన వైద్యం కోసం రెండురోజుల క్రిందట తిరుపతిలోని అమర హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 21న రాత్రి 9 గంటలకు మృతి చెందినట్లు సమాచారం. ఈ ఫెర్టిలిటీ సెంటర్ జీడీ నెల్లూరు టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు చెందినదిగా పేర్కొంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చెన్నై అమీంజికరై పోలీసులు ఇప్పటికే క్రైమ్ నంబర్ 42/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్‌లోని సీసీటీవీ ఫుటేజీతో పాటు సంబంధిత బిల్లింగ్ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శ్వేతా ఘోష్ ఆత్మహత్యాయత్నానికి దారితీసిన అసలు కారణాలు, బిల్లింగ్ వివాదం నేపథ్యంలో ఆమెపై ఎవరైనా ఒత్తిడి లేదా బెదిరింపులకు పాల్పడ్డారా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్వేతా ఘోష్ మృతితో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



# ఆరుతడి పంటలకు నీరివ్వండి!

## హెచ్ఎల్‌సీ అధికారులతో ఎమ్మెల్యే కాలవ సమీక్ష

**అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో:** తుంగభద్ర ఎగువ ప్రధానకాలువ (హెచ్ఎల్ఎంసీ) పరిధి లోని ఆయకట్టుకు ఆరుతడి పంటల సాగుకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. అనంతపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్ రావు, ఈఈ శ్రీనివాస్ నాయక్ వారి సిబ్బందితో నీటి లభ్యత, అవసరాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావం వల్ల ఈ ఏడాది ఆరంభంలో తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందన్నారు. దాంతో హెచ్ ఎల్ ఎం సి పరిధిలో రైతులు సకాలంలో పంటలు వేసుకోలేక పోయారని గుర్తు చేశారు. తదనంతరం వర్షాలు కురవడంతో డ్యాములో నీరు చేరుతోం దన్నారు. ప్రాజెక్టులో నీటి లభ్యత దృష్ట్యా ఈ ఏడాది హెచ్ఎల్‌సీకి 16 టీఎంసీల నీటి వాటా లభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా మరో 4 టీఎంసీల నీరు అందు బాటులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా ద్వారా మొత్తం సుమారు 20 టీఎంసీల నీరు లభించవచ్చని సూచించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీటి లభ్యత, ఇప్పటికే జరిగిన వినియోగం, తాగునీటి అవసరాలు, నీటివృథా తదితర అంశాలపై సమగ్రంగా లెక్కలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, మిగులు నీటిని ఆరుతడి పంటల సాగుకు వినియోగించే అవకాశాలను పునఃసమీక్షించాలని కోరారు. నీటి లభ్యత ఆధారంగాఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తే తీవ్రవర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.

# జోరుగా విత్తనబంతులు వెదజల్లే కార్యక్రమం

**20వేల హెక్టార్లలో 2 కోట్లకుపైగా వెదజల్లిన సీడ్ బాల్స్**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం**

**50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు**



అనంతపురం జిల్లాలో స్వయంగా డ్రోన్ ఆపరేట్ చేస్తూ విత్తనబంతులు వేదజల్లుతున్న మంత్రి సవిత

**విజయవాడ.ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన కళ్యాణ్ 50 శాతం గ్రీన్ కవర్ సంకల్పం సాకారం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. క్షీణించిన అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యాలతో ఆయన ప్రారంభించిన విత్తన బంతులు(సీడ్ బాల్స్) విస్తరణ కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యంలో 85 శాతం వరకు పూర్తయ్యింది. ఈ మేరకు డీ సీఎంవో ఒక సమాచార పత్రం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమాజాలు, ఎన్జీవోలు, వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 2.06 కోట్ల సీడ్ బాల్స్ ను వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు విజయవాడ(మూలపాడు) ఎకో పార్క్ లో మొదటి విత్తన బంతిని తయారు చేసారు.అదే అధికారులు, ప్రజల్లో పవన్ కళ్యాణ్ నింపిన స్ఫూర్తిగా నిలిచి 2.82 కోట్ల సీడ్ బాల్స్ తయారీకి బీజం వేసింది. ఉప ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా స్వదేశీ, బహుళ ప్రయోజన జాతుల వృక్షాలకు చెందిన విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్స్‌లో మెజారిటీ భాగాన్ని క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుద్ధరణకు వినియోగించారు. ఇందుకోసం డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఇప్పటి వరకు 20,929 హెక్టార్ల విస్తీర్ణంలో సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియను పూర్తి చేశారు. అటవీ అంచుల్లో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, సరిహద్దు గ్రామాల ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. అటవీ ప్రాంతాల్లో వర్షపాతం కొంత మెరుగవడంతో మానవ వనరులు అడుగుపెట్టలేని అడ వుల మధ్య ప్రాంతాల్లో వృక్ష సంపద క్షీణించిన ప్రాంతాలను డ్రోన్ల సాయంతో గుర్తించి సీడ్ బాల్స్ వెదజల్లారు. ప్రాంతాల వారీగా భౌగోళిక పరిస్థితుల అనుకూలతల ఆధారంగా విత్తనాలను ఎంపిక చేశారు. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ కార్యక్రమం విస్తృతంగా కొనసాగింది. అనంతపురం జిల్లా మంత్రి సవిత స్వయంగాఇ డ్రోను ఆపరేట్ చేస్తూ విత్తన బంతులు జల్లారుఅటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సీడ్ బాల్స్ తయారీ, రవాణా, విస్తరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలన్న లక్ష్యాన్ని పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలతో అటవీ అధికారులు ముందుకు తీసుకువెళ్తున్నారు.సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఇందులో భాగస్వాములైన అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కళ్యాణ్ అభినందించారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో, అడవుల పునరుద్ధరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమానికి కొనసాగింపుగా వెదజల్లిన ప్రాంతాల్లో మొలకల శాతం, మొక్కల ఎదుగుదల తదితర అంశాలపై కూడా అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు.

# ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం

**రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జీ డిజి, డైరెక్టర్ పి.వెంకటరమణ**



**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శాఖ ద్వారా ప్రజల ప్రాణ రక్షణ ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం అనంతపురం జిల్లాలో క్షేత్రస్థాయిపర్యటనలో భాగంగా అనంతపురం ప్రధాన కేంద్రంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే జిల్లావ్యాప్తంగా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుగురించి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాత్రికేయ బృందంతో మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ పని తీరుపై పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రం సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇప్పటికే 6 దాకా భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో 36 అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో సుమారు రూ .33 కోట్లతో 65 వాహనాలు రెండవ దశలో 58 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252. 86 కోట్లతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో 25 అధునాతనఅగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా గ్రామీణ ,అటవీ ప్రాంతాల కోసం వీటి సేవలు వినియోగించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్ వద్ద సుమారు రూ. 40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 నూతన ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలోని కళ్యాణ్ దుర్గంలో ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా నిర్వహించబడుతున్న ప్రాంతంలో అదనంగా నూతనంగా 60 సెంట్ల స్థలంలో ఫైర్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం 16వ ఆర్థిక సంఘం కింద రూ .2.25 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే గుత్తి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో 0.50 ఎకరాల భూమిని గూటి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సమకూర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి




**తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త:** తిరుపతిని మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌వీయూ నుంచి ప్రారంభమైన ర్యాలీ బాలాజీ కాలనీ మీదుగా ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. వేలాది మంది విద్యార్థులు, యువత పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ అధ్యక్షతన, తిరుపతి జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఎస్‌వీయూ వీసీ టాటా నరసింగరావు, డీఎస్పీ భక్తవత్సలం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత యాదవ్, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉంచేందుకు విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌వీయూ వీసీ టాటా నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత యాదవ్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ర్యాలీ అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర్‌యాదవ్, ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, సభ్యులు జ్యోతి ప్రకాష్, వెంకటేష్, సోముశేఖర్‌రెడ్డి తదితరులతో పాటు వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# దుర్గమ్మవారి ఆలయంలో స్వచ్ఛత హి సేవ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో ఈవో వీకే సీనా నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఇంద్రకీలాద్రిపై "స్వచ్ఛత హి సేవ" నిర్వహించారు. శ్రీ మల్లికార్జున మహా మండపం ఏడవ అంతస్తు నందు, రాజగోపురం ఎదురుగా ఈ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శానిటేషన్, సెక్యూరిటీ మరియు ఆలయానికి సంబంధించిన అన్ని విభాగాల సిబ్బంది, అధికారులతో ఇఓ "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" చేయించారు. అనంతరం ఆయన సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిగా ప్రతిరోజు కొంత సమయాన్ని పరిసరాల పరిశుభ్రత కొరకు కేటాయించాలని పిలుపునిచ్చారు. శ్రమదానం ద్వారా పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌ను సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం కొరకు ప్రతి ఒక్కరూ గృహ మరియు సాముదాయక మరుగుదొడ్లను వినియోగించేలా, బహిరంగ మలమూత్ర విసర్జన రహిత సమాజం దిశగా అవగాహన కల్పించాలని కోరారు. సెప్టిక్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం వంటి అంశాలపై తోటివారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. దుర్గగుడికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో శానిటేషన్ మరియు సెక్యూరిటీ సిబ్బంది పాత్ర కీలకమని, మన ఆంధ్రప్రదేశ్‌ను "స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఈవో స్పష్టం చేశారు. **దుర్గమ్మవారి సేవలో గోవా సిఎం:** దుర్గమ్మవారిని శనివారం గోవా సిఎం ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు దుర్గమ్మ వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు.



గోవా సిఎంకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి ఈవో స్కానింగ్ పాయింట్‌ను తనిఖీ :** దుర్గమ్మవారి ఆలయ ఇఓ వికె సీనా నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్కానింగ్ పాయింట్‌ను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విఐపి ఎంట్రీ రిజిస్టర్ ఇతర రికార్డులను ఈవో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్కానింగ్ పాయింట్ ఇన్‌చార్జ్ అనురాధ కు విధులకు సంబంధించి పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా నియమాల్లో భాగంగా స్కానింగ్ పాయింట్ వద్ద సెల్‌ఫోన్ల నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కృష్ణా డిస్ట్రిక్ట్ చాగంటిపాడు చెందిన ఎస్ కృష్ణ ఆంజనేయులు శనివారం రూ.1,00,011ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండి తులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన:** దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం"ధర్మపథం"లో విజయవాడకు చెందిన యువ కళాకారిణి నేతి రిషిత బృందం సాయంత్రం కళావేదిక పై ప్రదర్శించిన కూచిపూడి నృత్య రీతులు ఆహుతులను, అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ప్రదర్శన అనంతరం దేవస్థానం తరఫున కళాకారులకు అమ్మవారి శేషవస్త్రాలు ప్రసాదాలను అందచేశారు.

## కోనలో వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

# శ్రీవారి హుండీ ఆదాయం రూ.4,19,921లు

**రాపూరు (నెల్లూరు), ఆగస్టు22, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో రెండవబ్రశావణ శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.4,19,921 రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.1,41,151 లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.16,500 లు,నిత్య కళ్యాణం ద్వారా రూ.34,500,బ్రేక్ దర్శనం ద్వారా రూ.13,000, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.లు దేవస్థానం వసతి ద్వారా రూ. 18వేలు, తలనీలాలు 1200 మంది సమర్పించగా తద్వారా రూ.48000లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,16,895లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.18,870 లు, వడ ప్రసాదం విక్రయం ద్వారా రూ.8,880లు, వాహనాల పూజల ద్వారా రూ.1,325లు చొప్పున మొత్తం రూ.4,19,921లు రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 1750 మంది స్వీకరించారని, సాయంత్రం 6.30 నిమిషాల వరకు మొత్తం 3150 మంది భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,వినోద్ స్వామి, నాగ రాజుస్వామి, సాయిస్వామి, దేవస్థానం సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు తదితరులున్నారు.



# త్వరలో 16కోట్లతో రోడ్ల పనులు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), ఆగస్టు 22, ప్రభాతవార్త :** మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన 45 కోట్లలలో 16 కోట్ల రోడ్డు నిర్మాణాలకు కేటాయించినట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్ లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతు కాజా నగర్ పార్కును వీపిఆర్ పౌండేషన్ సాయంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అలాగే విపిఆర్ పౌండేషన్ సాయంతో అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. బుచ్చిరెడ్డి పాళెం అభివృద్ధికి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన 45 కోట్లలో భాగంగా 16 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని ఆమె తెలిపారు. పరిశుభ్రతను జీవన విధానంలో భాగం చేసుకోవాలని అన్నారు. నెలలో మూడోవ శనివారం మాత్రమే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడంతో సరిపోదని మన ఇంటిని మన ం ఎంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కాజానగర్‌లోని ఉర్దూ పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. స్దానిక మహిళలు తమ పిల్లలకు 9 వ తరగతి,10 వ తరగతి వరకు చదివే అవకాశం కల్పించాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కోరిన వెంటనే స్పందించి అంగీకరించారని ఆమె తెలిపారు. షాది మంజిల్‌కి ఎంపి లాడ్స్ నుండి 15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం షాది మంజిల్ నిర్మాణానికి 50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆమె తెలిపారు.ఈ అంశంపై న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ అబ్దుల్ దృష్టికి,వక్స్ బోర్డు చైర్మన్ అజీజ్ దృష్టికి తీసుకొని వెళ్ళినట్లు ఆమె తెలిపారు. ముందుగా ఎంపి ల్యాడ్స్ నుండి 15 లక్షలతో షాది మంజిల్ పనులు ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. ఈలోగా ప్రభుత్వం నుండి నిదులు మంజూరు అయితే అన్ని సదుపాయాలతో పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు చాలా చైతన్య వంతులు స్దానిక సంస్దల ఎన్నికలలో కూటమి ప్రభు త్వాన్ని ఆదరించాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి,చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ , వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, వైస్ చైర్‌పర్సన్ యర టపల్లి శివకుమార్‌రెడ్డి తదితర పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ సంస్థల్లో ఎఇ ఉద్యోగాల నియామక పరీక్షకు ఏర్పాట్లు

## మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ రంగ సంస్థల్లో ఏఈ ఉద్యోగాల నియామక పరీక్షకు ఏర్పాట్లు చేసామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.మొత్తం 629 ఉద్యోగాలకు లక్షమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారని రవికుమార్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. పారదర్శకంగా నిర్వహిస్తున్న పరీక్షను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలకు సంబంధించి వచ్చే దుష్ప్రచారాలు, వదంతులను ఎవరూ నమ్మొద్దు అని స్పష్టం చేసారు.ఈ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఎవ్వరైనా మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.అటువంటి వ్యక్తులెవ్వరైనా తమ వద్దకు వస్తే అభ్యర్దులు వెంటనే తమకు సమాచారం అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.పరీక్షలు నిర్దేశిత నిబంధనల మేరకు జరుగుతాయన్నారు.ఈ విషయంలో అభ్యర్దులు అవగాహనతో వ్యవహరించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తున్నాం అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.



# జిల్లా సమస్యలపై మంత్రులు మాట్లాడాలి

## రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



**అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో**
ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రధాన సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ లీడ్ తీసుకుని సీఎం చంద్రబాబు, ఇతర ముఖ్యులతో మాట్లాడాలి. మంత్రి సవిత ఎంత సేపు చంద్రబాబు భజనకే సరిపోతోందని, జిల్లా సమస్యలు పట్టించు కోవడం లేదు. అసెంబ్లీ సమావేశాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు కరువు పరిస్థితులపై ఎందుకు నోరు మెదపలేదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే వైసిపి సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులు అద్వానంగా ఉన్నా నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో మన ఎమ్మెల్యేలు ప్రశ్నించక పోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ వేదికగా సీఎం దృష్టికి జిల్లా సమస్యలను తీసుకెళ్లే మంచి అవకాశం వచ్చినా 14 మంది ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో యిచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు ఎన్నో అమలు చేయకపోయినా సూపర్ సిక్స్ అద్భుతంగా పని చేస్తున్నట్లు చంద్రబాబుకు వంగివంగి దండాలు పెడుతున్నారని ఆయన విమర్శించారు. సీనియర్ నాయకుడు మంత్రి పయ్యావుల కేశవ్‌కూడా చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతున్నారని ఆయన విమర్శించారు. రాజధాని అమరావతి పేరుతో అడ్డగోలుగా నిధులు ఖర్చు చేస్తున్నారని ఒక కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి 150 కోట్లు ఖరు ్చ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. నాలుగు లైన్ల హైవే రోడు నిర్మాణానికి కిలోమీటర్‌కు 10 నుంచి 15 కోట్లకు మించి ఖర్చు కాదన్నారు. కరువు పరిస్థితులు అనంతపురం జిల్లాలో తీవ్రంగా ఉన్నాయని రైతు భరోసా కింద ఒక్కొ రైతుకు ఇప్పటికీ 23వేలు బకాయిలు ఉన్నాయని, రైతులకు సున్నా వడ్డీ ఇవ్వడం లేదని, ఇన్‌పుట్ సబ్సిడి విషయంలో కూడా ప్రభుత్వం వెనకడుగు వేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులపై అభిమానంతో పంటల భీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేదని ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆభారం రైతులపై మోపారని ఆయన విమర్శించారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ 40వ కిలోమీటర్ నుంచి మడకశిర బైపాస్ కెనాల్ 125వ కిలోమీటరు వరకు ఉన్న 85వ కిలోమీటర్లను స్కిప్ట్ చేసి నేరుగా బైపాస్ కెనాల్‌కు నీళ్లు అందించే పథకానికి అప్పట్లో వైఎస్.జగన్ టెండర్లు పిలిచారని ఆ పనులను వెంటనే ప్రారంభించారని ఆయన మంత్రి సవితను డిమాండ్ చేశారు. జీడిపల్లి-అప్పర్ పెన్నా ప్రాజెక్టు భూ సేకరణకు రైతులకు చెల్లించాల్సిన సుమారు 200 కోట్ల రూపాయలను ఎందుకు అడగడం లేదని ఆయన మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలుపరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబులను ప్రశ్నించారు. జీడిపల్లి బిటిపి ప్రాజెక్టుకు సంబంధించి మరో 100 కోట్ల భూ సేకరణ బకాయిలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్‌లీడ్ తీసుకుని జిల్లా ఎమ్మెల్యేలు ఎంపిలతో కలిసి ప్రభుత్వం దృష్టికి జిల్లా సమస్యలను తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్‌కు పదవి ముఖ్యం కాదు, జిల్లా ప్రజలే ముఖ్యం అన్న విషయాన్ని గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు ఉపయోగపడేలా ప్రాజెక్టుల ప్రాధాన్యతలను మార్చాలని లేకుంటే ప్రజలు, రైతులు ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# ట్రీసా-గాయత్రికి రెండో డబుల్స్ పతకం



**న్యూఢిల్లీ:** భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్‌ల అద్భుత ప్రస్థానం శనివారం బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో ముగిసింది. ప్రపంచ నంబర్ 1 ఆటగాళ్ళైన చైనాకు చెందిన లియు షెంగ్ షు-టాన్ నింగ్‌లతో జరిగిన పోరులో ఈ జంట మూడు గేమ్‌లలో 21-18, 13-21, 8-21 తేడాతో పోరాడి ఓడిపోయి, చారిత్రాత్మక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ట్రీసా-గాయత్రి చైనా ద్వయాన్ని ఇబ్బంది పెట్టారు. ముఖ్యంగా ట్రీసా నెట్ వద్ద అద్భుతంగా రాణించడంతో, తొలి గేమ్‌లో 7-2 ఆధిక్యాన్ని సాధించారు. అయితే చైనా జోడి ఎదురుదాడి చేసి ఒత్తిడి పెంచుతూ తిరిగి ఆధిక్యాన్ని చేజిక్కించుకుంది. భారత బ్యాక్‌కోర్ట్‌లో పదేపదే ఖాళీలను కనుగొంటూ, వారు వరుసగా 10 పాయింట్లు సాధించి 12-7తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీ, చివరి దశకు చేరుకునే సమయానికి చైనా 18-16 స్వల్ప ఆధిక్యంలో ఉంది. అయితే, భారత్ జంట జోరు పెంచి, తర్వాతి 5 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ గేమ్‌లో భారత్ ద్వయం కొన్ని అనవసర తప్పిదాలతో చైనా ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. ట్రీసా-గాయత్రి కోలుకుని 11-10తో స్వల్ప ఆధిక్యంలోకి వచ్చారు. అయితే, విరామం తర్వాత ఆట గమనం ఒక్కసారిగా మారిపోయింది. ట్రీసా-గాయత్రి అనవసర తప్పిదాలు చోటుచేసుకోవడంతో, వారు తర్వాతి 13 పాయింట్లలో కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగారు. దీంతో చైనా జట్టు మ్యాచ్‌ను సమం చేసి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో, భారత జోడీ ఇబ్బంది పడింది. చైనా బౌలింగ్ దాడితో వారు క్రమంగా తడబడటంతో, వారి ఆటలో వరుసగా బలహీనమైన షాట్లు చోటుచేసుకున్నాయి. లియు-టాన్ ఆటపై పట్టు సాధించి, చివరికి మ్యాచ్‌ను ముగించారు.

# నేడే శ్రీలంకతో కీలక రెండో టెస్ట్





**కొలంబో:** శ్రీలంకపై టెస్ట్ సిరీస్ క్లీన్ స్వీప్ చేసేందుకు టీమిండియా రెడీ అవుతోంది. తొలి టెస్టులో 165 పరుగుల భారీ తేడాతో గెలిచిన భారత్, ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ స్టేడియం వేదికగా ఈ నెల 23 నుంచి రెండో టెస్ట్ ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు మరింత మెరుగుపరుచుకోవాలని గిల్ సేన చూస్తోంది. మరోవైపు సిరీస్ సమం చేయాలంటే ఆతిథ్య శ్రీలంక తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో టెస్టులో భారత బౌలింగ్ విభాగంలో ఒక మార్పు చోటుచేసుకోనుంది. తొలి మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ స్పిన్ మాయాజాలంతో లంకను దెబ్బకొట్టగా, కుల్దీప్ యాదవ్ మాత్రం లయ అందుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం ఒకే వికెట్ తీశాడు. కుల్దీప్‌ను గిల్ కేవలం మూడో స్పిన్నర్‌గా చూస్తున్నట్లు అర్థమవుతోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌కు సపోర్ట్‌గా ఉన్నా ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యం ఉండటంతో అతనికి విశ్రాంతినిచ్చి ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకోనేందుకు సిద్ధమవుతోంది. జైన్ జట్టులోకి వస్తే బ్యాటింగ్ ఆర్డర్ మరింత బలోపేతం అవుతుంది. మరోవైపు శ్రీలంక జట్టును గాయాల సమస్య వేధిస్తోంది. సీనియర్ ఆటగాళ్లు కుశాల్ మెండిస్, దినేష్ చండిమాల్ గాయాల కారణంగా ఈ టెస్టుకు అందుబాటులో లేకపోవడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. వారి స్థానంలో యువ ఆటగాళ్లను రంగంలోకి దించాల్సి వస్తోంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ 53.33 పాయింట్ల శాతంతో ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక 33.33 శాతంతో ఆరో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. భారత్ తుది జట్టు అంచనాకు వస్తే కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్/సారాంశ్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ. అలాగే శ్రీలంక జట్టులో లహిరు ఉదార, కమిల్ మిశార, పసిందు సూర్యబండార, కమిందు మెండిస్, ధనంజయ డిసిల్వా, నిరోషన్ డిక్వెల్లా, సోనాల్ దినూష, కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య, అసిథ ఫెర్నాండో, లహిరు కుమార ఉన్నారు.


## డబ్ల్యూటీసి ఫైనల్స్ నుంచి 4 జట్లు ఔట్

# టీమిండియాకు కఠిన పరీక్షే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సైకిల్ తుది దశకు చేరుకుంటున్న వేళ పాయింట్ల పట్టిక సమీకరణాలు ఉత్కంఠ రేపుతున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ 2027 పోరు కోసం ప్రధాన జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే కొన్ని జట్లు రేసు నుంచి పూర్తిగా తప్పుకోగా, అగ్రస్థానం కోసం కీలక జట్ల మధ్య అసలైన సమరం మొదలైంది. మొత్తం తొమ్మిది జట్లలో వెస్టిండీస్ అధికారికంగా నిష్క్రమించగా, ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంకలకు దారులు మూసుకుపోయినట్లే కనిపిస్తున్నాయి. సాధారణంగా ఫైనల్ చేరాలంటే కనీసం 65 శాతం పాయింట్ల శాతం (పిసిటి) సాధించడం తప్పనిసరి. ప్రస్తుతం పాయింట్ల



పట్టికలో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా (77.78), రెండో స్థానంలో దక్షిణాఫ్రికా (75.00), మూడో స్థానంలో న్యూజిలాండ్ (72.22) ఉన్నాయి. మరో 13 టెస్టులు ఆడాల్సిన ఆసీస్‌తో పాటు, చేతిలో పది టెస్టుల చొప్పున ఉన్న సఫారీలు, కివీస్ జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు గట్టి పోటీనిస్తున్నాయి. ఈ లీగ్ దశలో వెస్టిండీస్ ప్రయాణం దాదాపు ముగిసింది. ఆడిన 12 టెస్టుల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి 20.83 శాతంతో 9వ స్థానానికి పడిపోయిన కరీబియన్ జట్టుకు మిగిలిన 2 మ్యాచ్‌ల్లో గెలిచినా ముందంజ వేసే అవకాశం లేదు. మరోవైపు పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక జట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎనిమిదో స్థానంలో ఉన్న పాకిస్తాన్ పాయింట్ల ఖాతాలో 22.22 శాతం మాత్రమే ఉంది. ఆ జట్టు ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన 7 టెస్టుల్లో దాదాపు అన్నింట్లోనూ విజయం సాధించాల్సిందే. 13 మ్యాచ్‌లాడి 24.36 శాతంతో ఉన్న ఇంగ్లండ్‌కు మిగిలిన 8 టెస్టులు గెలిచినా అగ్రస్థానాలకు చేరుకోవడం కష్టమే. భారత్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడుతున్న శ్రీలంక 33.33 శాతంతో నిలిచి, మిగిలిన 7 టెస్టులను తప్పక గెలవాల్సిన ఒత్తిడిలో పడింది. ఇక అనూహ్యంగా పుంజుకున్న బంగ్లాదేశ్ ప్రత్యర్థి ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించి 66.67 శాతంతో నాలుగో స్థానానికి చేరుకుంది. చేతిలో మరో ఏడు టెస్టులు ఉండటం వారికి కలిసొచ్చే అంశం. ఇక టీమిండియాకు కఠిన పరీక్షే. ఇప్పటివరకు ఆడిన 10 టెస్టుల్లో 5 విజయాలు సాధించి 53.33 శాతంతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. మొత్తం 18 టెస్టుల షెడ్యూల్‌లో మిగిలిన ఎనిమిది మ్యాచ్‌ల్లో నిలకడగా రాణిస్తేనే భారత జట్టు వరుసగా మరోసారి ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉంటాయి.



## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# భారత్ ఖాతాలో మూడు పతకాలు

### మాన్సీ రజతం, తన్వి, కోమల్ కాంస్యం

**స్లోవేకియా:** అండర్ 20, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లర్లు మాన్సీ లాథర్ రజతం గెలుచుకోగా, తన్వి గుండేష్ మగ్దుమ్, కోమల్ కాంస్యం కైవసం చేసుకున్నారు. స్లోవేకియాలో శనివారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల రెజ్లింగ్ బృందం తమ ఖాతాలో ఒకే రోజు మరో మూడు పతకాలను చేర్చుకుంది. చైనాకు చెందిన చెన్లింగ్ సాంగ్‌తో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ఓడిపోవడంతో, 68 కేజీల విభాగంలో మాన్సీ స్వర్ణ పతకాన్ని త్రుటిలో కోల్పోయింది. ఈ రక్షణాత్మక పోరులో 1-2 తేడాతో ఓడిపోయిన ఈ భారత రెజ్లర్ రజత పతకంతో సరిపెట్టుకుంది. ఇక ప్లేఆఫ్‌లలో విజయాల ద్వారా భారత్ రెండు కాంస్య పతకాలను జోడించింది. 57 కేజీల విభాగంలో తన్వి గుండేష్ మగ్దుమ్, కెనడాకు చెందిన ఆగ్నియా క్రాకోవ్స్కను 10-4 తేడాతో ఓడించి కాంస్యం కైవసం చేసుకుంది. ఆ తర్వాత 59 కేజీల విభాగంలో కోమల్, హంగేరికి చెందిన ఎడా బాలాజ్‌పై 5-2 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.





# రెండో టెస్ట్‌లో 64 రన్స్‌కే కుప్పకూలిన బంగ్లా

### 101 రన్స్ ఆధిక్యంలో ఆస్ట్రేలియా

**క్వీన్స్‌లాండ్:** ఆస్ట్రేలియాతో రెండు టెస్టుల సిరీస్‌లో సంచలన విజయంతో తొలి టెస్ట్‌లో శుభారంభం చేసిన బంగ్లాదేశ్ రెండో టెస్ట్‌లో ఆ జోరును కొనసాగించలేకపోయింది. తొలి టెస్ట్ పరాజయంతో పూర్తిగా పేస్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను ఆస్ట్రేలియా సిద్ధం చేయడంతోనే బంగ్లా బ్యాటర్లు తేలిపోయారనే వాదన తెరముందుకొచ్చింది. 41.5 ఓవర్లలోనే 13 బాంగ్లా వికెట్లు పడ్డాయంటేనే పిచ్ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మెకాయ్ వేదికగా శనివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/12) ఆరు వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్ (3/25) మూడు వికెట్లు తీయగా, జోష్ హేజిల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. తొలి టెస్ట్ సెంచరీ హీరో తాంజిద్ హాసన్(0), షాద్‌మన్ ఇస్లాం(0) డకౌట్‌గా వెనుదిరిగారు. మెహ్‌దీ హాసన్ మీరాజ్(11), హసన్ మహ్మూద్(10), తైజుల్ ఇస్లామ్(11 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో మొత్తం నలుగురు బ్యాటర్లు డకౌటయ్యారు. షోరిఫుల్ ఇస్లామ్(14), తైజుల్ ఇస్లామ్ ఆఖరి వికెట్‌కు 25 పరుగులు జోడించి జట్టుస్కోర్‌ను 64కు చేర్చారు. లేదంటే ఆ జట్టు చెత్త రికార్డ్‌ను మూటగట్టుకునేది. అనంతరం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో తొలి రోజు ఆట ముగిసే సరికి 8 వికెటున కోల్పోయి 165 పరుగులు చేసింది. 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. మ్యాట్ రేన్ షా(8), మార్నల్ లబుషేన్(4), అలెక్సీ క్యారీ (5), వెబ్‌స్టర్ (0), పాట్ కమిన్స్ (0), మిచెల్ స్టార్క్ (1) తీవ్ర నిరాశపర్చారు. అయితే కామెరూన్ గ్రీన్ (51 నాటౌట్) అర్థ సెంచరీ చేయగా, స్టీవ్ స్మిత్ (42) ట్రావిస్ హెడ్(22) రాణింగా, నాదన్‌లేన్ (10 నాటౌట్)తో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 8 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి బంగ్లాదేశ్ కంటే 101 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# రూ.3828 కోట్లకు టిక్‌టాక్ అమెరికాతో ఒప్పందం..!




**వాషింగ్టన్, ఆగస్టు 22:** చైనా సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్, దాని మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ అమెరికాలో ఓ కీలక వివాదానికి ముగింపు పలికేందుకు సిద్ధమయ్యాయి. పిల్లల ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఓపీపీఏ)ను ఉల్లంఘించి, వారి డేటాను అక్రమంగా సేకరించాయన్న ఆరోపణలపై యూఎస్ న్యాయ శాఖ దాఖలు చేసిన దావాను పరిష్కరించుకునేందుకు 400 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3,828 కోట్లు చెల్లించడానికి అంగీకరించాయి. ఈ ఒప్పందం ప్రకారం టిక్‌టాక్ ముందుగా 300 మిలియన్ డాలర్లు చెల్లిస్తుంది. గతంలో టిక్‌టాక్ యాప్ అయిన మ్యూజికల్లీకి సంబంధించిన కోర్టు ఉత్తర్వులను రద్దు చేసిన తర్వాత అదనంగా మరో 100 మిలియన్ డాలర్లు చెల్లించనుంది. ఈ ఒప్పందానికి కోర్టు ఆమోదం లభించాల్సి ఉంది. పిల్లల గోప్యతకు సంబంధించిన కేసుల్లో ఇది అతిపెద్ద సెటిల్‌మెంట్లలో ఒకటని యూఎస్ న్యాయ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సెటిల్‌మెంట్ అమెరికన్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు లభించిన గొప్ప విజయం. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని తీసుకునే కంపెనీలు చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేలా చూడటమే మా ప్రాధాన్యతని అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ వుడ్‌వార్డ్ తెలిపారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) తరఫున యూఎస్ న్యాయ శాఖ 2024లో టిక్‌టాక్‌పై దావా వేసింది. 13 ఏళ్లలోపు వయసున్న లక్షలాది మంది పిల్లలను తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఖాతాలు తెరిచేందుకు అనుమతించిందని ఆరోపించింది. దీనివల్ల ఆ ఖాతాలను తొలగించమని అభ్యర్థించడం తల్లిదండ్రులకు కష్టతరంగా మారిందని న్యాయ శాఖ వాదించింది. గత కొన్నేళ్లుగా జాతీయ భద్రతా కారణాలతో టిక్‌టాక్ అమెరికాలో తీవ్రమైన నియంత్రణ సవాళ్లను ఎదుర్కొంది. అమెరికన్ వినియోగదారుల డేటాను చైనా ప్రభుత్వం దుర్వినియోగం చేయవచ్చని, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రచారానికి యాప్‌ను వాడుకోవచ్చని ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

# వారానికి రూ.3.9 కోట్ల రాబడి నష్టం!

### రతన్‌టాటా ట్రస్ట్, ట్రస్టీల వివాదంపై మరో ఫిర్యాదు

**ముంబయి, ఆగస్టు 22:** టాటా సన్స్ వార్షిక సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడిన నేపథ్యంలో సర్ రతన్ టాటా ట్రస్ట్ ట్రస్టీలు తమ చట్టబద్ధ, విశ్వసనీయ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారా అనే అంశంపై మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు ముంబైకి చెందిన అడ్వకేట్, సొలిసిటర్ కిరణ్ డోయిఫోడ్ ఫిర్యాదును అందచేసారు. ఫిర్యాదు ప్రకారం, టాటా సన్స్ బోర్డు సుమారు రూ.4,479 కోట్ల డివిడెండ్‌ను సిఫారసు చేసింది. ఇందులో దాదాపు రూ.2,900 కోట్లు టాటా ట్రస్టులకేచెందుతాయి. టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు కలిపి దాదాపు 66 శాతం వాటా ఉంది. రూ.2,900 కోట్ల మొత్తానికి ఏడాదికి 7 శాతం పెట్టుబడి రాబడి లభిస్తుందని అంచనా వేస్తే, ఒక్క రోజుకు సుమారు రూ.55.6 లక్షలు, వారానికి దాదాపు రూ.3.9 కోట్ల పెట్టుబడి ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని డోయిఫోడ్ పేర్కొన్నారు.60 రోజుల జాప్యం జరిగితే సుమారు రూ.33.4 కోట్ల అవకాశ వ్యయం ఏర్పడవచ్చని ఫిర్యాదులో వివరించారు. ఈ నిధులు సాధారణంగా దాతృత్వ కార్యక్రమాలకు ఉపయోగించాల్సినవని తెలిపారు. ఈ నిధులను వ్యక్తిగత ట్రస్టీలకు చెందిన ప్రైవేటు వాణిజ్య ఆస్తిగా పరిగణించరాదని, అవి ప్రజా ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న చారిటబుల్ సంస్థల వనరులని ఫిర్యాదు స్పష్టం చేసింది. ట్రస్టీలు ఆ నిధులకు సంరక్షకులుగా వ్యవహరించాల్సి ఉంటుందని, వ్యక్తిగత అభిప్రాయ భేదాలు లేదా అంతర్గత విభేదాల కారణంగా లబ్ధిదారులకు ఆర్థిక నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని పేర్కొంది.



అలాగే సర్‌రతన్‌టాటా ట్రస్టీల మధ్య ఉన్న విభేదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు లేదా ప్రయోజనాల సంఘర్షణలు ట్రస్ట్ సమావేశాలు కొనసాగకపోవడానికి కారణమయ్యాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ధార్మిక ట్రస్ట్ ట్రస్టీలు సంస్థ, లబ్ధిదారుల ప్రయోజనాలను చురుకుగా, బాధ్యతాయుతంగా పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని డోయిఫోడ్ పేర్కొన్నారు.



వాణిజ్యం

# టెస్లా సహా భద్రతా లోపాలతో 40 లక్షల కార్ల రీకాల్

**బీజింగ్,ఆగస్టు 22:** భద్రతా లోపాల కారణంగా టెస్లా సహా పలు చైనా కార్ల తయారీ సంస్థలు భారీ సంఖ్యలో వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. ప్రధానంగా కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన సమస్యలే ఇందుకు కారణం. మొత్తంగా 40 లక్షలకు పైగా వాహనాలపై రీకాల్ ప్రభావం పడుతోంది. చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ ప్రకారం టెస్లా చైనాలో తయారు చేసినవి, దిగుమతి చేసుకున్నవి కలిపి సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్‌ఎస్ ఉన్నాయి. తీవ్రమైన ప్రమాదం జరిగి విద్యుత్ వ్యవస్థ పనిచేయకపోతే డోర్‌హ్యాండిల్స్ సరిగా స్పందించకపోవచ్చని చైనా నియంత్రణ సంస్థ తెలిపింది. దీంతో కారులో ఉన్నవారు త్వరగా బయటకు రావడం కష్టమవుతుందని పేర్కొంది. వచ్చే ఏడాది నుంచి కొత్త వాహనాల్లో ఇలాంటి హ్యాండిల్స్‌ను నిషేధించనున్నట్లు ఫిబ్రవరిలో ప్రకటించింది. టెస్లాతో పాటు షియోమీ 3.9 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుస్తోంది. లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేస్తోంది. గీలీ, ఎక్స్‌పెంగ్ సహా మరికొన్ని చైనా సంస్థలు కూడా వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. రీకాల్ అనేది ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ ఎదుగుదలలో సహజమైన దశ అని చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్‌షు పేర్కొన్నారు. డిజైన్ కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



# ఆర్బీఐ ఫారెక్స్ స్వాప్‌తో 72.85 బిలియన్ డాలర్లు రాక

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రవేశపెట్టిన ప్రత్యేక డాలర్‌రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయం వల్ల ఈనెల 21వ తేదీనాటికి మొత్తం 72.85 బిలియన్ డాలర్ల విదేశీ కరెన్సీ నిధులు వచ్చినట్లు తేలింది. శనివారం ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ సదుపాయాన్ని ఆర్‌బీఐ గత జూన్8వ తేదీ ప్రారంభించింది. దేశంలోకి విదేశీ కరెన్సీ నిధుల రాకను పెంచేందుకు మూడు మార్గాలను ఇందులో చేర్చింది. అవి ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) లేదా ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ఈసీబీస్, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్‌వోఎఫ్‌సిబీ,ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్లదే సింహభాగం. మొత్తం విదేశీ కరెన్సీ ప్రవాహాల్లో ఎప్‌సిఎన్‌ఆర్‌బి డిపాజిట్లు 65.40 బిలియన్ డాలర్లతో సింహభాగాన్ని ఆక్రమించాయి. మొత్తం ప్రవాహాల్లో ఇవి దాదాపు 90 శాతంగా ఉన్నాయి. ఇక వోఎఫ్‌సిబి ద్వారా 4.86 బిలియన్ డాలర్లు, ఈసీబిలద్వారా 2.59 బిలియన్ డాలర్లు విదేశీ కరెన్సీ దేశంలోకి వచ్చినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఎఫ్‌సీఎన్‌ఆర్ విండోకు ఆగస్టు 31తో ముగింపు ఎఫ్‌సిఎన్‌ఆర్-బి డిపాజిట్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విండో ఆగస్టు 31, 2026తో ముగియనుంది. అయితే ఈసీబీలు,ఓఎఫ్‌సిబిలకు సంబంధించిన సదుపాయం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది.

# 80వేల డాలర్లకు చేరువగా బిట్‌కాయిన్



**న్యూయార్కు, ఆగస్టు 22:** క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ భారీగా పుంజుకుంది. శనివారం ఉదయం 9.10 గంటలకు 78,588 డాలర్ల వద్ద ట్రేడైంది. గత 24 గంటల్లో గరిష్ఠంగా 4.8 శాతం పెరిగింది. గత వారం రోజుల్లో 24.5 శాతం లాభపడింది. 2023 మార్చి తర్వాత ఇదే అత్యంత బలమైన వారపు ర్యాలీగా నిలిచింది. అమెరికా ట్రెజరీ దీర్ఘకాలిక బాండ్ల బైబ్యాక్‌లను రెట్టింపు చేయనున్నట్లు ప్రకటించడం బిట్‌కాయిన్ జోరుకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మార్కెట్ నిపుణుల అంచనా. ఈ ప్రకటనతో దీర్ఘకాలిక బాండ్ రాబడులు తగ్గాయి. మార్కెట్లలో రిస్క్ తీసుకునే ఆసక్తి పెరిగింది. బిట్‌కాయిన్ ధర పెరగడంతో పతనాన్ని అంచనా వేసి తీసుకున్న భారీ షార్ట్ పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. దీంతో క్రిప్టో ధర మరింత వేగంగా పెరిగింది. మరోవైపు బంగారం ధర కూడా మే తర్వాత గరిష్ఠ స్థాయికి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టో సంస్థల ప్రతినిధులతో సమావేశం కావడం కూడా మార్కెట్‌కు సానుకూల సంకేతంగా మారింది. అమెరికాలో నమోదైన స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల్లోకి సంస్థాగత పెట్టుబడులు మళ్లీ పెరిగాయి. 13 ఈటీఎఫ్‌ల్లోకి ఈ వారం ఇప్పటివరకు బిలియన్ డాలర్లకు పైగా నిధులు వచ్చాయి. 2025 అక్టోబర్‌లో బిట్‌కాయిన్ దాదాపు 1.26 లక్షల డాలర్ల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత భారీ పతనం నమోదైంది. 2026 జూన్ చివర్లో 58,642 డాలర్లకు పడిపోయింది. ప్రస్తుతం 80 వేల డాలర్లకు చేరువగా దూసుకెళుతోంది.




# రిటైల్ క్రెడిట్‌లో పసిడి రుణాలే టాప్!

**ముంబయి, ఆగస్టు 22:** భారత్‌లో గోల్డ్ లోన్లు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రిటైల్ రుణ విభాగంగా మారుతున్నాయని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేపీ మోర్గాన్ పేర్కొంది. రానున్న ఐదేళ్లలో మొత్తం వ్యవస్థాగత రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా ప్రస్తుత 5 శాతం నుంచి సుమారు 10 శాతానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. 2024లో ఈ వాటా కేవలం 2 శాతంగా ఉండేది. బంగారం ఇక కేవలం కుటుంబ వారసత్వ ఆభరణంగా కాకుండా అవసరమైనప్పుడు నగదుగా మార్చుకోగల ఆస్తిగా మారుతున్న నేపథ్యంలో గోల్డ్ లోన్లకు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు ఉన్నాయని జేపీ మోర్గాన్ తన నివేదిక ఇచ్చింది. తక్కువ వడ్డీతో రుణాలుగోల్డ్ లోన్లు భద్రత కలిగిన రిటైల్ రుణాలుగా ఉండటంతో పాటు బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని జేపీ మోర్గాన్ తెలిపింది. ఈ విభాగం తదుపరి దశలో చక్రీయ పరిణామాలపై కాకుండా నిర్మాణాత్మక వృద్ధిపై ఆధారపడుతుందని పేర్కొంది. వ్యక్తిగత రుణాలు వంటి అరక్షిత రుణాలతో పోలిస్తే గోల్డ్ లోన్లపై వడ్డీ రేట్లు 3-6 శాతం పాయింట్లు తక్కువగా ఉండటం రుణగ్రహీతలకు ప్రయోజనం కలిగిస్తోందని తెలిపింది. అదే సమయంలో రుణదాతలకు తక్కువ రిస్క్‌తో కూడిన సెక్యూర్డ్ లోన్ బుక్‌ను పెంచుకునే అవకాశం లభిస్తోందని వివరించింది. దేశంలోని దిగువ 60 శాతం ఆదాయ వర్గాల కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో ప్రస్తుతం కేవలం 11 శాతం మాత్రమే రుణాల కోసం తాకట్టు పెట్టినట్లు జేపీ మోర్గాన్ అంచనా వేసింది. ఇందులో ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా తాకట్టు పెట్టిన బంగారం వాటా కేవలం 3 శాతం మాత్రమేనని తెలిపింది. దక్షిణ భారతదేశంలో దేశంలోని కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో దాదాపు 40 శాతం ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో గోల్డ్ లోన్ మార్కెట్ సంతృప్త స్థాయికి చేరిందన్న అభిప్రాయాన్ని జేపీ మోర్గాన్ తోసిపుచ్చింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే దక్షిణ భారతదేశంలోనూ గోల్డ్ లోన్ వినియోగం దాదాపు సమానంగానే ఉందని, అందువల్ల ఇంకా విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. పర్సనల్, చిన్న వ్యాపార రుణాలకు ప్రత్యామ్నాయంకుటుంబాలు, చిన్న వ్యాపారాలు వ్యక్తిగత రుణాలు, బిజినెస్ రుణాలకు బదులుగా గోల్డ్ లోన్లను ఎంచుకోవడం పెరుగుతోందని జేపీ మోర్గాన్ తెలిపింది. రిటైల్ క్రెడిట్ డిస్బర్స్‌మెంట్లలో గోల్డ్ లోన్ల వాటా 2023లో 18 శాతం నుంచి 2026లో 41 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో అరక్షిత వ్యక్తిగత, చిన్న వ్యాపార రుణాల వాటా 55 శాతం నుంచి 41 శాతానికి తగ్గింది. తక్కువ వడ్డీ రేట్లు, పెరుగుతున్న ఆర్థిక అవగాహన ఈ మార్పుకు ప్రధాన కారణాలని బ్రోకరేజ్ తెలిపింది. విద్య, వైద్య అత్యవసరాలు, ప్రయాణాలు వంటి స్వల్పకాలిక అవసరాలకు కుటుంబాలు తమ వద్ద ఖాళీగా ఉన్న బంగారు ఆభరణాలను నగదుగా మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాయని పేర్కొంది. చిన్న వ్యాపారాలు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కూడా గోల్డ్ లోన్లను వినియోగిస్తున్నాయని తెలిపింది. ముఖ్యంగా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న సబ్ ప్రైమ్ రుణగ్రహీతల్లో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోందని జేపీ మోర్గాన్ పేర్కొంది. గోల్డ్ లోన్లలో మొండి బకాయిలు తక్కురిటైల్ క్రెడిట్ విభాగాల్లో గోల్డ్ లోన్లకు అత్యల్ప బ్యాడ్ లోన్ నిష్పత్తి ఉందని జేపీ మోర్గాన్ తెలిపింది. ఇది సుమారు 0.2 శాతంగా ఉండగా, గృహ, వాహన రుణాల్లో 0.5-0.6 శాతం, అరక్షిత రుణాల్లో 1 శాతానికి పైగా ఉంది. సాధారణంగా 55-65 శాతం లోన్‌టువాల్యూ వద్ద రుణాలు ఇవ్వడం వల్ల రుణదాతలకు తగిన భద్రత ఉంటుందని వివరించింది. 2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ద్వారా బంగారం తాకట్టుపై రుణాలకు సంబంధించిన గరిష్ఠ విలువకు తగ్గరుణం ఎల్టీవీ పరిమితులను వివిధ స్థాయిల్లో పెంచడంతో పాటు, తాకట్టు బంగారం విలువ నిర్ధారణ విధానాన్ని కఠినతరం చేశారు.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం | ఆదివారం 23 ఆగస్టు 2026 | I


# నర్సరీ సంఘ అధ్యక్ష పదవికి ద్విముఖ పోరు : తొమ్మిది వార్డుల్లో ఏకగ్రీవం..

**కడియం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త)** సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎన్నికల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ముగియడంతో పలు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సుగమమైంది. మొత్తం 11 వార్డులకు గాను తొమ్మిది వార్డుల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే బరిలో మిగలడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. 1వ వార్డు నుంచి కామిశెట్టి వెంకటేష్, 2వ వార్డు నుంచి ఉండమట్ల అర్జున్, 4వ వార్డు నుంచి గట్టా కృష్ణ భగవాన్, 5వ వార్డు నుంచి సానా పల్లపురాజు, 6వ వార్డు నుంచి దేగల రాము, 8వ వార్డు నుంచి బోడపాటి చంద్రశేఖర్, 9వ వార్డు నుంచి పాటంశెట్టి శ్రీనివాసు, 10వ వార్డు నుంచి తాడాల సత్యనారాయణ, 11వ వార్డు నుంచి అన్నం దేవుల వెంకటేశ్వరరావు (బాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాగా, 3వ వార్డులో ఆకుల కిశోర్, దూలం సత్యనారాయణ, 7వ వార్డులో పుల్లా శ్రీను, మండెల కృష్ణ మధ్య పోటీ కొనసాగుతోంది. దీంతో ఈ రెండు వార్డులకు ఎన్నిక అనివార్యమైంది.

అధ్యక్ష పదవికి ద్విముఖ పోరు

అసోసియేషన్ అధ్యక్ష పదవికి దాఖలైన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం



బొరుసు సుబ్బారాయుడు, రత్నం అయ్యప్ప మాత్రమే బరిలో మిగిలారు. దీంతో అధ్యక్ష పదవికి ద్విముఖ పోరు నెలకొంది. ఇప్పటికే తొమ్మిది వార్డులు ఏకగ్రీవం కావడంతో అధ్యక్ష ఎన్నికపై నర్సరీ రైతుల్లో ఆసక్తి నెలకొంది. మిగిలిన రెండు వార్డులతో పాటు అధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి ఎన్నికల ప్రక్రియను ఎన్నికల కమిటీ నిర్వహించనుంది.

## విద్యుత్ సరఫరాకు కొత్త వెలుగు



**పిఠాపురం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త )** పిఠాపురంమండలంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. సుమారు రూ.2.8 కోట్ల వ్యయంతో పిఠాపురం132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పీ.దొంతమూరు 33 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానించే ఇంటర్‌లింకింగ్ విద్యుత్ లైన్ పనులు సరవేగంగా సాగుతున్నాయి. పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు పీ.దొంతమూరు సబ్‌స్టేషన్‌కు ప్రత్తిపాడు నుంచి కొడవలి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగేది. దీంతో తరచూ అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇంటర్‌లింకింగ్ పనులు పూర్తయితే పిఠాపురంమండలంలోని సుమారు 15 గ్రామాలకు పీ.దొంతమూరు సబ్‌స్టేషన్ నుంచి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉంది.

**దుర్గాడకు రూ.4.5 కోట్లతో సబ్‌స్టేషన్**

గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి రూ.4.5 కోట్ల వ్యయంతో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు పిఠాపురం ఏడీఈ ఆర్.శ్రీనివాసు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే దుర్గాడతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, నాణ్యమైన కరెంటు అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి జోరు
### రూ.20 లక్షల పనులకు శంకుస్థాపన



**రామచంద్రపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త):** పట్టణ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి చేస్తున్నారని కూటమి పార్టీల సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం తెలిపారు. పట్టణంలోని 16వ వార్డులో రూ.10 లక్షలతో చేపట్టనున్న జీఐ షెడ్, 1వ వార్డు కొత్తూరులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.మున్సిపల్ ఆడిటోరియంలో చేపట్టనున్న జీఐ షెడ్ పనులకు మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తూరులో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆర్థిక నేరస్తుల్ని కూటమి లో ఏ పార్టీలో చేర్చుకున్న సహించేది లేదు : ఎమ్మెల్యే నానాజీ




**కాకినాడ రూరల్, ఆగస్టు22 (ప్రభాతవార్త):** గతంలో జనసేన పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వైసిపి పార్టీకి చెందిన ఆర్థిక నేరస్తులను కూటమిలో ఏ పార్టీ సభ్యత్వం ఇచ్చిన సహించేది లేదని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హెచ్చరించారు. ఒక ప్రకటనలో ఎమ్మెల్యే నానాజీ వీడియోతో మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల పోరాటం లో కూటమి బలం చేకూరడానికి అనే సాకు తో వైసీపీ ఆర్థిక నేరస్తుల్ని, గతంలోజనసైనికుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసిన జనసైనికుల్ని వేధించిన వారిని, 2021 స్థానిక ఎన్నికల్లో మోసం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తెలిపారు.

## నిర్మాణం పూర్తై మూడేళ్ళు...
### ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయం



**యు.కొత్తపల్లి, ఆగస్టు 22 (ప్రభాతవార్త) :** నిర్మాణం పూర్తై రంగులద్దుకుని దాదాపు మూడేళ్ల కావస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా గ్రామ సచివాలయ భవనం ఎదురు చూస్తుంది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం గోర్స గ్రామ సచివాలయం నిర్మాణం పూర్తయింది. కానీ ఎందుకనో అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగులు వేసి, విద్యుత్ సౌకర్యం కూడా కల్పించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తైన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రఫీ సొంత నిధులతో తాగునీటి కుళాయిల ఏర్పాటు




**గోకవరం: ఆగస్ట్ 22 ప్రభాత వార్త** గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామంలోని హై స్కూల్లో కొంతకాలంగా తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ మగ్దూం రఫీ స్పందించారు. తన సొంత నిధులు రూ.40,000 వెచ్చించి గ్రామంలోని హై స్కూల్లో తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. ఈ తాగునీటి కుళాయిలను సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తాగునీరు అందుబాటులో లేక దాహంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు, ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు బాదంపూడి ప్రకాశ్, సత్యం పెద్దబ్బులు, నారా ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. అబ్బులు, ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు మాస్టారు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల దాహం తీర్చేందుకు సొంత నిధులతో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసిన షేక్ మగ్దూం రఫీని గ్రామ ప్రజలు, పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు అభినందించారు. ప్రజా సమస్యను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని వారు కొనియాడారు

## అవయవాలు దానం...

**సఖినేటిపల్లి ఆగస్టు 22, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది కర గ్రామానికి చెందిన ముత్యాల తేజ దుర్గా హనుమంతు వయసు 18 అనే అతని డ్యూక్ మోటార్ సైకిల్ పై వస్తుండగా మార్గంలో ఒక గేదె అడ్డు రావడం తో గుద్ది రోడ్డుపై పడడం వలన తగిలిన గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతనిని చికిత్స నిమిత్తం అమలాపురం లోని కిమ్స్ హాస్పిటల్ కు అక్కడ నుండి కాకినాడలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కు అక్కడ నుండి ట్రస్ట్ హాస్పిటల్ కు తీసుకుని వెళ్లగా అక్కడ డాక్టర్ రాత్రి తేజ దుర్గా హనుమంతు కు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించి, అతని కుటుంబీకులకు తెలపగా వారు అవయవాలు దానం చేయడానికి అనుమతి ఇచ్చి, అవయవాలు దానం చేసినారు. పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నామని ఎస్ఐ దుర్గా శ్రీనివాసు తెలిపారు.

## ఎస్ఐఆర్ జాబితా సవరణలో నాలుగు రోజులను సద్వినియోగం చేసుకోండి

**సామాజిక కార్యకర్త మేకల కృష్ణ**



**శంఖవరం ఆగస్టు 22 ప్రభాతవార్త** ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ (ఓటరు జాబితా సవరణ)లో ప్రజల నుండి అధికారులు సేకరించిన లేదా ప్రజలు ఇచ్చిన సమాచారంలో లోపాలుంటే వాటిని సవరించుకునేందుకు ఈ నెలలో శని, ఆదివారాలైన 22, 23 తేదీల్లోనూ, అలాగే 29, 30వ తేదీల్లోనూ అవకాశం ఉందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సామాజిక కార్యకర్త, ఆర్ టిఐ కార్యకర్త మేకల కృష్ణ ప్రజలను జాగృతం చేసారు. మండల కేంద్రం శంఖవరంలోని పోలింగ్ బూత్ ల వారి బూత్ లెవెల్ అధికారుల పేర్లు, నెంబర్లతో ముద్రించిన కరపత్రాన్ని ఇంటింటా తిరుగుతూ సామాజిక కార్యకర్త మేకల కృష్ణ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మేకల కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం నిరక్షరాస్యులైన ప్రజలు ఉంటారని, వీరికి ఎస్ఐఆర్ ప్రక్రియ, దాని విలువ తెలియజెప్పడం, తప్పుగా నమోదైతే వాటిని సవరించుకునే వీలుకు ఉత్సాహం కనబరిచేలా చేయడం, అర్హులైన యువత నూతన ఓటు హక్కు నమోదుకు ప్రోత్సాహించడం తన ముఖ్యోద్దేశమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో మంచి చైతన్యం వచ్చిందని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కృష్ణ సూచించారు. కార్యక్రమంలో పర్వత రామకృష్ణ, రంగా వీరబాబు, పెనుపోతుల అర్జయ్య, గాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలకు
# బాటలు వేస్తున్న స్వచ్ఛంద సంస్థ
### వార్త కథనంతో స్పందించిన సమరిటన్స్.
### దశ -దిశ మారిన యం. పి.పి. లచ్చిగూడెం పాఠశాల






**చింతూరు ఆగష్టు 22 ప్రభాత వార్త.**మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో కొన్ని చోట్ల కనీస మౌళిక సౌకర్యాలు లేక అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు అక్కడ విద్యా అభ్యాసం చేస్తున్న చిన్నారులు అవస్థలు పడుతున్న ఘటనలు కోకొల్లలు. అటువంటి ఘటనల గురించి పత్రికల్లో కథనలు వెలువడితే కనీసం అధికారులు స్పందించి ఆ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులు,ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్య పరిష్కరించటానికి కృషి చేయాలి. కానీ


వార్త
చిన్నారులకు అసౌకర్యంగా ఎంపీపీ పాఠశాల


అధికారులు నిర్లక్ష్యమో, లేక మనకెందుకులె అనే ధోరణినో కాని సమస్యలు పరిష్కారం కావటం లేదు. చింతూరు మండల లచ్చిగూడెం యం. పి. పి. పాఠశాల దుస్థితి, అక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు పడుతున్న ఇబ్బంది పై ప్రభాత వార్త ఫిబ్రవరి 13 న. చిన్నారులకు అసౌకర్యంగా యం. పి. పి. లచ్చిగూడెం పాఠశాల,అధికారుల నిర్లక్ష్యం, చిన్నారులకు శాపం అనే శీర్షికన కథనం ప్రచురించింది. నెలలు గడిచాయి. అధికారులు, ప్రభుత్వం వైపు నుంచి స్పందన కరువైంది. చివరకు ప్రభాత వార్త సమరిటన్స్ ప్రదినిధి రామ్ కుమార్ దృష్టికి విషయం తీసుకెళ్లి పాఠశాల దీనగాథ, అక్కడ వాస్తవ పరిస్థితి ఫొటోలు, పత్రికలో వచ్చిన వరుస కథనాల గురించి వివరించగా అప్పట్లో డోనార్స్ అందుబాటులో లేరని, సమస్య పరిష్కరించటానికి కొంత టైం పడుతుంది అని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం జూలైలో పాఠశాలను సందర్శించిన రామ్ కుమార్ అక్కడ పాఠశాలలో కనీస మౌళిక సౌకర్యాలు కల్పించటానికి శ్రీకారం చుట్టారు. ఆగష్టు 22 నాటికీ అక్కడ చేపట్టిన పనులు దాదాపు 98% పూర్తి కావటంతో, గ్రామస్తులు, ఉపాధ్యయురాలు,, స్వచంద సంస్థ ప్రతినిధుల సమక్షంలో పండుగ వాతావరణంలో ప్రారంభించారు. నాడు పాఠశాల దుస్థితి ఇలా ఉంది. నేడు సమరిటన్స్ సంస్థ సహకారం, వార్త ప్రభావం తో యం. పి. పి. లచ్చిగూడెం పాఠశాల ఎలా ఉందో ఫోటోల్లో చూడవచ్చు.గిరిజన ప్రాంతాల్లో మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించి, చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో విద్య బుద్దులు నేర్చుకోవటానికి కృషి చేస్తున్న సమరిటన్స్ స్వచ్ఛంద సంస్థ, దాని ప్రతినిధులకు చేతులెత్తి నమస్కరించాలి.


# వాడపల్లి క్షేత్రానికి అశేష భక్త జనం....
## స్వామివారి ఒక్కరోజు ఆదాయం. రూ,70 లక్షలు

- స్వామివారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా...
- వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు.. డీసీ, నల్లం ,చైర్మెన్ ముదునూరి .
- దర్శించుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా...



**ఆత్రేయపురం, ఆగస్టు 22,(ప్రభాత వార్త)** వాడపల్లి వెంకన్నా.. ఆపద మొక్కులవాడా... గోవిందా, గోవిందా అంటూ భక్తుల స్మరణతో శ్రావణమాసం రెండవ శనివారం కావడంతో కోనసీమ తిరుమల క్షేత్రం పులకించింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీమన్నారాయణుడు దివ్యాలంకార శోభితుడై జగన్మోహనంగా దర్శనమిచ్చారు. ఏడు శనివారాల నోము ఆచరించే భక్తజనంతో శ్రీవారి ఆలయం కిటకిటలాడింది. అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించారు. స్వామివారి మూల విరాట్టు, ఆరుబయట విమాన వేంకటేశ్వరస్వామి, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, అండాళ్ అమ్మవారు, విశ్వేశ్వరస్వామి దర్శనాలతో భక్తులు తన్మయత్వం పొందారు.వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి పదిగంటల వరకు కొనసాగాయి. భక్తులు రాత్రి వరకూ క్యూలైన్లలో నిలబడి వెళ్ళి స్వామివారిని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వేదమంత్రాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. వాడపల్లి కొత్త వంతెన నుండి ట్రాఫిక్కు అంతరాయం కలగడంతో స్వయంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు రంగంలోకి దిగారు, పోలీసులతో పాటు ఆలయ సిబ్బందిని కలుపుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా తక్షణమే ట్రాఫిక్కును క్లియర్ చేశారు. డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, మరోపక్క ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజులు కూడా ఎక్కడకక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బిస్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు నిర్వహించారు. క్యూలైన్లు, మాడ వీధులు, వాడపల్లి క్షేత్రానికి 60 వేలకు పైగా భక్తులు రాగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి భక్తులు విజయవాడ, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకన్న వ్రతం ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడం విశేషం. వారంతా అత్యంత భక్తి శ్రద్ధతో స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. మాడ వీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న ఓ భక్తుడు జారవిడిచిన సెల్‌ఫోన్‌ను ఆలయ సిబ్బంది భద్రపరిచి, భక్తునికి తిరిగి అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు. మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 95 వేల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకొన్నట్లు తెలిపారు. సుమారు 25 వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించగా స్వామివారికి వివిధ సేవల ద్వారా సుమారు రూ. 70లక్షలు పైబడి ఆదాయం సమకూరినట్లు తెలిపారు . స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, వరప్రసాద్, గ్రామస్తులు ఏపుగంటి వెంకటేష్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.





## పరిసరాలు పరిశుభ్రంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 22 (ప్రభాతవార్త):** సమాజంలోని ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పిలుపునిచ్చారు.కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాసా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "క్లీన్ సిటీస్, గ్రీన్ కమ్యూనిటీస్" కార్యక్రమానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన సమాజాల నిర్మాణంలో విద్యార్థులు చురుకుగా భాగస్వాములు కావాలని పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి వ్యక్తి విద్యార్థి దశ నుండే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. "క్లీన్ సిటీస్, గ్రీన్ కమ్యూనిటీస్" కార్యక్రమానికి మద్దతుగా విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లీప్ మోడల్ కళాశాలగా ఎంపికైనందుకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రిన్సిపాల్ డా. జ్యోతుల రాంబాబు, శ్రీమతి షాజిదా , ఎస్. వి. ప్రేమ కుమారిలను అభినందించారు. ఈ గుర్తింపు సాధించడంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు సిబ్బంది చేసిన కృషిని ఎమ్మెల్సీ పద్మశ్రీ ప్రశంసించారు.

## చిన్నారుల సర్వతోముఖ వికాసమే లక్ష్యంగా జ్ఞాన జ్యోతి సిడిపిఓ వెంకటలక్ష్మి

**జ్ఞాన జ్యోతి రెండో విడత శిక్షణప్రారంభం**



**శంఖవరం,ఆగస్టు 22, ప్రభాతవార్త** చిన్నారులు సర్వతోముఖ వికాసమే లక్ష్యంగా జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని సిడిపిఓ పర్వత వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి లో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం రెండో విడత జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జ్ఞాన జ్యోతి' రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని,మహిళా, శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని 12 రోజులు ప్రత్యక్ష శిక్షణ, మిగిలిన రోజులు ఆన్‌లైన్ విధానంలో ఉంటుందని, మొదటి విడతలో చిన్నారుల మేధో వికాసంపై శిక్షణ ఇవ్వగా, ప్రస్తుతం ప్రారంభమైన రెండో విడతలో చిన్నారుల శారీరక అభివృద్ధి, పోషణ, ఆటపాటల ద్వారా బోధన, టీఎల్ఎం (బోధన ఉపకరణాలు) తయారీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ-ప్రైమరీ పాఠశాలల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే విద్యా సంవత్సరం నుండి అమల్లోకి రానున్న మార్పులకు అనుగుణంగా కార్యకర్తలను ఉపాధ్యాయులుగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతులను మండల విద్యాశాఖ అధికారి పరిశీలించి శిక్షణలో అందిస్తున్న అంశాలపై తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, సూపర్‌వైజర్లు బీవీ రజిని పాల్గొన్నారు.

## ఎఎన్ఎం యూనియన్ జిల్లా కన్వీనర్ గా ఉషాకుమారి



**కాజులూరు ఆగస్టు 22 (ప్రభాత వార్త)** రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ అనుబంధమైన ఏఎన్ఎంల సంఘం జిల్లా కన్వీనర్ గా సాదే ఉషా కుమారిని ఎంపిక చేసినట్లు ఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులి ప్రసాద్ ప్రకటించారు. కాజులూరు మండలం గొల్లపాలెం ఆర్బికే సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ఎఎన్ఎంలు ప్రజలకు అనేక సేవలు చేస్తున్నారని వాటితో పాటుగా కొంతమంది రాజకీయ నాయకుల నుండి వివిధ యూనియన్ వాళ్ళ నుండి ఎన్నో ఒత్తులు ఎదుర్కొంటున్నారని అటువంటి వాటిని ఎదుర్కోవడానికి రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఏఎన్ఎమ్ ల హక్కుల సాధన కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని పులి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొల్లపాలెం పిహెచ్ సి ఎఎన్ఎం ల యూనియన్ కన్వీనర్ గా చింతాకుల ప్రసన్నకుమారి నియమించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ ఎన్ ఎం లు కె కనకదుర్గ, రామకృష్ణ, కృష్ణవేణి ఏ బుల్లెమ్మ, పి నాగదేవి, వి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

## రఘుదేవపురంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



**సీతానగరం, ఆగస్టు 22, (ప్రభాతవార్త):** మండలంలోని రఘుదేవపురం పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు జి. శేఖర్ మాట్లాడారు. పాఠశాలల్లో ఐసీటీ ఆవశ్యకతను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ టెక్నాలజీని విద్యార్థులకు నేర్పించేలా అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. అలాగే ఏఐ సేవలను అర్థం చేసుకుని విద్యార్థులకు వివరించేందుకు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ తప్పనిసరిగా ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, ఎంఈఓ కే.స్వామి నాయక్, హెచ్ఎం ఎం.శ్యామలాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- నెలకోసారి ప్రచార హంగామా... మిగతా రోజులు పారిశుద్ధ్యం గాలికే
- జిల్లా కేంద్రంలోనే చెత్తకుప్పలు.. నిల్వ నీటితో దోమల బెడద
- అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రజల ఆగ్రహం





# స్వచ్ఛ ఆంధ్ర ఆర్భాటమే...



**రంపచోడవరం ఆగస్టు 22 ప్రభాతవార్త.** నెలకు ఒకసారి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో అధికారుల ఆర్భాటం తప్ప జిల్లా కేంద్రం రంపచోడవరం లో చెత్తకుప్పలు శుభ్రం చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతి నెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ససా ప్రోగ్రాం ను ఎంతో ఆర్భాటంగా చేస్తోంది రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని చెబుతున్నారు. రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో తానే స్వయంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ కూడా ప్రతి నెల మూడవ శనివారం అధికారులు ప్రజాప్రతినిధులు చీపుర్లు పట్టి ర్యాలీలు నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ మరుసటి రోజు నుంచి జిల్లా కేంద్రంలో చెత్తకుప్పలు యధాతధంగా దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాల్లో పాల్గొంటూ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పోలవరం జిల్లాలో మాత్రం ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీల పరిధిలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా గ్రామాలలో పరిశుభ్రత అనేది కంటికి కానరావడం లేదు. ఉన్నతాధికారులు ఎంత చెప్పినప్పటికీ సచివాలయాల పరిధిలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీలో మేజర్ పంచాయతీ అయినా రంపచోడవరంలో పరిస్థితి దారుణంగా ఉంది. పంచాయతీ కార్యాలయం చుట్టూ చెత్త పేరుకుపోయి ఉంది. అలాగే జిల్లా కేంద్రంలో ఏ వీధికి వెళ్ళిన చెత్తకుప్పలో దర్శనమిస్తున్నాయి. కొత్తగా నిర్మించిన డ్రైనేజీ సక్రమంగా వినియోగంలో లేకపోవడంతో మురుగనీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. సాయంత్రం వేళల్లో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీంతో గ్రామస్తులు ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మలేరియా డెంగీ పెరిగి పోవటానికి ఈ దోమలే కారణమని తెలిసినప్పటికీ ఎవరు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది జిల్లాలో పంచాయతీలపరిపాలన చేసే డి ఎల్ పి ఓ కార్యాలయం ఇక్కడే ఉంది. అలాగే డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయం ఇక్కడే ఉంది జిల్లా ఉన్నతాధికారులు నిత్యము మసలే రంపచోడవరం పరిస్థితి ఎలా ఉంటే గ్రామాల పరిస్థితి ఇంకెలా ఉంటుందో ఎవరైనా అర్థం చేసుకోవచ్చు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లాంటి కార్యక్రమాలు మొక్కుబడిగా చేయటం వల్ల సమాజంలో ఎలాంటి మార్పు రాదని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదిక పైన రంపచోడవరం అలాగే జిల్లాలోని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాల్సి ఉంది

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి.



**రౌతుల పూడి, ఆగస్టు 22,(ప్రభాత వార్త)** మండల గ్రామం బంగారయ్య పేట లో కారు ఢీ కొట్టిన ప్రమాదంలో గాయపడిన యువకుడు శనివారం ఉదయం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో ఉత్సాహంగా ఉండే యువకుడు మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సామాజిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పరిశీలన స్వచ్ఛ భారత్ దిశగా డాక్టర్ మహేష్ రెడ్డి అడుగులు



**అడ్డతీగల, ఆగస్టు 22, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

## స్వయంకృషితో సినీ రంగంలో విజేత “ చిరంజీవి”..

### - ఘనంగా పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు..- “మెగాస్టార్” పేరుతో అక్షరానికొక కేకు..



**అంబాజీపేట, ఆగస్టు 22,(ప్రభాతవార్త):** ప్రతిభ,కష్టం,క్రమశిక్షణ,సేవ,పట్టుదలే పెట్టుబడిగా సినీ రంగంలో ప్రవేశించి “స్వయంకృషి”తో అంచెలంచెలుగా ఎదిగి “విజేత” అయిన చిరంజీవి కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారని రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ సిరిగినీడి వెంకటేశ్వరరావు అన్నారు. మెగాస్టార్ కొణిదెల చిరంజీవి 71 వ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు మామిడికుదురు విద్యార్థుల ఎంపిక



**మామిడికుదురు,ఆగస్టు22 (ప్రభాతవార్త)** తిరుపతిలో ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న అమరావతి ఛాంపియన్‌షిప్ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా జట్టు తరఫున ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## పాసర్లపూడి గ్రామ దుకాణాన్ని సందర్శించిన కాయిర్ బోర్డు అధికారులు



**మామిడికుదురు,ఆగస్టు 22(ప్రభాతవార్త)** కాయిర్ బోర్డు ఆధ్వర్యంలో పాసర్లపూడి గ్రామంలో కొబ్బరి పీచు ఉత్పత్తుల దుకాణాన్ని అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు



**రావులపాలెం, ఆగస్టు 22 (ప్రభాతవార్త) :** రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 25న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులని, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను ఈ నెల 24న సాయంత్రం 5 గంటల్లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని, 25న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

## పద్మ భూషన్ కు పుట్టినరోజు వేడుకలు

**కె గంగవరం, ఆగస్టు 22, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం పలు గ్రామాల్లో పద్మభూషణ్,పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి, పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

# ఈతకోటలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**రావులపాలెం, ఆగస్టు 22 (ప్రభాతవార్త)::** మండల పరిధిలోని ఈతకోట గ్రామంలో మెగాస్టార్ కొణిదెల చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి సేవా సమితి, వీవీ వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షుడు గంధ్రోతు దుర్గాసురేష్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ వీధిలోని కమ్యూనిటీ హాల్ రామాలయం వద్ద వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ రామాలయంతో పాటు పలు ఆలయాల్లో చిరంజీవి గోత్రనామాలతో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కేక్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శి మాడుగుల సుందర రామలక్ష్మణ శర్మ, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు మాధవరపు సాయిబాబా, మాజీ ఎంపీటీసీ గంధ్రోతు రాజు, కొడమంచిలి చిరంజీవి, గుబ్బల రాంమోహన్‌రావు (రాము), పోడూరి చింతారావు, గంధ్రోతు వీరగోవిందరావు తదితరుల చేతుల మీదుగా అభిమానుల సమక్షంలో కట్ చేశారు. ప్లకార్డులతో చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు, పెద్దలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎటువంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో ఉన్నత స్థాయికి ఎదిగిన చిరంజీవి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కముజు గణపతి, జనిపిరెడ్డి వెంకటేశ్వరరావు (వెంకన్న), కట్టా హరీష్, పొట్టిపోతు వెంకన్న, యడ్ల ప్రసాద్, గంధ్రోతు రాముడు, దామోదర భాస్కరరావు, దంగేటి పండు, మోటూరి సత్తిపండు, గంధ్రోతు గోపి, జనిపిరెడ్డి నారాయణ, యర్రంశెట్టి సత్తిబాబు, అడబాల నరేష్, కొప్పినీడి సత్తిపండు, కర్రి శ్రీను, చింతపల్లి సత్యనారాయణ (బూరి), మునుకోటి వంశీ, వినుకోట రామకృష్ణ, గంధ్రోతు శ్రీను, నామన గాంధీ, ఏనుగుపల్లి సంపతరావు,గ్రామ పెద్దలు, చిరంజీవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


## చిరు సేవా సమితి సేవలు అభినందనీయం

### -నాగబాబు పిలుపుతో మొక్కలు నాటిన సేవా సమితి



**కడియం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త)** కడియం మండలం చిరు సేవా సమితి అధ్యక్షుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ హరిత కార్యక్రమాల కార్యవర్గం చైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిరు సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బొమ్మూరు శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు అన్నదానం, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బుర్రిలంక జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నాగబాబు పిలుపు మేరకు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని గెడ్డం శివ ఆధ్వర్యంలో చిరు సేవా సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. అభిమానించే వ్యక్తుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని వారి జ్ఞాపకార్థం మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అభిమానులకు పిలుపునిచ్చారు. మొక్కలను పెంచి సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమాల్లో చిరు సేవా సమితి అధ్యక్షుడు గెడ్డం శివ, కోశాధికారి తాళం నరేష్, సమితి సభ్యులు పాల్గొన్నారు.


## తాళ్లరేవు పరదేశమ్మ, ముత్యాలమ్మ తీర్థ మహోత్సవాలు.



**తాళ్ళరేవు ఆగస్టు 22 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు గ్రామ దేవత పరదేశమ్మతల్లి, ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శనివారం రాత్రి అమ్మవారికి జాగరణ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా పరదేశమ్మ ఆలయం వద్ద నుంచి దేవి మహల్ సెంటర్, మెయిన్ రోడ్డు, మార్కెట్ వీధి మీదుగా జల్లావారిపేట అంగడి గుడి వరకు అమ్మవారు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసాధులు గరగ నృత్యాలతో అలరించారు. ఆదివారం అమ్మవారి తీర్థం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

### -పీహెచ్సీలో వైద్య సిబ్బంది హాజరుపై కూటమి శ్రేణులు ఆరా..



**అంబాజీపేట, ఆగస్టు 22,(ప్రభాతవార్త):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ప్రతి ఒక్కరి ప్రధాన బాధ్యతని నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసర వీర వెంకట సత్యనారాయణ,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ సిరిగినీడి వెంకటేశ్వరరావు,సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు లు అన్నారు. “స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర” కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి లోపల, బయట పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత ఏడాది జూన్లో ఫార్మసిస్ట్ బదిలీపై వెళ్లడంతో అప్పటినుండి భర్తీ చేయలేదని, అలాగే ల్యాబ్ టెక్నీషియన్ ను అమలాపురం రూరల్ మండలం బండారులంక పిహెచ్సికి వారంలో మూడు రోజులు పంపించాలని జిల్లా వైద్యాధికారుల నుండి ఆదేశాల రావడంతో అక్కడికి వెళ్లారన్నారు. క్షయ వ్యాధి పూర్తి నిర్ధారణ పరీక్ష ట్రూనాట్ యూనిట్ అంబాజీపేట పి హెచ్ సిలోనే ఉందని, ముక్కామల పీహెచ్సీ నుండి వచ్చే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు అంబాజీపేట పి. హెచ్ లో రక్త పరీక్షలు చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త నమూనా పరీక్షలు జరగక వైద్య సేవలకు అంతరాయం కలుగుతుందని వైద్యురాలు వి.గౌతమి కూటమి నాయకులకు తెలిపారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ),స్టాఫ్ నర్స్, హెల్త్ విజిటర్(హెచ్.వీ)లు లేకపోవడంతో ముఖ్యమైన పనులకు అంతరాయం కలుగుతుందన్నారు. వైద్య సిబ్బందిని త్వరతిన భర్తీ చేయాలని వైద్యురాలు గౌతమి కోరారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ.రాధా నరసింహం, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ,నాగాబత్తుల వెంకట సుబ్బారావు,దొమ్మేటి సాయి కృష్ణ, సుంకర బాలాజీ,వీరా సతీష్, యర్రంశెట్టి నాగేంద్ర, కొప్పినీడి సాయి సూర్య ఉన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ “బొర్రా రాంసాగర్ “కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ




**గండేపల్లి. ఆగస్టు 22. ప్రభాతవార్త**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న”బొర్రా రాంసాగర్ “ ఎన్. ఐ. టి సిల్చార్ అస్సాం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్. ఐ. టి సిల్చార్ అస్సాం కి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. ఎల్. వి. ప్రసాద్., నేతృత్వంలో రాంసాగర్ సమర్పించిన “థీసిస్ శీర్షిక: “ బిహేవియరల్ స్టడీ ఆన్ ఎఫ్ ఆర్ సి బ్ల?స్డ్ లాయర్డ్ అండ్ ఫంక్షనల్లీ గ్రేడెడ్ కాంక్రీట్” అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. “డా.”బొర్రా రాంసాగర్ “ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్,విభాగాధిపతి డా. బి. రామ్మోహన్ రెడ్డి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా. రాంసాగర్ కు అభినందనలు తెలియజేశారు.

## ఎయిడ్స్‌పై ప్రేమానందం కళాజాత బృందం అవగాహన




**కాట్రేనికోన , ఆగస్టు 22(ప్రభాత వార్త)** కాట్రేనికోన మండలం నడవపల్లి పల్లిపాలెం ,కాట్రేనికోన మార్కెట్ ఏరియా లో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు దిశా,జనకళ్యాణ్ ప్రివెన్షన్ యూనిట్, లింక్ వర్కర్స్ స్కీమ్, చేంజెస్ సీఎస్ఓ ఫీల్డ్ స్టాఫ్ సహకారంతో ఐఈసీ (ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా ప్రేమానందం బుర్రకథ బృందం కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ సోకిన వారికి అందుబాటులో ఉన్న చికిత్సా సేవలు, సుఖవ్యాధులు, టీబీ, డ్రగ్స్ వినియోగం, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ ఎయిడ్స్‌కు సంబంధించిన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ ఎయిడ్స్ చట్టం--2017, ఏఆర్‌టీ మందుల కేంద్రాలు, సుఖవ్యాధులు, టీబీ, క్యూఆర్ కోడ్ తదితర అంశాలపై వివరించారు. ప్రజలకు ఐఈసీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనకళ్యాణ్ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీను, ఔట్రీచ్ వర్కర్ కే. శ్రీనివాస్, పీర్ ఎడ్యుకేటర్ రాంసత్యనారాయణ సీఎస్ఓ సిబ్బంది అయినవిల్లి దుర్గ, లింక్ వర్కర్లు, దుర్గ లక్ష్మి, కాశి దుర్గబాయి, జొన్నాడ వెంకటలక్ష్మి , ఏం దుర్గమ్మ కే. సింహాచలం పాల్గొన్నారు

## లొల్ల లాకులు సమీపంలో తృటిలో తప్పిన ప్రమాదం.. రెండు కార్లు ఢీ...పలువురికి తీవ్ర గాయాలు....



**ఆత్రేయపురం, ఆగస్టు 22,(ప్రభాత వార్త)** మండలంలోని లొల్ల గ్రామం, లొల్ల లాకుల మధ్య సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి వెళ్తున్న ప్రయాణికుల వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని.

## అంగన్వాడీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

### -30 మంది అంగన్వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, ఆగస్టు 22, (ప్రభాతవార్త)** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు గర్భిణీలు బాలింతలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేస్తూ సిబ్బందికి నియామకాలు చేపడుతున్నామని తెలిపారు కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో కొత్తపేట రావులపాలెం ఆత్రేయపురం ఆలమూరు మండలాల్లో అంగన్వాడీ హెల్పర్లుగా ఎంపికైన 30 మంది అభ్యర్థులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నియామక పత్రాలను ఏపీ బీసీ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంత కుమార్ తో కలిసి అందజేశారు ఎంపికైన వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే అంగన్వాడీ కేంద్రాల్లో బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ చిన్నారులకు గర్భిణీలు బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 58 204 మంది అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బందికి సుమారు రూ75 కోట్ల వ్యయంతో 5జీ చేస్తున్నట్లు స్మార్ట్‌ఫోన్లు అందించినట్లు తెలిపారు అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ తాగునీరు మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు ముఖ్యంగా చిన్నారుల పట్ల ఆప్యాయతతో వ్యవహరిస్తూ వారి ఆరోగ్యం పోషణ ప్రాథమిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు కొత్తపేట నియోజకవర్గంలో 30 మందికి ఒకేసారి నియామక పత్రాలు అందజేయడం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరతను తగ్గించడంతో పాటు సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకున్న అంగన్వాడీ హెల్పర్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధర్ రావు కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పల్లి మంగాదేవి భీమారావు వైస్ కంఠం శెట్టి శ్రీనివాసరావు తదితర పాల్గొన్నారు

## స్వచ్ఛ ఆంధ్రతో పోలవరం జిల్లా చెత్తరహితం కావాలి: కలెక్టర్ దినేష్ కుమార్

### -డస్ట్‌బిన్లు ఏర్పాటు, పారిశుద్ధ్యంపై అధికారులకు ఆదేశాలు




**రంపచోడవరం, ఆగస్టు 22: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో ప్రతి గ్రామం, ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా అందరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. రంపచోడవరంలోని సాయినగర్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రాలు, గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, వ్యాపార ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ తయారీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, పాత ఇనుము, అట్టలు తదితర వ్యర్థాలను సేకరిస్తూ జిల్లాను చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాల వల్ల జిల్లాలో మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ దోమల నివారణకు గ్రామాల్లో నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, రహదారులను శుభ్రపరిచి, డివైడర్లలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు వినియోగ నిర్మూలనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### -అనపర్తి ఎమ్మెల్యే: నల్లమిల్లి.




**పెదపూడి: ఆగస్టు 22: ప్రభాతవార్త:** పెదపూడి మండలం గొల్లల మామిడాడ ఏఆర్సి ఫంక్షన్ హాల్ లో డ్రగ్స్ రహిత సమాజం – మాదకద్రవ్యాలు వినియోగ నిర్మూలన” అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు,ఆశా వర్కర్లు, సచివాలయ, ఉద్యోగులు, మండలాధికారులు, పోలీసులతో పాల్గొన్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, అనపర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమావేశంలో మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం అనేది ఒక కాన్సెప్ట్ గా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధతో ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్రగ్స్ ను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీళ్ళందరినీ ఇన్వాల్వ్ చేసి ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా మనం నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందనేది కూడా ఈ సందర్భంగా మీ అందరికీ తెలియజేస్తున్నానని తెలిపారు. తప్పనిసరిగా ఈగల్ ఎస్ఐ, సిఐ చెప్పినట్టుగా గ్రామ గ్రామాన అవగాహన కలిగించాలి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, పెదపూడి మండలం కూటమి నాయకులు, గొల్లల మామిడాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీని పరిశీలించిన ఎస్ ఎస్ ఏ ఎడిసి



**శంకవరం ఆగస్టు 22 ప్రభాతవార్త** మండల కేంద్రమైన శంఖవరం లో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ,జూనియర్ కళాశాలను, సమగ్ర శిక్ష అభియాన్ పథకం జిల్లా అదనపు సమన్వయకర్త వి.వి.వి.సత్యనారాయణ సందర్శించారు. సందర్శనలో భాగంగా నిర్మాణం లో ఉన్న ఫిజిక్స్,కెమిస్ట్రీ లాబ్ లు పరిశీలించారు. వసతి గృహం లో ఉన్న స్టాక్ ను పరిశీలించి వంట వాళ్ళకి సూచనలు ,సలహాలు అందించారు విద్యార్థులకు ఇచ్చే సాయంత్రపు స్నాక్స్ ను ,పాఠశాల పరిసరాలను పరిశీలించారు విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని విద్యుత్ తో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తయారు చేయాలని పేర్కొన్నారు. విద్యాలయంలో పలు అంశాలను ప్రత్యేక అధికారిని బాలమణి అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు రాంబాబు మురళి కూడా పాల్గొన్నారుం

## 10 పాఠశాలలకు అవసరమైన పాత్రలు బహుకరణ



**రాజవొమ్మంగి, ఆగస్టు 22, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం హెచ్. ఎం. రమేష్ బాబు అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈసందర్బంగా రాజమండ్రి పట్టణానికి చెందిన సాదు జనార్ధనరావు మెమోరియల్ సొసైటీ కి చెందిన సాదు వెంకటేశ్వరరావు 10 ప్రాథమిక పాఠశాలకు ఒక్కో పాఠశాలకు 6 కంచాలు, 6 గ్లాసులు,6 కూరలు ఒడ్డించుటకు వినియోగించే కప్పులు విరాళంగా ఇచ్చారు. దాతలు స్ఫూర్తిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈకార్యక్రమంలో హెచ్. ఎం. రమేష్ బాబు, వార్డెన్ రాజబాబు, బొడారపు కృష్ణ, బాలరాజు, సతీష్, భవాని, జ్యోతి, సమావేశ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మ దినోత్సవం



**పెదపూడి: ఆగస్టు 22: ప్రభాతవార్త:** పెదపూడి మండలం గొల్లల మామిడాడలో గొల్లల మామిడాడ బ్రహ్మకుమారిస్ ఆశ్రమంలో మెగాస్టార్ చిరంజీవి జన్మ దినోత్సవం సందర్భంగా అనపర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మరియు రాజయోగిని దిది ప్రకాష్ మణి19వ పుణ్యతిధి సందర్భంగా గొల్లల మామిడాడ బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, అనపర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డిలు ప్రారంభించారు.మెగాస్టార్ చిరంజీవి జన్మ దినోత్సవం సందర్భంగా కేక్ చేసారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇద్దరు మహోన్నతమైన వ్యక్తులకు సంబంధించి రెండు కార్యక్రమాల సందర్భంగా మనం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసుకొని ఈ కార్యక్రమంలో మనందరం పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందని ఒకటి రాజయోగిని దాది ప్రకాష్ మణి 19వ పుణ్యతిధి, మరొకటి మెగాస్టార్ చిరంజీవి జన్మదినం. ఈ రెండిటిని పురస్కరించుకొని ఇక్కడ రక్తదాన శిబిరాన్ని మనం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, పెదపూడి మండలం కూటమి నాయకులు, గొల్లల మామిడాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యాన్నదానంనకు 50 వేలు విరాళం...



**సఖినేటిపల్లి ఆగస్టు 22, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదానము నకు సఖినేటిపల్లి వాస్తవ్యులు సోమిశెట్టి సందీప్ కుటుంబ సభ్యులు రూ. 50,000 లు. వేలు విరాళముగా సమర్పించినారు. వీరికి శ్రీ స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు ప్రసాద్ శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను అందజేయుటమైనది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఏం సత్యకిరణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్,అగ్రహారంలో క్లస్టర్ మీటింగ్.



**రౌతుల పూడి, ఆగస్టు 22,(ప్రభాత వార్త)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్ శనివారం ఎస్, అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. దూర దర్శన ద్వారా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్న ఈ కార్య క్రమంలో గతంలో సాధించిన విదార్థుల విజయాలు,బదిబయట పిల్లలను బడిలో చేర్పించిన పద్ధతులు, రాబోయే పదో తరగతి పరీక్షలు కొరకు విద్యార్థులకు నూతన పద్ధతిలో విద్యాబోధన తదితర విషయాలు చర్చించారు, మండల విద్యాధికారి సతీష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 41మంది ఎస్, జి, టి లు ఇద్దరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

## వికలాంగులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం : జడ్.పి.టి.సి రంగారెడ్డి



**వి.ఆర్.పురం,ఆగస్టు 22,ప్రభాతవార్త** ప్రభుత్వం అందించే పింఛన్ కు అర్హులైన వికలాంగులందరికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందని, వి.ఆర్.పురం జెడ్.పి.టి.సి సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాళ్ళ రంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తాళ్లరేవులో ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు.



**తాళ్ళరేవు, ఆగస్టు 22 (ప్రభాతవార్త):** పద్మభూషణ్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను తాళ్లరేవులో బండారు దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరిచేలు పరిశీలించిన ఏ డి ఏ అరుణ



**కె గంగవరం,ఆగస్టు 22,(ప్రభాతవార్త):** కె గంగవరం మండలం దంగేరు గ్రామంలో శనివారం నాడు సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ క్షేత్ర స్థాయిలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రతి హృదయంలో సేవా భావం పెరగాలి’



**గోపాలపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త):** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోపాలపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో సేవా భావం పెంపొందాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## డ్రగ్స్ సరదా కాదు.. జీవితాన్ని మింగే వ్యసనం



గోపాలపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త): గోపాలపురం మండలంలో డ్రగ్స్, గంజాయి వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు మహిళలు, బాలికల భద్రతపై పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో భాగంగా గోపాలపురం మండలంలో ఉపాధ్యాయుల సమావేశాలు, అంగన్వాడీ సిబ్బంది శిక్షణ కార్యక్రమాలను వేదికగా చేసుకుని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.గోపాలపురం ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో డ్రగ్స్, గంజాయి వల్ల యువతపై కలిగే దుష్ప్రభావాలు, విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను గుర్తించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలను వివరించారు. విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.అదేవిధంగా మహిళలు, బాలికలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.డ్రగ్స్ రహిత గోపాలపురం–సురక్షిత యువత–భద్రమైన మహిళలు లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన అవగాహన సదస్సు



పెదపూడి 22 ఆగస్టు ప్రభాతవార్త: కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామం ఏ ఆర్ సి కళ్యాణ మండపంలో మాదక ద్రవ్యాల వినియోగ నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఏపీసిసి చైర్మన్ జ్యోతుల [illegible], కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, అనపర్తి నియోజకవర్గ జనసేన అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస్, ఈగల్ సీఐ జి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం విశేషంగా కృషి చేస్తున్నారు అని, ప్రభుత్వ ఉద్యోగి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, డ్రగ్ రహిత సమాజం ని నిర్వహించడంలో మరియు ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలపై ప్రతి ఉద్యోగి వారి డిపార్ట్మెంట్ లోని వారికి ప్రజలకు అవగాహన కల్పించాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి స్నేహాలు, అలవాట్లు మరియు ప్రవర్తనను గమనించాలని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, అనపర్తి నియోజకవర్గంలోని గ్రామాలని మాదకద్రవ్యాలు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మర్రెడ్డి శ్రీనివాసరావు [illegible] ఉండదు అని, డ్రగ్స్ తీసుకోకుండా కుటుంబానికి, సమాజానికి భారం కాకుండా [illegible] ఈగల్ సీఐ జి.వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ ఈగల్ అనేది మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగమని [illegible] డ్రగ్స్ వినియోగం, సరఫరా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నెం 1972 కి తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. [illegible] మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, యువత ఉజ్వల భవిష్యత్తు కోసం డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, వారి సిబ్బంది పెదపూడి మండలం పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం లు, మహిళా పోలీస్ లు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువత మరియు మహిళలు పాల్గొన్నారు.

## వీరభద్రపురం సమీపంలో ప్రమాదం.. ట్రాక్టర్-ఆటో ఢీ



అడ్డతీగల, ఆగస్టు 22, ప్రభాతవార్త అడ్డతీగల మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన గ్రామస్తులు రాజవొమ్మంగి మండలం అమ్మిరేఖల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా శనివారం వీరభద్రపురం సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారి 516పై ప్రయాణిస్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లోతా లక్ష్మి, అచ్చుల చంటమ్మ, పేరు కాంతమ్మ, రేవుల ఈశ్వరమ్మ గాయపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం 108 వాహనంలో గాయపడిన వారిని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఇద్దరికి తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం [illegible] తరలించారు. ఈ ఘటనపై అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## యానాంలో శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



యానం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త ): కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో రెడ్డి రాజుల కాలం నాటి అతి పురాతన ఆలయమైన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఈ వారం సంకర రామచంద్ర మూర్తి, కంచర్ల శ్రీనివాస్, ఎస్. గోపి, సందారి చిన్న, ముదునూరి సూరిబాబు రాజు, గిడ్లా కృష్ణవేణి తదితరులు అన్నదాన దాతలుగా వ్యవహరించారు. [illegible] సుమారు 1,400 మంది భక్తులు అన్న సమారాధన నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.ప్రతి శనివారం దాతల సహకారంతో నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు తెలిపారు. అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వాడపాలెంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట

### -రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, ఆగస్టు 22, (ప్రభాతవార్త) గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు శనివారం వాడపాలెంలో 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఏపీ బీసీ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్పర్సన్ రెడ్డి అనంత కుమారి తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనులను వివరించారు వాడపాలెంలో జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 880 మందికి రూ4.54 కోట్ల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 946 మంది తల్లులకు రూ2.44 కోట్ల తల్లికి వందనం 63 మంది రైతులకు రూ8.82 లక్షల అన్నదాత సుఖీభవ ప్రయోజనాలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు అలాగే 1 872 కుటుంబాలకు దీపం పథకం ద్వారా రూ53.14 లక్షల విలువైన ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించినట్లు వివరించారు మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులుగ్రామంలో సీసీ రోడ్లు డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు పలు ప్రాంతాల్లో రూ10 లక్షలు రూ.13 లక్షలు రూ16 లక్షలు రూ20 లక్షలు రూ50 లక్షల చొప్పున రోడ్లు డ్రైనేజీ పనులు చేపట్టినట్లు చెప్పారు మరికొన్ని ప్రాంతాల్లో రూ35 లక్షలు రూ50 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు రూ3.90 కోట్లతో వాడపాలెం కొత్తపేట రహదారి అభివృద్ధి వాడపాలెం కొత్తపేట రహదారిని వెడల్పు చేసి సుమారు రూ3.90 కోట్లతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు కార్యక్రమంలో కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పల్లి మంగాదేవి భీమారావు టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు

## కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు శాంతి యుత కార్యాచరణపై వినతిపత్రం



రాజవొమ్మంగి, ఆగస్టు 22, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయాస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు దశల వారీగా శాంతి యుత కార్యాచరణ కార్యక్రమాలను చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జడ్డంగి పి. హెచ్. సి లో కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్న ఉద్యోగులు డా. నాగార్జున కు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో మరణిస్తే వారి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, అనారోగ్యంతో ఉంటే పూర్తి జీతం, మ్యూచివల్ బదిలీలు, ఇ. పి. ఎఫ్ సౌకర్యంతో బాటు పూర్తి జీతం వంటి పలు డిమాండ్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. 24 తేదీ నుండి 27 వరకూ నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరు, 28, 29 తేదీల్లో విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసనలు, మానవహారం, ఇలా 6 తేదీ న ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద శాంతి యుత ధర్నాలు, సెప్టెంబర్ ఏడో తేదీన కలెక్టర్ కార్యాలయాలు వద్ద ధర్నాలు, వినతిపత్రం ఇవ్వడం చేయనున్నారు. రాజవొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పి. హెచ్. సి ల్లో 23 మంది కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు విధులను నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, స్టాఫ్ నర్సు శిరీష, నాగలక్ష్మి, సత్యవేణి, ఏ. ఎన్. ఎం. కుమారి, పార్మాసిస్ట్ దుర్గ, ఎఫ్. ఎన్. ఓ. పాప పాల్గొన్నారు.

## అంగన్వాడీ వర్కర్స్ కు రెండో విడత శిక్షణ.



రాజవొమ్మంగి,ఆగస్టు 22, ప్రభాతవార్తరాజవొమ్మంగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడీ వర్కర్స్ కు మూడు రోజులు జ్ఞానజ్యోతి రెండో విడత శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. సమ్మెలిత విద్య పై డిఆర్పీలు మఠం శేఖర్ బాబు, కోటం సత్యనారాయణ లు అంగన్వాడీ వర్కర్స్ కు వివరించారు. దివ్యాంగులకు అంగన్వాడీ కేంద్రాల్లో బోధన ఎలా చేయాలో తెలిపారు. ముఖ్యంగా గర్భదారణకు ముందు తరువాత పుట్టే శిశువుకు దివ్యాంగులు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 21 రకాల అంగవైకల్యాలను ఐదు రకాలుగా విభజించి విశ్లేషించారు. అంగవైకల్యానికి మేనరిక వివాహం, బాల్య వివాహాలు ప్రధాన కారణాలని శేఖర్ బాబు తెలిపారు. వివాహలపై గ్రామాల్లో మరింత అవగాహనను కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్పీలు శేఖర్ బాబు, సత్యనారాయణ, సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ, అమ్మిరాజు, 94 మంది అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## జి. కొత్తపల్లి గ్రామంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



రాజవొమ్మంగి, ఆగస్టు 22, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం వంచంగి పంచాయితీ జి. కొత్తపల్లి గ్రామ రామాలయం వద్ద శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు కార్యక్రమం చలుమర్తి విశ్వనాధ్ రెడ్డి, కాకర అర్జునరావు పర్యవేక్షణలో జరిగింది. హిందూ సాంప్రదాయ పండుగల్లో శ్రావణ మాస శుక్రవారం రోజున నిర్వహించే వరలక్ష్మి వ్రత విశిష్టతను విశ్వనాధ్ రెడ్డి వివరించారు. 25 మంది మహిళలు వరలక్ష్మి వ్రత పూజలను చేశారు ఈ కార్యక్రమంలో చలమర్తి విశ్వనాధరెడ్డి, కోసూరి సుబ్రమణ్యం, కాకర అర్జున్ బాబు,గోము వెంకటరమణ, కోసూరి పండయ్య, జి. కొత్తపల్లి గ్రామం నుంచి కొర్రాబు శ్రీనివాస్ రెడ్డి, జర్తా వెంకటరావు, కొర్రా బుజ్జి, సత్యనారాయణ, వరలక్ష్మి, యాట్ల వెంకటలక్ష్మి. జర్తా బాబ్జి, నూకరత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు

## భార్య హత్యకు భర్తే కారణం.. పోలీసుల విచారణలో వెలుగులోకి నిజం



యానం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త ) : భార్యను భర్త హత్య చేసిన ఘటన శనివారం యానాంలో కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం యానాం బీమ్మగర్కు చెందిన పువ్వల రేఖకు కనకాలపేట ఫిషర్మెన్పేటకు చెందిన చెక్క అప్పారావుతో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సిఐ డి.సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో భార్య రేఖ (26) ఛాతిపై కూర్చొని ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు అప్పారావు పోలీసులకు తెలిపాడు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి మెట్టకూరు శివారు గణపతినగర్ బైపాస్ కాలువలో పడేసి, తన భార్య కనిపించడం లేదంటూ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. అప్పారావుపై అనుమానం రావడంతో పోలీసులు విచారించగా కొంతసేపటి తర్వాత తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు చెప్పారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వద్దని చెప్పినా వినకుండా ప్రేమ వివాహం చేసుకున్న తన కుమార్తె రేఖ హత్యకు గురికావడంతో ఆమె తండ్రి పువ్వల రమేష్ కన్నీరుమున్నీరయ్యాడు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం...



సఖినేటిపల్లి ఆగస్టు 22, ప్రభాత వార్త: మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా సఖినేటిపల్లి పంచాయతీ వద్ద సఖినేటిపల్లి, మలికిపురం మండలాల చిరు పవన్ చరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడమైనది. ఈ రక్తదాన శిబిరంలో 73 మంది రక్తదానం చేసి, తన అభిమానాన్ని చాటుకున్నారు. అభిమానులు, నాయకులు, గుండుబోగుల పెద కాపు, గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, రావూరు నాగు, సరేళ్ల విజయప్రసాద్ లచే కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచినారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెగా అభిమాన నాయకులు రావి మురళి, నామన నాగభూషణం, గుండబత్తుల తాతాజీ, ఉలిశెట్టి లక్ష్మణరావు, కోళ్ల బాబి, బళ్ళ చరణ్, ముదిగొండ బుజ్జి, బళ్ల రాము, నాయుడు కృష్ణ, నామన వెంకట్, మేడిచర్ల రాము, అయినవిల్లి సత్యనారాయణ, రావి ధర్మరాజు, రమేష్ రాజు, సూరిబాబు రాజు, పప్పుల రమేష్, బుధరవతల మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆకాశం శ్రీను పుట్టినరోజు వేడుక



కాట్రేనికోన ఆగస్టు 22(ప్రభాతవార్త) కాట్రేనికోన నీటి సంఘం డీసీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు శనివారం కందికుప్పలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ, మండల వ్యాప్తంగా ఉన్న కూటమి నాయకులంతా కందికుప్పకు వచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగిడి నాగేశ్వరరావు,విత్తనాల బుజ్జి, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బండారు ఏసు , కాశి శ్రీనివాస్, గెద్దం అరుణ్, బడుగు పుల్లారావు, నూకల దుర్గ, శివశంకర్, మోహన్, బల్ల కుమార్, ఇసుకపట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే విధుల బహిష్కరణ



రామచంద్రపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త): కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లును స్టాఫ్ నర్సులు కోరారు.ఈ మేరకు శనివారం రామచంద్రపురంలో ఆయనకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే దశలవారీ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 8వ తేదీ నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టాఫ్ నర్సుల సమస్యలను ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లి,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపడతామని తెలిపారు.త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.స్టాఫ్ నర్సులంతా సంఘానికి సహకరించి,రాష్ట్ర ఏపీ ఎన్జీవో సంఘం నాయకత్వంలో ఐకమత్యంతో పనిచేస్తే సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవచ్చని అన్నారు.కార్యక్రమంలో రామచంద్రపురం తాలూకా యూనిట్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్,మహిళా విభాగం అధ్యక్షురాలు,జాయింట్ సెక్రటరీ రోజామణి,హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ,రిటైర్డ్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ బక్కి రవీంద్రతో పాటు కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

## గుమ్మళ్లదొడ్డిలో ఆక్టోపస్ రెక్కీ, మాక్‌డ్రిల్



గోకవరం: ఆగస్ట్ 22 ప్రభాత వార్త ఉగ్రవాద దాడులు వంటి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రాజమండ్రి టెర్మినల్ వద్ద ఆక్టోపస్ బృందం రెక్కీ, మాక్‌డ్రిల్ నిర్వహించింది. మంగళగిరి ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముప్పు అంచనాలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖలు సమన్వయంతో వేగంగా స్పందించే విధంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్సుల మోహరింపు, ఇతర అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందించడం, అంబులెన్సుల ద్వారా ఆసుపత్రులకు తరలించడం, పోలీస్, ఏ ఇతర శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టడం వంటి అంశాలపై సిబ్బంది తమ సన్నద్ధతను ప్రదర్శించారు. మాక్‌డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో శాఖల మధ్య సమన్వయం, స్పందించే వేగం, రక్షణ చర్యల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆక్టోపస్ బృందం సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పెంటపల్లిలో ఘనంగా ప్రారంభమైన మాతృశ్రీ ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు



గోకవరం : ఆగష్టు 22 ప్రభాత వార్త గోకవరం మండలం రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలోని పెంటపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ మాతృశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 4వ వార్షికోత్సవం, 5వ జాతర మహోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.జాతర మహోత్సవాల తొలిరోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోకవరం గ్రామానికి చెందిన వేద పండితులు శ్రీరామ్ పంతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెంటపల్లి గ్రామానికి చెందిన గారబోయిన శ్రీనివాస్ దంపతులు, సాత్రబోయిన జగదీష్ మాస్టారు దంపతులు, చనిబోయిన శ్రీనివాస్ దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పెంటపల్లికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. జాతరలో భాగంగా 22న పూజా కార్యక్రమం (హోమం), 23న భజన కార్యక్రమం, 24న అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం, 25న బోనాల సమర్పణ, 26న అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతర మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు

## మెగాస్టార్ జన్మదిన వేడుకల్లో అభిమానుల సందడి




పిఠాపురం, ఆగస్టు 22 ( ప్రభాతవార్త ) పద్మవిభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను పిఠాపురంపట్టణ మెగా ఫ్యామిలీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతి గృహంలో జరిగిన ఈ కార్యక్రమం అభిమానుల సందడితో ఉత్సాహభరితంగా సాగింది. ముఖ్య అతిథిగా దేవరపల్లి రామారావు పాల్గొని వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మెగా ఫ్యామిలీ, పవన్ కళ్యాణ్ అభిమానులు కలిసి కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదలు, విద్యార్థులకు అండగా నిలవాలని అభిమానులు ఆకాంక్షించారు.మెగాస్టార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అభిమానులకు హీరోగా మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి స్ఫూర్తినిచ్చే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ పట్టణ అధ్యక్షుడు పెదరెడ్ల నంది బాబు, ఉపాధ్యక్షుడు మాగాపు బుజ్జి, బాలిపల్లి అనిల్, పల్నాటి మధు, వార్డెన్ వెంకట్రావు, అనల శ్రీనివాస్, కే బి ఎస్ శంకర్, గారపాటి గణేష్, మాదాపూర్ సతీష్, కృష్ణుడు, విద్యార్థులు, మెగాస్టార్ అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

## ఇందుకూరుపేట లో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర.



దేవీపట్నం -ఆగష్టు 22 ప్రభాత వార్త. మండల కేంద్రమైన ఇందుకూరు పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో పరిసరాలు పరిశుభ్రత – వ్యక్తిగత పరిశుభ్రత థీమ్ పై స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి శీరసం బాలుదొర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రతి శనివారం రోజున పరిసరాలు పరిశుభ్రత –వ్యక్తిగత శుభ్రత పై అవగాహన కల్పిస్తున్నామని దీని వలన పరిసరాల పరిశు భ్రత పై విద్యార్థుల్లో అవగాహన కల్గుతుందన్నారు. ఉపాధ్యాయులు పిల్లల్లో ఈ కార్యక్రమం పై అవగాహన కలిగేలా తరగతి గదుల్లో పాఠ్యశాలతో పాటు వ్యక్తిగత పరిశు భ్రత పరిసరాలు పరిశుభ్రతా గురించి వివరించాలి అన్నారు.

## గుర్తు తెలియని మృత దేహం...



సఖినేటిపల్లి ఆగస్ట్ 22, ప్రభాత వార్త: అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో శివాలయం వెనుక భాగంలో గుర్తు తెలియని మృత దేహాన్ని కనుగొన్న గ్రామస్తులు, పోలీస్ లకు పిర్యాదు చేయగా, వివరాలు దొరకక రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామాలు చేయిస్తున్నట్లు ఎస్ ఐ దుర్గా శ్రీనివాస్ తెలియజేశారు.





తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

### సీఐ బి. నాగేశ్వర నాయక్, యస్ ఐ పి. మనోహర్



దేవరపల్లి, ఆగస్టు 22( ప్రభాతవార్త ఈ: డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. నాగేశ్వర నాయక్ కోరారు. శనివారం మండలంలో చిన్నాయిగూడెం, దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లలో నిర్వహిస్తున్న టీచర్స్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు మరియు అంగన్వాడీ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్లలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను వేదికగా చేసుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సమావేశంలో దేవరపల్లి లో సీఐ బి. నాగేశ్వర నాయక్, చిన్నాయిగూడెంలో ఎస్ఐ మనోహర్ పాల్గొని ఉపాధ్యాయులకు, డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం, సురక్షిత యువత, భద్రమైన మహిళలే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని సీఐ,బి. నాగేశ్వర్ నాయక్, యస్ ఐ పి. మనోహర్ తెలిపారు.

## తాళ్లూరు లిఫ్ట్ పనులు శరవేగం

### - సెప్టెంబర్ చివరి నాటికి రైతులకు సాగునీరులిఅందిస్తాం-నాలుగోసారి లిఫ్ట్ పనులను పరిశీలించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గండేపల్లి, ఆగస్టు 22. ప్రభాతవార్త కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద 31 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 52 కోట్ల రూపాయల వ్యయంతో జరుగుతున్న ఈ పనులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం నాలుగోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాళ్లూరు లిఫ్ట్ కు శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారని, అయితే గత ఏడు సంవత్సరాలుగా సిమెంట్ పైపులు పాడవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 52 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని, దీనిపై కూడా కొందరు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పైడిపాల సూరిబాబు, పిల్లా చంటిబాబు, రేఖ బుల్లిరాజు, జాస్తి వసంత్, ఉప్పలపాటి బుల్లెబ్బాయ్, దాసరి సీతారామకృష్ణ, పురంశెట్టి శివాజీ, సుంకవిల్లి రాజు, యర్రంశెట్టి బాబ్జి, కురుకూరి వీర వెంకట చౌదరి, శిలామంతుల వీరబాబు, పి. వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

### - ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కో చైర్మన్ తుష్టి జోగారావు



కూనవరం, ఆగస్టు 22, ప్రభాతవార్త : కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ అయ్యేవరకు 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. వారు సమ్మె నోటీసులలో పేర్కొన్న తేదీ ప్రకారం ఉద్యోగులు శనివారం సమ్మె నోటీసులను జిల్లా అధికారులకు, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లలకు అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు తెలిపారు. రెండవ రోజు కొనసాగుతున్న దశల వాతీఅ ఉద్యమం అన్ని జిల్లాలలో విజయవంతంగా నడుస్తుందని ఆయన వివరించారు. సమ్మె నోటీసులను అందించే కార్యక్రమాన్ని ఆదివారం వరకు కొనసాగించి సోమవారం నుండి నల్ల బ్యాడ్జీలను ధరించి ఉద్యోగులు విధులకు హాజరవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 8 వ తేదీ వరకు కొనసాగించి అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే విధులను బహిష్కరిస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగి డ్యూటీలో మరణిస్తే 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని తమ సమస్యలను సానుభూతితో పరిష్కరించాలని, తప్పనిసరి పరిస్థితులలో సమ్మె చేయాల్సి వస్తుందని వివరించారు. జిల్లా డీఎంహెచ్ ఓ లకు, డి సి హెచ్ ఎస్ ల లకు, పోలవరం జిల్లాలో గల ఏరియా ఆసుపత్రులకు, సిహెచ్ సి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా సూపరింటెండెంట్ లకు, మెడికల్ ఆఫీసర్లకు, సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవి ప్రసన్న కుమారి, (ల్యాబ్ ), వై. అనసూర్య (స్టాఫ్ నర్స్ ), పి. రాజమణి(స్టాఫ్ ), ఎం. తులసి, డి. దిలీప్ (ఎక్షేరే ) తదితరులు

## ఘనంగా ప్రారంభమైన వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు ..



ఆత్రేయపురం, ఆగస్టు 22,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు శ్రావణ శుద్ధ దశమి సందర్భంగా శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఆలయ ఆగమ శాస్త్రోక్త విధానాల ప్రకారం మొదటి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సంకల్పంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరణం, దీక్షాధారణ, ఆకల్మష హోమం వంటి పవిత్ర క్రతువులను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నీరాజనం, మంత్రపుష్పం సమర్పణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, వాస్తు పూజ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తుహోమం, నవమూర్తి ఆవాహనం వంటి విశిష్ట వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు కనకదుర్గ దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## రిసార్ట్ లపై తనిఖీలు



రంపచోడవరం, ఆగస్టు 22: ప్రభాతవార్త. రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు పోలవరం జిల్లా రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లో ఉన్న వివిధ రిసార్టులు, రెసిడెన్సీలపై శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా రిసార్టుల యాజమాన్యాలకు పార్టీలు, ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించే ముందు సంబంధిత ఈవెంట్ పర్మిట్ తప్పనిసరిగా పొందాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించి, నోటీసులు జారీ చేశారు. అలాగే రిసార్టుల పరిసరాల్లో ప్రమాదకరమైన వాగులు, కాలువలు లేదా ఇతర జలవనరులు ఉన్నట్లయితే, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యాటకులు స్వీయ నియంత్రణ పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాగులు, కాలువల్లోకి దిగడం వల్ల సంభవించే ప్రమాదాలపై వారికి అవగాహన కల్పించాలని యాజమాన్యాలను ఆదేశించారు. తనిఖీలలో భాగంగా రిసార్టుల కార్యకలాపాలను పరిశీలించగా, ప్రస్తుతం ఏ రిసార్టులోనూ మద్యం సంబంధిత అసాంఘిక కార్యకలాపాలు జరుగడం లేదని అధికారులు తెలిపారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps